www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 361

సోమవారం | 15-4-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి మ. 12.12 తదుపరి అష్టమి; నక్షత్రం: పునర్వసు తె. 3.05 తదుపరి పుష్యమి; వర్జ్యం: మ. 2.20-4.02; దుర్ముహూర్తం: మ. 12.40-1.29, మ. 3.09-3.58; అమృతఘడియలు: రా. 12.32-2.14; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.27

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దర్యాప్తునకు ఆరు బృందాలు

ఐపీసీ 307 కింద కేసు నమోదు

సైబర్ ల్యాబ్‌లో వీడియోల విశ్లేషణ

అదుపులో దాడి అనుమానితులు?

గులకరాయి కేసు సీబీఐకి ఇవ్వాలి

ఈసీని కోరిన ఎన్డీయే నేతలు



శనివారం అర్ధరాత్రి చికిత్స అనంతరం బెజవాడ ప్రభుత్వాస్పత్రి ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులు, సిబ్బందితో కలిసి జగన్ గ్రూప్ ఫొటో

గులకరాయితో హత్యాయత్నమా?

స్వీయ దర్యాప్తులో తేల్చేసిన జగన్ రోత మీడియా

ఎయిర్ గన్‌తో కాల్చారని టీవీలో కథనం

రాయి విసిరారంటూ పత్రికలో రాతలు

నుదుటిపై చిన్న గీతకే ప్రాణం పోతుందట

అదే నిజమంటూ పోలీసుల ఎఫ్ఐఆర్

గతంలో టీడీపీ నేతపై వైసీపీ రౌడీలు చువ్వలతో దాడి చేస్తే సాధారణ సెక్షన్

తాజా ఘటనపై హత్యాయత్నం కేసు

విజయవాడ పోలీసుల తీరుపై విస్మయం

ఆపరేషన్ థియేటర్లో ఫొటోలపైనా విమర్శలు

గత ఎన్నికల ముందూ దాడి డ్రామాలు

విశాఖలో జగన్ అభిమాని కోడికత్తితో దాడి

వివేకా హత్యను గుండెపోటుగా చిత్రీకరణ

ఆ తర్వాత నారాసుర రక్తచరిత్ర అంటూ రాతలు

• ముందే తెలుసా..?

జగన్‌పై విసిరిన గులకరాయి పాఠశాల భవనం వైపు నుంచి వచ్చిందంటూ సాక్షి టీవీలో ఎర్రని రింగ్ వేసి పదే పదే చూపించారు. సాధారణంగా ముఖ్యమంత్రి సభలో కెమెరామన్ ఆయన్ను కవర్ చేస్తారు. లేదా సభకు వచ్చిన ప్రజలను కవర్ చేస్తారు. కానీ బస్సుపై ఓపెన్ టాప్‌పై ఉన్న జగన్ వైపు వస్తున్న రాయి దిశగా కెమెరామన్ ఎందుకు తిప్పారు? దెబ్బ తగలక ముందే ఆ రాయిని ఎలా వీడియో తీయగలిగారు? ఏదైనా శబ్దం వస్తే కెమెరా అటు వైపు తిప్పారని భావించవచ్చు. కానీ ఎలాంటి శబ్దం రాకున్నా ఎలా కవర్ చేశారు? అటువైపు నుంచే రాయి వేస్తారని కెమెరామన్‌కు ముందే ఎలా తెలుసు? అన్న సందేహాలు వస్తున్నాయి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

చిన్న గులకరాయితో కొడితే మనిషి చనిపోతాడా..? ఎవరినైనా చంపాలనే ఉద్దేశం ఉన్న వ్యక్తి గులకరాయితో దాడి చేస్తాడా..? అవుననే అంటున్నారు విజయవాడ పోలీసులు. అది కూడా సామాన్యుడిని కాదు.. వందలాది మంది సాయుధ పోలీసుల రక్షణలో ఉండే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై గులకరాయితో హత్యాయత్నం చేశారట. జగన్ సొంత రోత మీడియా దర్యాప్తులో ఈ విషయాన్ని తేల్చేసింది. అదే

మిగతా 11వ పేజీలో...

రాయి దెబ్బ రివర్స్!

జగన్ డ్రామాను నమ్మని జనం

కోడికత్తి దాడి 2.0గా ఎద్దేవా

చంద్రబాబుపై రాయి దాడి

బారికేడుకు తగిలి కిందపడిన రాయి

గాజువాక సభలో తప్పిన ప్రమాదం

అప్రమత్తమైన బాబు భద్రతా సిబ్బంది

క్లెమోర్ మైన్స్ దాడికే భయపడలేదు.. రాళ్లకు భయపడతానా..?: చంద్రబాబు

జగన్‌పై ఎవరో గులకరాయి వేస్తే... నాపై రాళ్లు వేయిస్తారా..?

ఆయనపై రాళ్లు వేసి 24 గంటలైనా ఎందుకు చర్యలు తీసుకోలేదు?

సీఎస్, డీజీపీ ఏం చేస్తున్నారు: బాబు

పవన్ ర్యాలీలోనూ రాయి కలకలం

యువకుడిని కొట్టి పోలీసులకు అప్పగించిన జన సైనికులు



చంద్రబాబు పైకి ఆగంతకుడు విసిరిన రాయి

విశాఖపట్నం/తెనాలి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి విశాఖపట్నం నగర పరిధిలోని పాతగాజువాక జంక్షన్‌లో జరిగిన సభలో పాల్గొన్న ఆయనపై గుర్తుతెలియని వ్యక్తి రాయి విసిరాడు. ఆ రాయి చంద్రబాబు ఉన్న వాహనం ముందున్న ఇనుప బారికేడ్‌కు తగిలి కింద పడిపోయింది. అయితే గట్టిగా శబ్దం రావడంతో చంద్రబాబు భద్రతా సిబ్బంది, పోలీసులు అప్రమత్తమయ్యారు. గాజువాక సభలో రాత్రి 7.17 గంటలకు చంద్రబాబు

మిగతా 11వ పేజీలో...

కొండలను మింగిన అనకొండ జగన్

ఈ సీఎం రుషికొండనూ వదల్లేదు: చంద్రబాబు



ఐదేళ్లలో ఉత్తరాంధ్రను ఐదుగురు ఊడ్చేశారు

జగన్‌రెడ్డి, సాయిరెడ్డి, సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, సజ్జల వనరులన్నీ మింగేశారు

మేమొచ్చాక స్కాంలు చేసినవారిని ఉక్కుపాదంతో అణచివేస్తాం

రాష్ట్రాభివృద్ధికి కంపెనీలు రావాలి.. ఈ సీఎం ఉన్నవాటినీ తరిమేశాడు

నేనొస్తే పారిశ్రామిక వెలుగులు, జగన్ వస్తే గంజాయి వనాలు

ఈ ముఖ్యమంత్రి దళిత ద్రోహి.. పేదల రక్తం తాగే జలగ

పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం.. ఇప్పటికే ఇచ్చినవి రద్దు చేయం

ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక పాలసీ.. ప్రజాగళంలో బాబు హామీలు

పాయకరావుపేట/విశాఖపట్నం/గాజువాక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలోని ఐదుగురు ఉత్తరాంధ్రను ఊడ్చేశారని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. సీఎం జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వనరులను దోచుకున్నారని దుయ్యబట్టారు. కొండలను సైతం అనకొండలా మింగేశారని,

మిగతా 12వ పేజీలో...

జగన్.. నీ డ్రామాలు ఆపు!

నీకు గులకరాయి తగిలితే ఈ రాష్ట్రానికి గాయమైనట్టా?.. 30 వేల మంది మహిళలు, యువతులు అదృశ్యమైతే రాష్ట్రానికి గాయం కాలేదా?.. నువ్వే రాయితో కొట్టుకున్నావేమో!.. నిన్ను ఎలా నమ్మాలి!

ఆనాడు చంద్రబాబుపై రాళ్ల వర్షం.. అప్పుడు కనీసం అయ్యో అనలేదే.. జగన్‌కు డబ్బు మదమెక్కింది

ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఆదుకుంటాం.. ఆర్యవైశ్యులకూ అండ.. ఉద్యోగులకు 5లోపే వేతనాలు: పవన్

2



క్షిపణుల వర్షం

ముందుగా హెచ్చరించినట్లే ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి

బాలిస్టిక్, క్రూయిజ్ మిసైల్స్, కామికేజ్ సూసైడ్ డ్రోన్ల ప్రయోగం

దీటుగా ఎదుర్కొన్న ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్

సహకరించిన అమెరికా రక్షణ వ్యవస్థలు

100 శాతం డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణుల కూల్చివేత

120 బాలిస్టిక్ క్షిపణుల్లో ఇజ్రాయెల్‌ను తాకింది 17 మాత్రమే

10 ఏళ్ల బాలికకు తీవ్ర గాయాలు.. ఐడీఎఫ్ స్థావరం ధ్వంసం

ప్రతీకారం తప్పదు: ఇజ్రాయెల్.. రక్షణగా ఉంటాం: బైడెన్

అమెరికా పాల్గొంటే ఇరాన్‌కు అండగా ఉంటాం: రష్యా

పరిస్థితిని పరిశీలిస్తున్నామన్న భారత్



టెహ్రాన్/టెల్‌అవీవ్, ఏప్రిల్ 14: ప్రపంచంలోనే అతిపెద్ద మిలటరీ శక్తుల్లో 14వ స్థానంలో ఉన్న ఇరాన్ అన్నంత పనీ చేసింది. ఈ నెల 1న సిరియా రాజధాని డమాస్కస్‌లో ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లో తమ ఆర్మీ కమాండర్, మరో 12 మంది అధికారుల మృతితో ప్రతీకారేచ్ఛతో రగిలిన ఇరాన్.. శనివారం రాత్రి 11 గంటల సమయంలో(భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు) ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, సూసైడ్ డ్రోన్లతో విరుచుకుపడింది. గత ఏడాది అక్టోబరు 7న హమాస్‌తో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి లెబనాన్ భూభాగం నుంచి దాడులు చేస్తున్న హిజ్బుల్లా ఉగ్రవాదులు కూడా శనివారం రాత్రి ఇజ్రాయెల్ ఉత్తరాదిపై శతఘ్నులు, క్షిపణులను

మిగతా 2వ పేజీలో...


శత్రు క్షిపణులపై ఇజ్రాయెల్ బ్రహ్మాస్త్రం.. యారో

ప్రపంచంలోనే తొలి యాంటీ టాక్టికల్ బాలిస్టిక్ మిసైల్ రక్షణ వ్యవస్థ

2400 కి.మీ. నుంచి దూసుకొచ్చే క్షిపణులకు మార్గమధ్యంలోనే చెక్

అదానీ, అజూర్ విద్యుత్‌కు పచ్చజెండా

3



సెకీ ద్వారా యూనిట్ రూ.2.49కు కొనుగోలు

ఆ రెండు సంస్థలకు 25 ఏళ్లలో రూ.958.12 కోట్ల చెల్లింపు

ఫెయిర్‌నెస్ క్రీమ్‌లతో కిడ్నీలకు హాని

వాటిలోని పాదరసంతో ప్రభావం

తాజా అధ్యయనంలో వెల్లడి

2

టవర్ లేకున్నా మొబైల్ కమ్యూనికేషన్!

శాటిలైట్ కనెక్టివిటీతో స్మార్ట్ ఫోన్లు

చైనా విప్లవాత్మక ఆవిష్కరణ

6



బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న మోదీ. చిత్రంలో షా, రాజ్‌నాథ్, నడ్డా, నిర్మల

దక్షిణ భారత్‌కూ బుల్లెట్ రైలు

తూర్పు, ఉత్తర ప్రాంతాలకు కూడా.. 'ఒకే దేశం ఒకే ఎన్నిక' నిర్వహిస్తాం

ఇంటింటికీ నీరు, పైప్‌లైన్‌తో గ్యాస్.. మధ్య తరగతికి 3 కోట్ల పక్కా ఇళ్లు

అన్నదాతలందరికీ డ్రోన్లు.. 70 దాటినవారికి 5 లక్షల ఉచిత వైద్యం

'ముద్ర' పరిమితి.. రూ. 20 లక్షలకు!.. ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం

మరో ఐదేళ్లు ఉచిత రేషన్ అందిస్తాం.. బీజేపీ మేనిఫెస్టోలో హామీలు

6

కుంభకర్ణుడిలా జగన్



ఎన్నికలకు ఆర్నెల్ల ముందు నిద్రలేచాడు.. 6 వేల పోస్టులకే డీఎస్సీ

ఆ ఉద్యోగాలు వచ్చేవా.. సచ్చేవా.. జగన్ హామీలన్నీ మద్యం షాపుల్లోనే!

అధికారంలోకి వస్తే రాష్ట్రానికి పదేళ్లు హోదా ఇస్తాం: షర్మిల

12

దాడికీ మేము సిద్ధం: నెతన్యాహు



ఇరాన్ దాడిపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అత్యవసర క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో సింహభాగం మంత్రులు ఇరాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం నెతన్యాహు మీడియాతో మాట్లాడారు. తాము ఆత్మరక్షణ(డిఫెన్స్), దాడి(అఫెన్స్)కు సర్వసన్నద్ధంగా ఉన్నామన్నారు. "ఆత్మరక్షణ కోసం మేము ప్రత్యేక వ్యవస్థను రూపొందించుకున్నాం. ఆత్మరక్షణకు ఎంతలా సిద్ధంగా ఉన్నామో.. దాడులకు కూడా అంతే సర్వసన్నద్ధంగా ఉన్నాం" అని వ్యాఖ్యానించారు. అయితే బైడెన్ చొరవతో నెతన్యాహు ప్రతిదాడి జోలికి వెళ్లకపోవచ్చంటూ ఇజ్రాయెల్ అధికారిక వార్తాసంస్థ యెదియోత్ అహ్రోనోత్(వైనెట్) ఓ కథనాన్ని ప్రసారం చేసింది.

ఇజ్రాయెల్‌కు మా అండ: బైడెన్



ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి జరిగిన వెంటనే.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వరుస భేటీల్లో బిజీ అయ్యారు. అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ సీఐఏ, నిఘా సంస్థ, జాతీయ భద్రత తదితర విభాగాల అధికారులతో భేటీ అయ్యారు. ఆ తర్వాత జీ7 దేశాధినేతలతో భేటీకి ఏర్పాట్లు చేశారు. నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడి, ఎప్పటికప్పుడు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. "ఇజ్రాయెల్‌కు అండగా ఉంటాం. ఉక్కు పిడికిలితో ఇజ్రాయెల్‌కు రక్షణగా నిలుస్తాం" అని వ్యాఖ్యానించారు. ఇరాన్ భీకర దాడులను ఎదుర్కొని, శత్రువును ఓడించడంలో ఇజ్రాయెల్ అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శించిందని కొనియాడారు. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను కూల్చివేయడంలో సాయం చేశామన్నారు. ఇజ్రాయెల్‌కు మద్దతును కొనసాగిస్తామని చెప్పారు.

మేం కూడా రంగంలోకి దిగుతాం: పుతిన్



ఇరాన్-ఇజ్రాయెల్ విభేదాలను పరిశీలిస్తున్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ఒకవేళ ఇజ్రాయెల్ తరఫున అమెరికా ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొంటే.. ఇరాన్ తరఫున తాము రంగంలోకి దిగుతామని హెచ్చరించారు. అదే జరిగితే.. రష్యాకు అండగా ఉత్తరకొరియా, చైనా కూడా యుద్ధంలో పాల్గొనే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే.. ఈ యుద్ధంలో అమెరికా పాల్గొనబోదని వైట్‌హౌస్ వర్గాలు చెప్పినట్లు 'రాయిటర్స్' కథనం ప్రచురించింది.

ఇజ్రాయెల్ ప్రతిస్పందిస్తే మరింత తీవ్రం: ఖమేనీ



ఇజ్రాయెల్ సిరియాలోని తమ అధికారుల భవనంపై దాడిచేసి, 13 మందిని హతమార్చడానికి శిక్షగా ఆ దేశంపై దాడి చేసినట్లు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ స్పష్టం చేశారు. తమ దాడికి ఇజ్రాయెల్ ప్రతిస్పందించి మరోమారు తప్పుచేస్తే.. పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.

క్షిపణుల వర్షం



(మొదటి పేజీ తరువాయి)

ప్రయోగించారు. దీంతో పశ్చిమాసియాపై ఒక్కసారిగా యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ మేరకు.. ఇజ్రాయెల్‌పై 185 కామికేజ్ డ్రోన్లు, 120 బాలిస్టిక్ క్షిపణులు, 36 క్రూయిజ్ క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) కూడా ఆదివారం తన అధికారిక టెలిగ్రామ్ చానల్‌లో ఈ విషయాన్ని నిర్ధారిస్తూ.. ఇరాన్ దాడిని 99% అడ్డుకున్నట్లు ప్రకటించింది. తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు-- ఐరన్‌డోమ్, యారో డిఫెన్స్ సిస్టమ్ ఇరాన్ దాడులను సమర్థంగా ఎదుర్కొన్నట్లు పేర్కొంది. "ఇరాన్ ప్రయోగించిన 185 కామికేజ్ డ్రోన్లను 100% గాల్లోనే కూల్చేశాం. 36 క్రూయిజ్ క్షిపణులను కూడా కూల్చివేశాం. 120 బాలిస్టిక్ క్షిపణుల్లో 103 గాల్లోనే నిర్వీర్యమవ్వగా.. పదిహేడు మాత్రమే ఇజ్రాయెల్ నేలను తాకాయి" అని వివరించింది. ఈ ఘటనలో ఐడీఎఫ్‌కు చెందిన ఓ స్థావరం దెబ్బతిన్నదని, 10 ఏళ్ల ఓ బాలికకు తీవ్ర గాయాలైనట్లు పేర్కొంది.

ఇజ్రాయెల్‌కు అమెరికా, బ్రిటన్ సాయం

దాడి చేస్తామంటూ ఇరాన్ ప్రకటన చేసినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని, ఉక్కు పిడికిలితో దాడులను అడ్డుకుంటామని ప్రకటిస్తూ వచ్చారు. అమెరికా ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్స్‌ను ఎప్పటికప్పుడు ఇజ్రాయెల్‌తో షేర్ చేసుకున్నారు. శనివారం కూడా.. ఏ క్షణాన్నైనా ఇరాన్ దాడులు చేస్తుందంటూ హెచ్చరించారు. శనివారం రాత్రి జరిగిన దాడుల్లోనూ.. పలు బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లను తాము అడ్డుకున్నామని అమెరికా నౌకాదళం స్పష్టం చేసింది. "ముందు నుంచే మధ్యధరా సముద్రంలో మా యుద్ధ నౌకలను మోహరించాం. ఇరాన్ ప్రయోగించిన 70కి పైగా డ్రోన్లు, మూడు బాలిస్టిక్ క్షిపణులను మా ఇంటర్‌సెప్టర్లు కూల్చివేశాయి" అని అమెరికా నౌకాదళం అధికారులు వివరించారు. మరోవైపు బ్రిటన్ కూడా పశ్చిమాసియాలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థకు వ్యతిరేకంగా మోహరించిన తన యుద్ధ నౌకలను ఇజ్రాయెల్‌కు అండగా తరలించింది. అయితే.. శనివారం రాత్రి జరిగిన దాడిలో ఇంటర్‌సెప్టర్ సాయాన్ని ఇజ్రాయెల్‌కు అందించిందా? లేదా? అన్నదానిపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

ఐరాస ఆందోళన.. సమర్థించుకున్న ఇరాన్

ఇరాన్ జరిపిన దాడిపై ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఆందోళన వ్యక్తం చేసింది. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ఈ దాడిని ఖండించారు. ఇరుపక్షాలు సంయమనం పాటించాలని.. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పాలని కోరారు. ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు డెన్నిస్ ఫ్రాన్సిస్ కూడా ఈ దాడిపై తీవ్రంగా స్పందించారు. "ఇరాన్ దాడి వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. దీని పరిష్కారానికి వివేకవంతంగా ఆలోచించి ముందుకు వెళ్లాలి. శాంతియుత చర్చలే ఈ సమస్యకు పరిష్కారం. ఇరాన్ ప్రభుత్వం మా మాటను గౌరవిస్తుందని ఆశిస్తున్నా. ఈ ఉద్రిక్తత ఇక్కడితో ఆగిపోతుందని భావిస్తున్నా" అని ఆయన వ్యాఖ్యానించారు. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని కోరారు. అయితే.. ఐరాసలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇర్వానీ తమ దాడులను సమర్థించుకున్నారు. "ఐరాస రాజ్యాంగంలోని 51వ అధికరణ మేరకు మాకు ఆత్మరక్షణ హక్కు ఉంది. కేవలం ఆత్మ రక్షణ కోసమే ఇజ్రాయెల్‌పై దాడి చేశాం. ఇజ్రాయెల్ ఏదైనా దుస్సాహసానికి దిగితే.. మా స్పందన మరింత తీవ్రంగా ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు ఐరాసలో ఇజ్రాయెల్ శాశ్వత ప్రతినిధి గిలాడ్ ఎర్డాన్ తాజా దాడిపై ఐరాస భద్రతామండలిని ఆశ్రయించారు. ఇజ్రాయెల్‌పై దాడిచేసిన ఐఆర్‌జీసీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని ఓ లేఖ రాశారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా భద్రతామండలికి లేఖ రాసింది.

జీ7 దేశాధినేతలతో భేటీకి బైడెన్ చర్యలు


పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటుండడంతో.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జీ7(కెనెడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్, అమెరికా) దేశాధినేతలతో భేటీ అయ్యేందుకు సన్నాహాలు చేశారు. ఇరాన్ దాడి జరిగిన తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు జీ7 భేటీ అత్యవసరమని బైడెన్ భావిస్తున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి.

భారత్ ఆందోళన

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం పెరుగుతుండడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితిని పరిశీలిస్తున్నామని, ఇరుపక్షాలు శాంతిని నెలకొల్పాలని భారత విదేశాంగ శాఖ కోరింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించాలని.. చర్చలతోనే అది సాధ్యమని 'ఎక్స్'లో అభిప్రాయపడింది. ఇజ్రాయెల్‌లోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇజ్రాయెల్‌లోని భారతీయుల కోసం అక్కడి ఎంబసీ హెల్ప్‌లైన్ నంబర్లను(+972-5475207112, +972-543278392) విడుదల చేసింది. మరోవైపు.. హార్ముజ్ జలసంధి సమీపంలో ఇరాన్ స్వాధీనం చేసుకున్న నౌకలోని 17 మంది భారతీయుల విడుదల కోసం అక్కడి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు విదేశాంగ శాఖ వివరించింది. కాగా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. విస్తారా, ఇండిగో, ఇతర అంతర్జాతీయ విమానయాన సంస్థలు కూడా ఇరాన్, ఇజ్రాయెల్ గగనతలాల మీదుగా విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు పేర్కొన్నాయి.

కెవిన్ పీటర్సన్ విమానం దారి మళ్లింపు

ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ ఇరాన్ దాడుల కారణంగా తన విమానం దారి మళ్లిందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ముంబైలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లో కామెంటరీ ఇవ్వడానికి ఇంగ్లండ్ నుంచి వస్తున్న తన విమానాన్ని ఇరాన్ క్షిపణి దాడుల కారణంగా దారి మళ్లించినట్లు చెప్పారు. "మా విమానాన్ని రీ-రూట్ చేశారు. పెరిగిన దూరానికి అనుగుణంగా ఇంధనాన్ని నింపుకొన్నాక.. భారత్‌కు మళ్లించారు" అని ఆయన వ్యాఖ్యానించారు.



ఈ నెలలోనే ఇజ్రాయెల్ వెళ్లిన 500 మంది భారత కార్మికులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడితో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో.. నిర్మాణ రంగంలో పనుల కోసం ఇజ్రాయెల్ వెళ్లిన భారతీయ కార్మికుల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని నెలలుగా ఇజ్రాయెల్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా అక్కడ నియామకాలకు భారత ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని పలువురు నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఈ నెలలోనే 500 మంది కార్మికులు జాతీయ నైపుణ్య అభివృద్ధి మండలి(ఎన్ఎస్‌డీసీ) ద్వారా ఇజ్రాయెల్ వెళ్లారు. మంగళవారం మరో 325 మంది బయలుదేరి వెళ్లాల్సి ఉంది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడితో వారి ప్రయాణం ఆగిపోయింది. నియామక ప్రక్రియను కూడా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఎన్ఎస్‌డీసీ వర్గాలు తెలిపాయి. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రదాడి తర్వాత పాలస్తీనాకు చెందిన లక్ష మందికి పైగా అరబ్ ముస్లిం కార్మికులను తొలగించారు. దీంతో కుంటుపడిన నిర్మాణ రంగాన్ని పట్టాలెక్కించేందుకు ఇజ్రాయెల్ భారత్ నుంచి కార్మికులను రప్పించుకుంటోంది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కర్నూలు	41.3	27.7
అనంతపురం	40.0	24.0
తిరుపతి	38.8	25.2
విజయవాడ	38.7	25.8
ఒంగోలు	36.5	29.5
విశాఖపట్నం	36.0	26.4

ఫెయిర్‌నెస్ క్రీమ్‌లతో కిడ్నీలకు హాని!

- వాటిలోని పాదరసంతో ప్రభావం
- తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: మీ చర్మ సౌందర్యం కోసం ఫెయిర్‌నెస్ క్రీమ్ వాడుతున్నారా? టీవీల్లో కనిపించే ప్రకటనలకు ఆకర్షితులై ఆ క్రీమ్‌లను ట్రై చేస్తున్నారా? అయితే ఇలాంటివాటి వాడకం వల్ల భారత్‌లో కిడ్నీ సమస్యలు పెరుగుతున్నట్టు ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఈ క్రీమ్‌లలో ఉండే పాదరసం మూత్రపిండాలకు హాని కలిగిస్తున్నట్టుగా తేలింది. అధ్యయన వివరాలను కిడ్నీ ఇంటర్నేషనల్ అనే మెడికల్ జర్నల్‌లో ప్రచురించారు. అధిక పాదరసం ఉన్న క్రీమ్‌ల వాడకం వల్ల మెంబ్రానస్ నెఫ్రోపతి (ఎంఎన్) కేసులు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితి కిడ్నీ ఫిల్టర్లను దెబ్బతీయడమేకాకుండా ప్రొటీన్ లీకేజీకి కారణమవుతుందని అధ్యయనం పేర్కొంది. ఎంఎన్ అనేది ఆటోఇమ్యూన్ డిసీజ్. దీని ఫలితంగా నెఫ్రోటిక్ సిండ్రోమ్ ఏర్పడుతుంది. ఇది మూత్రంలో ఎక్కువ ప్రొటీన్ విసర్జించేలా చేస్తుంది. 2021 జూలై నుంచి 2023 సెప్టెంబరు మధ్య నమోదైన 22 ఎంఎన్ కేసులను పరీక్షించారు. చర్మం ద్వారా పాదరసం శరీరంలోకి వెళ్లి మూత్రపిండాల ఫిల్టర్లను ప్రభావితం చేస్తుందని, ఇది నెఫ్రోటిక్ సిండ్రోమ్ కేసుల పెరుగుదలకు దారితీస్తుందని పరిశోధకుల్లో ఒకరైన ఆస్టర్ ఎంఐఎంఎస్ హాస్పిటల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ నెఫ్రాలజీ డాక్టర్ సజీష్ శివదాస్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ బ్రహ్మాస్త్రం.. యారో

ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలో అత్యంత శక్తిమంతమైనది

- 2400 కి.మీ. నుంచి దూసుకొచ్చే క్షిపణులకు మార్గమధ్యంలోనే చెక్
- ఆ వ్యవస్థ సాయంతోనే.. ఇరాన్ క్షిపణులను కూల్చివేసిన ఇజ్రాయెల్

పాత పౌరాణిక సినిమాల్లో యుద్ధాలు గుర్తున్నాయా? కర్ణుడు ఆగ్నేయాస్త్రం వేస్తే.. అర్జునుడు సింపుల్‌గా వారుణాస్త్రం వేస్తాడు! రెండు బాణాలూ అర్ధ చంద్రాకారంలో పైకెళ్లి ఒకదాన్నొకటి ఢీకొంటాయి!! కాసేపటికి.. వారుణాస్త్రంలోని నీళ్లు ఆగ్నేయాస్త్రంలోని అగ్గిని ఆర్పేస్తాయి! ఇప్పుడు ఆ సీన్‌లో బాణాలకు బదులు రెండు క్షిపణులను ఊహించుకోండి. డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడ్డ ఇరాన్‌కు.. ఇజ్రాయెల్ ఇదే రీతిలో బదులిచ్చింది. ఇరాన్ తనపైకి ప్రయోగించిన క్షిపణులను.. అత్యంత సమర్థవంతమైన తన 'యారో రక్షణ వ్యవస్థ'ను ఉపయోగించి మధ్యలోనే కూల్చేయగలిగింది. ఏమిటా యారో వ్యవస్థ అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే.. ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ గురించి పూర్తిగా తెలుసుకోవాలి. పుట్టుకతోనే చుట్టూ పుట్టెడు శత్రువులను సంపాదించుకున్న దేశం ఇజ్రాయెల్. లెబనాన్‌లోని హెజ్బొల్లా, సిరియా, ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల ఉగ్రవాద గ్రూపులు, యెమెన్‌లోని హౌతీలు, గాజా స్ట్రిప్‌లోని హమాస్ నుంచి ఆ దేశం తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. వేలాది రాకెట్లు, క్షిపణులను కలిగి ఉన్న ఆయా గ్రూపులకు ఆర్థిక అండ ఇరాన్. ఇలా చుట్టూ వేర్వేరు దూరాల్లో పొంచి ఉన్న ఈ గ్రూపులు, వాటికి మద్దతుగా ఉన్న ఇరాన్ చేసే గగనతల దాడుల నుంచి రక్షించుకోవడం కోసం ఇజ్రాయెల్ మూడంచెల గగనతల రక్షణ వ్యవస్థను రూపొందించుకున్నది. ఆ దశలు వరుసగా.. ఐరన్ డోమ్, డేవిడ్స్ స్లింగ్, యారో-3.


ఐరన్ డోమ్: ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థల గురించి చెప్పగానే చాలా మందికి గుర్తొచ్చేది ఈ ఐరన్ డోమే. 4-70 కిలోమీటర్ల దూరం నుంచి దూసుకొచ్చే స్వల్పశ్రేణి రాకెట్లు, ఆర్టిలరీ షెల్స్‌ను దారిలోనే అడ్డుకుని తునాతునకలు చేసేందుకు ఇజ్రాయెల్ రూపొందించుకున్న వ్యవస్థ ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే.. హమాస్ దాడులను నిరోధించడానికి అభివృద్ధి చేసుకున్న వ్యవస్థ. దీంట్లో డిటెక్షన్ అండ్ రాడార్ ట్రాకింగ్ వ్యవస్థ, బ్యాటిల్ మేనేజ్‌మెంట్ అండ్ వెపన్ కంట్రోల్ వ్యవస్థ, మిసైల్ ఫైరింగ్ యూనిట్ ఉంటాయి. ఇవి 24 గంటలూ, అన్ని రకాల వాతావరణాల్లోనూ అప్రమత్తంగా ఉంటాయి. ఈ వ్యవస్థ సక్సెస్ రేటు 90 శాతం. తొలుత దీనికి 'గోల్డెన్ డోమ్' అనే పేరు పెడదామనుకున్నారు.

డేవిడ్స్ స్లింగ్: బైబిల్ కథల్లో డేవిడ్ అండ్ గోలియత్ కథలో.. మహాకాయుడైన గోలియత్‌ను సాధారణ గొర్రెల కాపరి అయిన డేవిడ్ వడిశెల రాయితో పడగొడతాడు! ఆ కథలో డేవిడ్ వాడిన వడిశెల రాయి స్ఫూర్తిగా పెట్టిన పేరు ఇది. 40-300 కిలోమీటర్ల పరిధి నుంచి దూసుకొచ్చే డ్రోన్లు, టాక్టికల్ బాలిస్టిక్ మిసైళ్లు, మీడియం-టు-లాంగ్ రేంజ్ రాకెట్లు, క్రూయిజ్ మిసైళ్లను స్టన్నర్ అనే ఇంటర్‌సెప్టర్‌తో మార్గమధ్యంలోనే అడ్డుకునే వ్యవస్థ ఈ డేవిడ్స్ స్లింగ్. ఇజ్రాయెల్ దీన్ని లెబనాన్, సిరియా సరిహద్దుకు సమీపంలో మోహరించింది.

యారో-3: ఇరాన్, యెమెన్ నుంచి దూసుకొచ్చే లాంగ్ రేంజ్ క్షిపణులను సమర్థంగా నాశనం చేయడానికి అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ అభివృద్ధి చేసుకున్న గగనతల రక్షణ వ్యవస్థ ఇది. ప్రపంచంలోనే తొలి యాంటీ-టాక్టికల్ బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ సిస్టమ్‌గా దీనికి పేరుంది. వెయ్యికి పైగా కిలోమీటర్ల దూరం నుంచి దూసుకొచ్చే బాలిస్టిక్ క్షిపణులను భూవాతావరణానికి పైనే ఢీకొట్టే వ్యవస్థ ఇది. తాజాగా ఇరాన్ చేసిన దాడిని ఇజ్రాయెల్ దీని సాయంతోనే తిప్పికొట్టింది. ఇరాన్ ప్రయోగించిన 131 బాలిస్టిక్ క్షిపణుల్లో 124 క్షిపణులను, 170 డ్రోన్లను, 30 క్రూయిజ్ క్షిపణులను యారో వ్యవస్థ కూల్చేసిందని ఇజ్రాయెల్ ఆర్మీ వర్గాలు ప్రకటించాయి. 2023 నవంబరులో.. యెమెన్ నుంచి హౌతీలు ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని ఇజ్రాయెల్ ఈ యారో-3 వ్యవస్థ ద్వారానే సమర్థంగా అడ్డుకుంది. కాగా.. దీనికన్నా సమర్థంగా పనిచేసే యారో-4 రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ఇజ్రాయెల్, అమెరికా కలిసి పనిచేస్తున్నాయి. ఇవికాక, పేట్రియాట్ పేరుతో అమెరికా రూపొందించిన రక్షణ వ్యవస్థను కూడా ఇజ్రాయెల్ చాలాకాలంగా ఉపయోగిస్తోంది. 1991లో గల్ఫ్ యుద్ధం సమయంలో ఇరాక్ ప్రయోగించిన స్కడ్ మిసైళ్లను అమెరికా ఈ వ్యవస్థ సాయంతోనే కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఆ పేట్రియాట్ వ్యవస్థను ఇప్పుడు ఇజ్రాయెల్.. విమానాలను, డ్రోన్లను కూల్చేయడానికి ఉపయోగిస్తోంది. అలాగే, లేజర్ టెక్నాలజీ సంబంధిత ముప్పులను ఎదుర్కొనడానికి ఆ దేశం 'ఐరన్ బీమ్' అనే వ్యవస్థను కూడా అభివృద్ధి చేస్తోంది.

- సెంట్రల్ డెస్క్

ఇజ్రాయెల్ రక్షణ ఛత్రం



ఎవరీ రివల్యూషనరీ గార్డ్స్?



ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ)..! ఇజ్రాయెల్‌పై దాడిలో వినిపిస్తున్న పేరిది. ఎవరీ గార్డ్స్? అంటే ఇరాన్‌కు చెందిన సమాంతర సైనిక వ్యవస్థ. ఇరాన్ రాజు (షా)మొహమ్మద్ రెజా పహ్లవి ప్రభుత్వం పతనం తర్వాత మతవాద నాయకుల సైద్ధాంతిక ఆలోచనల మేరకు 1979లో ఇస్లామిక్ విప్లవం అనంతరం ఏర్పాటైంది ఐఆర్‌జీసీ.ఇప్పుడు ఇజ్రాయెల్‌పై దాడి వెనుకున్నది వీరే. త్రివిధ దళాలు.. 1.90లక్షల మందిపైగా సభ్యులతో హెజ్బొల్లా, పాలస్తీనా ఉగ్రసంస్థలకు సాయం అందిస్తోంది. అత్యంత బలమైన దళంగా ఎదిగిన గార్డ్స్.. "ఆపరేషన్ హానెస్ట్ ప్రామిస్" పేరిట ఇజ్రాయెల్‌పై దాడిలో పాల్గొంటున్నారు. ఈ దళం ప్రధాన బాధ్యత అంతర్గత, బాహ్య ముప్పు నుంచి ఇరాన్‌ను కాపాడడం. గార్డ్స్.. సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమైనీకి మాత్రమే జవాబుదారీ. ఐఆర్‌జీసీను 2019లోనే అమెరికా ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. కాగా ఇరాన్ తొలి సుప్రీం లీడర్ అయతుల్లా రుహోల్లా ఖొమేనీ.. ఐఆర్‌జీసీని 'ఇస్లాం సైనికులు'గా అభివర్ణించారు. "మీరెక్కడున్నా మీలో అంతర్గతంగాఉన్న, మీ చుట్టూ ఉన్న సాతానుల నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోండి" అని ఐఆర్‌జీసీ స్థాపన సందర్భంగా ఖొమేనీ అన్నారు. గార్డ్స్‌కు రాజకీయాల్లోకి వెళ్లే అధికారం కల్పించగా కొందరు సీనియర్ అధికారులు ఇలానే వెళ్లడంతో ఇరాన్ అంతర్గత రాజకీయాల్లోనూ గార్డ్స్ పాత్ర మరింత పెరిగింది. మతరాజ్య స్థాపన లక్ష్యంగా పెట్టుకున్న, ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను అణచివేసే స్వచ్ఛంద పారా మిలటరీ ఫోర్స్ అయిన 'బసిజ్'ను గార్డ్స్ నియంత్రిస్తుంటారు. ఇరాన్‌లో రాజకీయం, సైనికంలోనూ గార్డ్స్ ఇప్పుడు అంతర్భాగమయ్యారు. చాలా దేశాలపై సైనిక చర్యల్లో పాలుపంచుకుంటున్నారు. ఐఆర్‌జీసీ విదేశీ విభాగమే ఖుద్స్ ఫోర్స్ లెబనాన్, ఇరాక్, యెమెన్, సిరియాల్లో తమ ప్రభావం చూపుతోంది. సిరియా అంతర్యుద్ధంలో ఆ దేశ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు అండగాఉంది. కొంతకాలం ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఇరాక్ భద్రతాదళాలకు ఖుద్స్ ఫోర్స్ మద్దతిచ్చింది. ఐఆర్‌జీసీ టాప్ కమాండర్ మేజర్ ఖాసీం సులేమానీ ఇరాక్‌లో ఉండగా 2020లో డ్రోన్ దాడితో అమెరికా హతమార్చింది. అప్పుడు ఇరాన్‌నుంచి తీవ్రస్పందన ఉంటుందనుకున్నా అలాంటిదేమీ జరగలేదు.

- సెంట్రల్ డెస్క్

జగన్.. నీ డ్రామాలు ఆపు!

- నీకు గులకరాయి తగిలితే ఈ రాష్ట్రానికి గాయమైనట్టా: పవన్



తెనాలిలో బహిరంగ సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న పవన్

తెనాలి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిప్పులు చెరిగారు. శనివారం విజయవాడలో జరిగిన రాయి దాడి ఘటనను రాష్ట్రంపై జరిగిన దాడిగా, రాష్ట్రానికి జరిగిన గాయంగా వైసీపీ ప్రచారం చేస్తుండడాన్ని ఆయన తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. గులకరాయి ఘటనకే రాష్ట్రానికి గాయం జరిగితే.. ఇప్పటి వరకు జరిగిన దారుణాలతో రాష్ట్రానికి గాయాలు కాలేదా? అని పవన్ నిలదీశారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం రాత్రి జరిగిన వారాహి విజయభేరి సభలో ఆయన మాట్లాడారు. "సీఎం జగన్ తలకు ఒక గులకరాయి తగిలి గాయమైందంట. అయ్యో ఎంత పాపం! ఆయనకు దెబ్బతగిలితే రాష్ట్రానికే గాయమైందంట. అయ్యయ్యో! ఎంత ఘోరం జరిగింది? అదే ఒక సామాన్య బీసీ కుటుంబంలో సోదరిని ఏడిపిస్తున్నారని ప్రశ్నించిన 15 ఏళ్ల అమర్‌నాథ్‌ను వైసీపీ గూండాలు పెట్రోలు పోసి నిప్పంటిస్తే అప్పుడు రాష్ట్రానికి గాయం కాలేదట! రేపల్లె రైల్వే స్టేషన్‌లో భర్త ముందే మహిళపై మానభంగం చేస్తే.. అలా కావాలని చేయలేదట.. దొంగతనం కోసం వచ్చి పొరపాటున చేశారని ఓ మంత్రే చెబుతారు. అప్పుడు రాష్ట్రానికి గాయం కాదు. ఈయనకు గులకరాయి తగిలితే మాత్రం రాష్ట్రం మొత్తానికి గాయం అయిపోతుందట. ఇలా మాట్లాడడానికి వైసీపీ నేతలకు సిగ్గుండదా? బాబూ జగన్‌రెడ్డీ ఇక నీ సెంటిమెంట్ డ్రామాలు ఆపు. ఇన్ని నాటకాలు భరించలేకపోతున్నాం" అంటూ పవన్ మండిపడ్డారు. ఇంకా ఏమన్నారంటే..

దాడి నిజమేనా?

మా పార్టీ నాయకులు గులకరాయి దాడిని ఖండించాలని కోరారు. కానీ అది నిజం దాడో! ఆయనే కొట్టుకున్నాడో తెలియకుండా ఎట్లా ఖండిస్తాం. అయినా, అందరిపైనా దాడులు చేయించేవారిపై దాడిచేయటానికి ఎవరైనా ధైర్యం చేస్తారా? ఇంటెలిజెన్స్ విభాగం ఏం చేస్తున్నట్టు? నిజంగా దాడి జరిగితే చేసినవాడిని ఇంతవరకు ఎందుకు పట్టుకోలేదు? ఆనాడు చంద్రబాబుపై ఏకంగా రాళ్ల వర్షమే కురిపించారు. అప్పుడు వైసీపీ నేతలు ఎందుకు బాధ వ్యక్తం చేయలేదు? నేను వచ్చినప్పుడు నాపైనా రాళ్లు పడుతుంటాయి. ఆయనకు మాత్రం చిన్న గాయం అయితే ఎంతో ఘోరం జరిగిపోయిందని బాధపడుతున్నాడు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలు కనిపించవా? ఇద్దరు చెల్లెళ్ల బాబాయిని చంపేశారని గొంతు చించుకుంటుంటే ఒక్క పోలీస్ అధికారి మాట్లాడడు. సీబీఐ వస్తే కడప కోటలోకి వెళ్లనివ్వరు. ఇంత దారుణాలు జరుగుతుంటే మనకిపట్టదు. ఒక వ్యక్తిని గొడ్డలితో నరికి చంపితే గుండెపోటంటారు. మనం మాత్రం చేతులు ముడుచుకు కూర్చుంటాం. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవాడు ఒకడు మనందరినీ పొడుస్తా.. చంపుతా అంటుంటే ఎంతకాలం భరిస్తాం. అందుకే వ్యతిరేక ఓటు చీలకూడదని నేను పొత్తు పెట్టుకున్నా.

ఏడుపు వస్తోంది?

నిజంగా నాకు ఆవేదన, ఏడుపు వస్తోంది. తప్పు జగన్‌ది కాదు. మనదే. ఆయన ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి ఇసుక మొత్తం దోచేశారు. ఎందరో బీసీలు, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి ఉండేది. వారి పొట్టలు కొట్టి ఒక్కరికే దోచిపెట్టారు. మద్య నిషేధం అని చెప్పిన జగన్‌రెడ్డి సారా వ్యాపారిగా మారిపోయాడు. మీ కంపెనీలు మూయించి, దోచుకున్నది కక్కిస్తాం. జగన్ క్లాస్ వార్ అని మాట్లాడతాడు. ఎస్సీ సామాజిక వర్గానికి తీరని అన్యాయం చేశాడు. రూ.450 కోట్ల భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని దోచేశాడు. 23 సంక్షేమ పథకాలను తీసేశాడు. రూ.4,123 కోట్లు మీకు చేరకుండా మళ్లించేశాడు. కోర్టు ఆ నిధులు వెంటనే ఇవ్వాలని ఆదేశించినా ఇవ్వలేదు. బీసీలను రాజకీయంగా ఎదగనివ్వకుండా చేశాడు. 34 శాతం ఉన్న రిజర్వేషన్ కోటాను 24 శాతానికి తగ్గించి ద్రోహం చేశాడు. ముస్లిం యువత కూడా జగన్ మోసాలను గుర్తించాలి. గురుబ్రహ్మ అని గౌరవించాల్సిన ఉపాధ్యాయులను మద్యం షాపుల దగ్గర పెట్టాడు. పోలీసు ఉద్యోగులు చాలా మంది తమ వేతనాలు, టీఏ, డీఏలు సరిగా రావటంలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీలోపు జీతాలు, టీఏ, డీఏలు పడేలా చూస్తామని మాటిస్తున్నా. వలంటీర్లలో చాలా ప్రతిభ ఉంది. మీలో ఒక అంబటి రాయుడు, ఒక క్రికెటర్ నితీశ్‌కుమార్ రెడ్డి వంటివారు, ఎందరో అబ్దుల్ కలామ్‌లు దాగి ఉన్నారు. మీ జీవితాలను కేవలం రూ.5 వేలకు రేటుకట్టి జగన్ రెడ్డి తాకట్టు పెట్టుకున్నాడు. మీతో ఊడిగం చేయించుకుంటున్నాడు. మేమలా చేయం. మీలో దాగి ఉన్న శక్తిని వెలికితీస్తాం. మేం మీకు వ్యతిరేకం కాదు.

సరిగ్గా ఎన్నికలు వచ్చేప్పటికే జగన్‌కు గాయం అవుతుంది. ఎవరో ఒకరు చనిపోతారు. నాన్నా పులి సామెతలా ఆయన నాటకాలాడుతుంటే నేనే కాదు.. జనం కూడా నమ్మటం లేదు.

సుగాలి ప్రీతికి దారుణం జరిగితే అప్పుడు వైసీపీ పెద్దలెవరూ బాధపడలేదు. రాష్ట్రంలో 30 వేల మంది యువతులు, మహిళలు అదృశ్యమైతే అప్పుడూ రాష్ట్రానికి గాయం కాలేదు.

ఉద్యోగులకు పింఛను అనేది పెద్ద కొడుకు లాంటిది. ఆ భద్రతను మీకు కల్పిస్తాం. దీనిపై చంద్రబాబుతో మాట్లాడా. జగన్ మాదిరి నేను అబద్ధాలు చెప్పను. అధికారంలోకి వచ్చిన తర్వాత సీపీఎస్‌పై సంవత్సరంలో పరిష్కారం చూపుతాం.

- పవన్ కల్యాణ్

నీ జాగీర్ కాదు.. జగన్!

జగన్ ఏపీ నీ జాగీర్ అన్నట్టు వ్యవహరిస్తున్నావ్. నీ గుత్తాధిపత్యం ఇక సాగదు. మండలం రోజులే నీకు గడువు. కిందికి ఈడ్చుతాం. ఆర్యవైశ్యులపై దాడులు చేయిస్తున్నావ్. ఒక్క తెనాలిలోనే 15 మందిపై దాడులు జరిగాయి. వారికి తెనాలి సభ నుంచి చెబుతున్నా. మీరు రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపారాలు ప్రశాంతంగా చేసుకోవచ్చు. మీపై దాడి చెయ్యాలని చూస్తే.. ఎస్సీ, ఎస్టీ చట్టం ఎంత బలంగా ఉందో అలాంటి చట్టాలను మీకు రక్షణగా ఇస్తాం. మహిళలపైనా దాడులు జరగకుండా కాపలా ఉంటాం.

పుట్టపర్తిలో వైసీపీకి బిగ్‌షాక్

»» టీడీపీలోకి రెస్కో మాజీ చైర్మన్.. లోకేశ్ సమక్షంలో చేరికలు



రాజశేఖర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన రెస్కో మాజీ చైర్మన్ శెట్టివారి రాజశేఖర్ టీడీపీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో టీడీపీ యువనేత నారా లోకేశ్ సమక్షంలో రాజశేఖర్ పసుపు కండువా కప్పుకున్నారు. రాజశేఖర్‌తో పాటు సుమారు 100 మంది ముఖ్య నేతలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు టీడీపీ తీర్థం తీసుకున్నారు. వారందరికీ లోకేశ్ పసుపు కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు.

జగన్‌పై రాయి దాడి డ్రామా కావొచ్చు

»» గతంలో కోడి కత్తి కేసు ఇప్పటికీ తేలలేదు: కేఏ పాల్



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 14: ముఖ్యమంత్రి జగన్‌పై రాయి దాడి ఎన్నికల డ్రామా కావొచ్చని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జగన్‌పై రాయి దాడి గతంలో ఎన్నికల సమయంలో జరిగిన కోడి కత్తి దాడి లాంటిదే కావొచ్చన్నారు. అది ఇప్పటికీ తేలలేదన్నారు. ఇప్పుడు జరిగిన రాయి దాడి కూడా తేలదన్నారు.విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్నానని, అవకాశం ఉంటే పిఠాపురం ఎమ్మెల్యేగా పోటీ చేసే ఆలోచన కూడా ఉందని పాల్ తెలిపారు.

రోడ్డుపైనే సిద్ధం సభ

»» పార్వతీపురంలో స్తంభించిన ట్రాఫిక్ .. పట్టించుకోని ఎన్నికల సిబ్బంది



పార్వతీపురంలోని రోడ్డుపై సిద్ధం సభ నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో రాయగడ రోడ్డుకు అడ్డంగా వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో ఆదివారం వైసీపీ నేతలు 'మేమంతా సిద్ధం' సభ నిర్వహించారు. అయితే కోడ్‌కు విరుద్ధంగా మూడు గంటల పాటు సభ నిర్వహించినా అధికారులు పట్టించుకోలేదు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సభ జరగడంతో ఆ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు.దీనిపై నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హేమలతను వివరణ కోరగా.. రోడ్డు బ్లాక్ చేసి సభ నిర్వహించేందుకు అనుమతులు ఇవ్వలేదని చెప్పారు.

రోడ్డు అభివృద్ధిని పట్టించుకోని నేతలు మాకొద్దు!

»» ఎన్నికల బహిష్కరణకు 2 గ్రామాల నిర్ణయం.. ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన



డీజీపేటలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజలు

సీఎస్‌పురం (పామూరు), ఏప్రిల్ 14: రోడ్డు అభివృద్ధిని పట్టించుకోని నాయకుల వైఖరిని నిరసిస్తూ ఎన్నికలను బహిష్కరించాలని ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలంలోని దర్శిగుంటపేట (డీజీపేట), ఆ పంచాయతీ పరిధిలోని శివారు గ్రామం బొంతవారిపల్లి వాసులు నిర్ణయించుకున్నారు. ఈమేరకు ఫ్లెక్సీని కూడా ఏర్పాటు చేశారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో రోడ్డులేని గ్రామాలు దర్శిగుంట్ల, బొంతవారిపల్లి అని ఫ్లెక్సీలో రాశారు. అక్కడ ఆదివారం కొద్దిసేపు నిరసన తెలిపారు. ఓట్ల కోసం నాయకులు తమ ఊళ్లకు రావద్దంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా మాజీ ఉపసర్పంచ్ వేముల నారాయణ తదితరులు మాట్లాడుతూ రెండు గ్రామాల్లో 150 కుటుంబాలు నివసిస్తుండగా, 500 ఓట్లు ఉన్నాయన్నారు. రోడ్డును అభివృద్ధి చేయాలని ఏళ్లతరబడి కోరుతున్నా పట్టించుకొనే వారేలేరన్నారు. చివరికి తామే చందాలు పోగుచేసుకొని రోడ్డుకోసం మట్టితోలుకొని చదును చేసుకున్నామని, దానినే గ్రామ పంచాయతీలోని వైసీపీ పాలకవర్గం రికార్డుల్లో చూపించి బిల్లులు చేసుకుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని వేముల నారాయణ ఆరోపించారు.

కాలుష్య సమస్య తీర్చనందుకు ఎన్నికలు బహిష్కరిస్తున్నాం..!

»» మూలస్వయంభూవరం గ్రామస్థుల ప్రకటన



నిరసన తెలుపుతున్న మూలస్వయంభూవరం గ్రామస్థులు

పరవాడ (అనకాపల్లి జిల్లా), ఏప్రిల్ 14: అది అనకాపల్లి జిల్లా పరవాడ మండలం కలపాక పంచాయతీ పరిధిలోని మూలస్వయంభూవరం గ్రామం. సింహాద్రి ఎన్టీపీసీ వెదజల్లుతున్న కాలుష్య కోరల నుంచి తమను బయటపడేయాలని కొన్నేళ్లుగా కోరుతున్న ఆ గ్రామస్థుల వ్యథను ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలని ఆ గ్రామస్థులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం వారంతా రామాలయం వద్ద సమావేశమయ్యారు. ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులు, అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. త్వరలో జరిగే ఎన్నికలకు గ్రామస్థులంతా దూరంగా ఉండాలని తీర్మానం చేశారు.

టీడీపీ ప్రచార రథంపై వైసీపీ నేతల దాడి.. డ్రైవర్‌కు గాయాలు

రాయచోటి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డికి చెందిన ప్రచార రథంపె ఆదివారం రామాపురం మండలం కల్పనాయనిచెరువులో వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ప్రచారరథం మైకులు, లైట్లు ధ్వంసం కాగా డ్రైవర్ మాదా వెంకటశివకుమార్ గాయపడ్డాడు. రాంప్రసాద్‌రెడ్డి పెద్ద సంఖ్యలో తన అనుచరులతో సంఘటనా స్థలానికి వెళ్లి డ్రైవర్‌ను పరామర్శించి రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సొంత గ్రామానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ ఊరిలో ప్రతి ఎన్నికల్లోనూ వైసీపీ నాయకులు రిగ్గింగ్ చేస్తున్నారని రాంప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. మరోసారి ఇటువంటి సంఘటనలకు పాల్పడితే మేము కూడా అదే భాషలోనే సమాధానం చెబుతామని హెచ్చరించారు. దాడి సంఘటనపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. గాయపడిన డ్రైవర్‌ను జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పరామర్శించారు.

ఎన్‌డీఏ కూటమికే మా మద్దతు

»» బీసీల అభివృద్ధి, రాష్ట్ర భవిష్యత్తు కోసమే

»» వైసీపీ పాలనలో బీసీల అభివృద్ధి శూన్యం

»» ఏపీ బీసీ సంక్షేమ సంఘం సమావేశం తీర్మానం

గుంటూరు, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి మద్దతు తెలియజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ప్రకటించింది. రాష్ట్ర భవిష్యత్తు, బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, గౌరవాధ్యక్షుడు నిమ్మల శేషయ్య నేతృత్వంలో గుంటూరులో సంఘం రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో విధులు, నిధుల్లేని కార్పొరేషన్ పదవులతో బీసీల అభివృద్ధి శూన్యమైందన్నారు. సమర్థుడైన బీసీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి రవిచంద్రకు ఏడు నెలలుగా సరైన పోస్టింగ్ లేదన్నారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి రాజశేఖర్‌కు కూడా సరైన ప్రాధాన్యం కలిగిన పోస్టింగ్ లేకుండా చేశారని మండిపడ్డారు. బదిలీలు, పదోన్నతుల్లో కూడా బీసీ అధికారులకు అన్యాయమే జరుగుతోందని మండిపడ్డారు. సమావేశంలో సంఘం నేతలు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, తన్నీరు ఆంజనేయులు, కన్నా మాష్టారు, కోలా కిశోర్, కొల్లూరు హనుమంతరావు, బ్రహ్మానందశర్మ, ఆర్కే యాదవ్, సోమరాజు, పారేపల్లి మహేష్, బలగాని ఆంజనేయులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌డీఏ కూటమికి మద్దతు తెలియజేస్తున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతలు

మరో యాత్రతో ప్రజల్లోకి!

మే 10 వరకూ జనంలో ఉంటా.. 'నిజం గెలవాలి' ద్వారా 203 కుటుంబాలకు పరామర్శ

»» చంద్రబాబుపై గౌరవంతో ప్రజలు నన్నూ ఆదరించారు

»» వాళ్లు భువనమ్మ అని పిలిస్తే మా అమ్మ పిలిచినట్టుంది

»» రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కోరుకుంటున్నారు

»» 19న చంద్రబాబు తరపున కుప్పంలో నామినేషన్ వేస్తాం

»» 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఇంటర్వ్యూలో నారా భువనేశ్వరి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



'నిజం గెలవాలి' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 203 కుటుంబాలను పరామర్శించానని, మరో కార్యక్రమంతో మే 10 వరకు ప్రజల్లో ఉండాలని భావిస్తున్నానని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మరణించిన కార్యకర్తల కుటుంబాలను 'నిజం గెలవాలి' పేరుతో ఓదార్చి, భరోసా కల్పించామని చెప్పారు. ఈ యాత్రను రాష్ట్ర ప్రజలందరూ ఆదరించారన్నారు. 'కుటుంబ పెద్దలను కోల్పోయిన ఆయా కుటుంబాలను, వారి పిల్లల భవిష్యత్తును తలచుకుని ఎంతో ఆవేదన చెందాను. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు నేనెలా బాధపడ్డానో అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కార్యాకర్తలు, ప్రజలు ఆవేదన చెందారు. చంద్రబాబు కోసం ఇంత పరితపించిన ప్రజలకు ఏదో ఒకటి చేయాలని భావిస్తున్నాం. బాధిత కుటుంబాలకు చెందిన పిల్లందరినీ చర్లపల్లి ఎన్టీఆర్ ట్రస్టు స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివిస్తాం. ఇంజనీరింగ్ తదితర కోర్సుల విద్యార్థులకూ ట్రస్టు తరఫున ఆర్థిక సాయం అందిస్తాం' అని భువనేశ్వరి పేర్కొన్నారు. 'నిజం గెలవాలి' యాత్రను ఇక్కడితో ఆపబోమని, దీనిని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. చంద్రబాబు కోసం చేపట్టిన ఈ యాత్రలో ప్రజలతో మమేకమై, తాను కూడా వారిలో ఒకరినయ్యానని వివరించారు. ప్రజల్లో తనకు ఎంతో ఆదరణ లభించిందని హర్షం వ్యక్తంచేశారు.

రాష్ట్రం కోసమే చంద్రబాబు పోరాటం

'రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కోల్పోయాం. బ్రిటిష్ తరహాలో పాలన చేస్తున్నారు. ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కోరుకుంటున్నారు. ఈ ప్రభుత్వం ఇంకా కొనసాగితే ప్రజలకు ఏమీ మిగల్చరు. కార్యకర్తలు, ప్రజలు ఎన్నో బాధలుపడుతూ, ఈ ప్రభుత్వంతో పోరాడుతున్నారు. చంద్రబాబు జీవితంలో ఎవరినీ కష్టపెట్టరు. ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తారు. గతంలో ఆయనపై పెట్టిన ఏ కేసులు కూడా నిలబడలేదు. చంద్రబాబు తన స్వార్థం కోసం ఒక్క పైసా ఆశించరు. అవినీతి సొమ్ము కుటుంబానికి కావాలని కోరుకునే వ్యక్తి కాదు. ఎన్నికల కోసం ఎక్కువగా శ్రమిస్తున్నారని అంటే.. ప్రజల కోసం యుద్ధానికి వెళ్తున్నానని, ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ముఖ్యమని ఆయన చెప్పారు. చంద్రబాబు లాంటి నాయకుడిని నిర్బంధించడం తట్టుకోలేకపోయాను. పోలవరం చంద్రబాబు కలల ప్రాజెక్టు. విభజన తర్వాత ఏపీని చూసి ఎవరూ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాలేదు. చంద్రబాబు నాయకత్వం ఉండటంతోనే కియా లాంటి పరిశ్రమలు వచ్చాయి. అలాంటి నాయకుడిని కాపాడుకునేందుకు రెండు రాష్ట్రాల్లో జనాలు ముందుకొచ్చారు. ఒక నాయకుడి కోసం ఇంతలా ప్రజలు రోడ్డు మీదకు వచ్చి పోరాడటం చూసి ఆయన భార్యగా గర్వపడుతున్నా. ఒక సైనికుడి తల్లిలాగానే నేను కూడా లోకేశ్‌ను యువగళం పాదయాత్రకు పంపాను. ప్రజల్లో తిరగడం వల్లనే లోకేశ్‌కు ప్రజల సాధకబాధకాలు తెలిశాయి. గ్రామాల్లో తిరగడం నాకు కొత్తేమీ కాదు. మా సంస్థ అభివృద్ధికి మారుమూల ప్రాంతాల్లో సైతం పర్యటించాం. చంద్రబాబు ఎప్పుడూ కార్యకర్తల మనిషి. నిజం గెలవాలి కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలు ఎంతో ఆదరించారు. అందుకే బాధిత కుటుంబాలకు అండగా నిలవగలిగాం. పవిత్రమైన అసెంబ్లీ సమావేశాలను మహిళను కించపరిచేందుకు వాడుకోవడం అవివేకం. నా తండ్రి మొండితనం నాకూ వచ్చింది. కఠినమైన క్రమశిక్షణతో జీవించడం నా తల్లి నేర్పింది. యాత్రలో అందరూ భువనమ్మా.. అని పిలుస్తుంటే నా తల్లి పిలిచినట్లుంది. అందుకే ప్రజలతో అంత మమేకం కాగలిగాను. ఏప్రిల్ 19న చంద్రబాబు తరఫున కుప్పంలో నామినేషన్ వేయనున్నాం. కుప్పంలో ఇంటి నిర్మాణం కూడా రెండు నెలల్లో పూర్తవుతుంది. చంద్రబాబు అధికారంలోకి వస్తానే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయి. 20 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుంది. చేయలేని పనిని చంద్రబాబు ఎప్పుడూ చెప్పరు. ఆయన చెప్పారంటే కచ్చితంగా చేస్తారు. యువత రాజకీయాల్లోకి రావాలి. పరిశ్రమలు స్థాపించి, పది మందికి ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాల్లో జ్యోతిని వెలిగించాలి' అని భువనేశ్వరి పిలుపునిచ్చారు.

అదానీ, అజూర్ విద్యుత్‌కు ఏపీఈఆర్‌సీ పచ్చజెండా

»» సెకీ ద్వారా యూనిట్ రూ.2.49కు కొనుగోలు

»» ఆ రెండు సంస్థలకు 25 ఏళ్లలో రూ.958.12 కోట్ల చెల్లింపు

»» గ్రామీణ వ్యవసాయ ఇంధన సరఫరా సంస్థ విధివిధానాలు ఖరారు కాకుండానే కొనుగోళ్లకు సమ్మతి

»» హైకోర్టు తుది ఉత్తర్వులకు లోబడే ఈ ఉత్తర్వులు

అమరావతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్‌కు కొత్తగా డిమాండ్ పెరగకపోయినా మరో 7,000 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి కొనుగోలుకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) ఆమోద ముద్ర వేసింది. అదానీ నుంచి 4,667 మెగావాట్లు.. అజూర్ నుంచి 3,333 మెగావాట్ల కరెంటు కొనడానికి సెకీ ద్వారా డిస్కంలు చేసుకున్న త్రైపాక్షిక ఒప్పందానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ ఈ నెల 12వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను ఆదివారం తన వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేసింది. ఈ ఒప్పందం కింద ఏటా రూ.38.32 కోట్ల చొప్పున వచ్చే 25ఏళ్లలో అదానీ, అజూర్ సంస్థలకు రూ.958.12 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. ఒప్పందానికి త్వరగా అనుమతివ్వాలని డిస్కంలు, సెకీ, రాష్ట్ర గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ దాఖలు చేసిన వ్యాజ్యంపై ఈ నెల పదో తేదీన ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి విచారణ చేపట్టారు. అనుమతి మంజూరు చేస్తూ ఈ నెల 12న ఆదేశాలు జారీచేశారు. వాటిని ఆదివారం వెబ్‌సైట్‌లో రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలో ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం అమలు కోసమే ఈ ఉత్తర్వులను జాగు చేయకుండా ఇచ్చినట్లు ఏపీఈఆర్‌సీ వెల్లడించింది. సెకీ నుంచి 7,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరుగుతోంది. హైకోర్టు తుది ఆదేశాలకు లోబడి.. తామిచ్చిన ఉత్తర్వులు ఉంటాయని ఏపీఈఆర్‌సీ తెలిపింది. కాగా.. ఈ ఒప్పందం ప్రకారం.. అదానీ, అజూర్ సంస్థల నుంచి యూనిట్ రూ.2.42కు సెకీ కొనుగోలు చేస్తుంది. రాష్ట్రానికి కరెంటు సరఫరా చేస్తున్నందుకు యూనిట్‌కు 7 పైసల చొప్పున తీసుకుంటుంది. అంటే యూనిట్‌కు రూ.2.49 చొప్పున సెకీ నుంచి డిస్కంలు కొనుగోలు చేస్తాయని ఏపీఈఆర్‌సీ వెల్లడించింది. మరోవైపు.. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడానికంటూ రాష్ట్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వ్యవసాయ ఇంధన సరఫరా సంస్థను ఏర్పాటు చేసింది. వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసమే ఏర్పాటు చేసినందున సెకీతో ఈ సరఫరా సంస్థ మాత్రమే కొనుగోలు ఒప్పందం చేసుకోవాలని.. కానీ డిస్కంలు కుదుర్చుకోవడాన్ని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

డిస్కంలపై ఆర్థిక భారం పడకూడదనే?

వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు సరఫరా పథకాన్ని అమలు చేయడం వల్ల డిస్కంలపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకే సెకీతో వాటి ఒప్పందానికి ఆమోదముద్ర వేసినట్లు ఏపీఈఆర్‌సీ పేర్కొంది. దీనిపై నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకు అయ్యే సబ్సిడీ మొత్తాన్ని డిస్కంలకు ప్రభుత్వమే చెల్లిస్తోంది. అలాగే రాష్ట్ర గ్రామీణ వ్యవసాయ ఇంధన సరఫరా సంస్థ.. లబ్ధిదారుడి ఖాతా నుంచి నేరుగా డబ్బులు తీసుకునే విధానంపై ఇంకా స్పష్టత రాకపోయినా.. ఒప్పందాన్ని ఆమోదించడంపై నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



రాష్ట్రంలో ప్రచారం చేయనున్న ప్రవాసాంధ్రులు

ప్రచారానికి ప్రవాసులు

»» రాష్ట్రానికి తరలి వస్తున్న వెయ్యి మంది

»» 500 మంది హైదరాబాద్ టెకీలు కూడా

»» విజన్ ఉన్న నాయకుడి కోసం రంగంలోకి

»» సమన్వయం చేస్తున్న టీడీపీ ఎన్ఆర్ఐ

హైదరాబాద్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మాతృభూమిపై మమకారం వారిని ఎన్నికల ప్రచారంలోకి దింపింది. అభివృద్ధిని కాంక్షించే ప్రభుత్వం ఏర్పాటు కావాలన్న లక్ష్యంతో ఎక్కడో విదేశాల్లో ఉద్యోగం చేసుకుంటున్నా, తమ విధులకు కొద్దిరోజులు సెలవులు పెట్టి ప్రచారం కోసం తరలి వస్తున్నారు. ఏపీ ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటవి ు ప్రభుత్వం ఏర్పాటు కావాలనే లక్ష్యంతో వేలాది మంది ప్రవాసాంధ్రులు ప్రచార రంగంలోకి దిగుతున్నారు. ప్రవాసాంధ్రులకు తోడు హైదరాబాద్ నుంచి 500 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు(టెకీలు) కూడా ఏపీకి రానున్నారు. ఎవరెవరు ఏయే నియోజకవర్గాల్లో ప్రచారం చేయాలో ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేశారు. టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షుడు రవికుమార్ వేమూరితో పాటు కానూరి శేషుబాబు, బుచ్చి రాంప్రసాద్, రావి రాధాకృష్ణలు ఈ ప్రచార ప్రక్రియను సమన్వయం చేయనున్నట్లు టీడీపీ నేతలు తెలిపారు. దీనిలో భాగంగా ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మరికొందరు తరలిరానున్నారు. మరోవైపు, నేరుగా నియోజకవర్గాలకు వెళ్లి ప్రచారం చేయలేనివారు.. ఫోన్‌ల ద్వారా స్థానికులకు అవగాహన కల్పిస్తారు. తదుపరి దశలో ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్నారు. మూడో దశలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రయత్నిస్తారు.

రెండు నెలలుగా జీతాల్లేవ్

»» పల్నాడు, సత్యసాయి జిల్లాల మార్కెటింగ్ సిబ్బంది ఆవేదన

అమరావతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారుల నిర్వాకం వల్ల గత రెండు నెలలుగా శ్రీసత్యసాయి, పల్నాడు జిల్లాల మార్కెటింగ్‌శాఖ కార్యాలయ సిబ్బందికి జీతాలు రావట్లేదు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేసినప్పుడు కొత్త జిల్లాల్లో సీనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్(ఎస్ఎంఏ)లను జిల్లా మార్కెటింగ్ అధికారులుగా నియమించారు. అన్ని చోట్ల జిల్లాల్లో నిధుల డ్రాయింగ్ పవర్ ఎస్ఎంఏలకు ఉండగా, శ్రీసత్యసాయి, పల్నాడు జిల్లాల మార్కెటింగ్ అధికారులు ఎస్ఎంఏ నుంచి ఏడీగా పదోన్నతి పొందినా.. డ్రాయింగ్ పవర్ యథాతథంగా ఉంచారు. దీంతో పుట్టపర్తి, నరసరావుపేట ట్రెజరీ అధికారులు ఏడీలు బిల్లులు పెడితే తిరస్కరిస్తున్నారని చెప్తున్నారు.

ఉద్యోగులకు నరకం చూపుతున్న ప్రభుత్వం

»» జేఏసీ చైర్మన్ సూర్యనారాయణ

కలెక్టరేట్, ఏప్రిల్ 14: ఉద్యోగులకు ఈ ప్రభుత్వం నిత్యం నరకం చూపిస్తోందని జేఏసీ చైర్మన్ ఆర్.సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరంలోని ఆనందగజపతి కళాక్షేత్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉత్తరాంధ్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, వారి కుటుంబాల జీవితాలతో ఆటలాడుకొనే విధంగా సీపీఎస్ విధానం తయారైందన్నారు. ఒకటో తేదీన జీతం వస్తుందో రాదో, పెన్షన్ వస్తుందో రాదో తెలియని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రమంతా చైతన్య యాత్రలు నిర్వహిస్తామని, ఈ జిల్లా నుంచే ప్రారంభిస్తున్నామని చెప్పారు.

తాడేపల్లి డైరెక్షన్‌లోనే
గులకరాయి దాడి డ్రామా!

»» గతంలో కోడికత్తి... ఇప్పుడు గులకరాయి..

»» టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే ముఖ్యమంత్రి జగన్‌పై గులకరాయి దాడి డ్రామా జరిగిందని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. గత ఎన్నికల ముందు కోడికత్తి దాడి డ్రామా ఆడారని, ఇప్పుడు గులకరాయి దాడి డ్రామా ఆడి ప్రజల సానుభూతి పొందాలని నానా పాట్లు పడుతున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం విమర్శించారు. దీనిపై తాము అడుగుతున్న కొన్ని ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. 'ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి పర్యటిస్తుంటే ఆ మార్గంలో కరెంటు ఎందుకు నిలిపివేశారు? ఇది కుట్రలో భాగం కాదా? కరెంటు పోయిన సమయంలో బస్సు మీద ముఖ్యమంత్రిని ఎలా నిలబెట్టారు? ఆయనది బుల్లెట్ ప్రూఫ్ బస్సు. కరెంటు పోయిన వెంటనే లోపల కూర్చోబెట్టాలి? కానీ, బస్సు మీదే ఆయనను ఎందుకు ఉంచారు? ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది వద్ద బుల్లెట్ ప్రూఫ్ షీట్స్ ఉంటాయి. దాడిజరిగిన వెంటనే వాటిని తెరిచి ముఖ్యమంత్రి చుట్టూ పట్టుకొని ఎందుకు నిలబడలేదు? గాయం తగిలిన తర్వాత కూడా బస్సు మీదే ఎందుకు నిలబెట్టారు? రక్తపు మరకలు టీవీ కెమేరాలకు చూపించడం కోసం... సానుభూతి పుట్టించుకోవడం కోసం చేశారా? ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో అంబులెన్స్ ఉంటుంది. దానిని ఎందుకు వాడలేదు? దాడి జరిగిన నిమిషాల వ్యవధిలో వైసీపీ నేతలు ప్లకార్డులు, పోస్టర్లు పట్టుకొని రోడ్లపై ధర్నాలు ప్రారంభించారు. ఇంత తక్కువ వ్యవధిలో పోస్టర్లు, ఫ్లెక్సీలు ఎలా ముద్రించగలిగారు? వాటిని దాడికి ముందే సిద్ధం చేసుకొని ఉంచుకోవడం నిజం కాదా? జగన్ పత్రికలో ముఖ్యమంత్రిపై హత్యాయత్నం జరిగినట్లు, ఆయనకు తీవ్ర గాయాలైనట్లు వార్తలు ప్రచురించారు. అంత తీవ్ర గాయాలైన వ్యక్తి ఆ తర్వాత రెండు గంటలపాటు తన బస్సు యాత్రను ఎలా కొనసాగించగలిగారు? ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్లో ఫొటో షూట్లు జరుగుతాయా? ఆస్పత్రి ప్రొటోకాల్ ప్రకారం ఆపరేషన్ థియేటర్‌లోకి ఫొటోగ్రాఫర్లను అనుమతిస్తారా?' అని ఆయన ప్రశ్నించారు.

బాబుపై దాడులు జరిగినప్పుడు ఏం మాట్లాడారు?

టీడీపీ అధినేత చంద్రబాబుపై దాడులు జరిగినప్పుడు వైసీపీ నేతలు ఏం మాట్లాడారో గుర్తుందా అని పట్టాభి ప్రశ్నించారు. అమరావతి పర్యటనలో చంద్రబాబు బస్సుపై వైసీపీ నేతలు రాళ్లు విసిరితే నాటి డీజీపీ దానిని భావ ప్రకటన స్వేచ్ఛగా వర్ణించారని, ఆ రోజు జగన్ కనీసం నోరు విప్పలేదని అన్నారు. నందిగామలో, అన్నమయ్య జిల్లా అంగళ్లలో చంద్రబాబు వాహనంపై దాడులు జరిగాయి. అప్పుడు కూడా ముఖ్యమంత్రి నోరు తెరవలేదు. వీటిలో వేటిలోనూ చర్యలు లేవని పట్టాభి విమర్శించారు.

గులకరాయి కేసు సీబీఐకి అప్పగించాలి: ఎన్డీయే

సీఎం జగన్‌పై రాయి దాడి కేసును సీబీఐకి అప్పగించాలని ఎన్డీయే నేతల బృందం ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులకు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఒక లేఖ అందజేశారు.


సీఎం రక్షణలో పోలీసులు విఫలం: కనకమేడల

న్యూఢిల్లీ: సీఎం జగన్‌కు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ తెలిపారు. ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులు, విజయవాడ సీపీలపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు.

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



"ఈ సంకలనానికి 30 ఏళ్ళ భారతి పత్రికల్ని పరిశీలించాం"

వందేళ్ళ తెలుగు సాహిత్యం నుంచి ఏరిన వందమంది కవుల కవితలతో, పరిచయాలతో, విశ్లేషణలతో మీతోపాటు చేపూరు సుబ్బారావు సంపాదకత్వంలో 'కవన గర్భరాలు' పేరిట వెయ్యి పేజీల బృహత్ సంకలనాన్ని కూర్చారు. ఈ ఆలోచన ఎలా మొదలైందో చెప్తారా?

కొన్ని సంవత్సరాల క్రితం, 'తెలుగు జాతి మనది' అనే శీర్షికతో ఒక టి.వి. సీరియల్ తీయాలని సంకల్పించాను. తెలుగు వారి జీవితాల్ని రకరకాల కోణాలనుండి ప్రేక్షకులకు ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా చూపించడం దాని ఉద్దేశ్యం. ప్రతి ఎపిసోడ్‌లో 7 భాగాలుంటాయి. 6వ భాగం శీర్షిక పేరు 'వెలకట్టలేని వారసత్వాలు, అలనాటి పద్యాలు, ఇలనాటి గేయాలు'. ఈ శీర్షిక క్రింద ప్రతి వారం తెలుగు సాహిత్యం లోని ఒక గొప్ప పద్యాన్ని, ఒక మంచి గేయాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయాలనేది నాకోరిక. అయితే సీరియల్ ఆలస్యమవుతుండటంతో, ఛందోరహిత కవితలను ఒక పుస్తకంగానూ, ఛందోసహిత కవితలను మరో పుస్తకంగానూ, తీసుకొస్తే బాగుంటుందనే నిర్ణయానికి వచ్చాను. కాని సంకల్పించిన సంకలనాలు, మామూలుగా వచ్చే సంకలనాలకన్న భిన్నంగానూ, ఆసక్తికరంగానూ ఉండాలనుకున్నాను. ఛందోరహిత కవితలను 'కవన గర్భరాలు' అనీ, ఛందోసహిత కవితలను 'వెయ్యేళ్ళ పద్యానికి వందనం' అని నామకరణం చేశాం. 'కవన గర్భరాలు' మార్కెట్లోకి వచ్చింది. 'వెయ్యేళ్ళ పద్యానికి వందనం' మరో నాలుగైదు నెలల్లో వస్తుంది.

ఈ పుస్తకంలో కవితల తోపాటు కవుల వివరాలు, వారిపై, వారి కవితలపై వచ్చిన విశ్లేషణలు పొందుపరిచారు. దీని వెనకాల జరిగిన పరిశోధన గురించి చెప్పండి?

సంకలనంలో కవితను ఉదహరించి, రచయిత నేపథ్యం, సంక్షిప్త జీవిత చరిత్ర ఇవ్వక పోవడం సబబు కాదని నా అభిప్రాయం. 'కవన గర్భరాలు'లో ప్రధాన విభాగంలో ప్రస్తావించబడ్డ ప్రతి రచయిత సంక్షిప్త జీవిత చరిత్ర ఉంది. కొంతమంది రచయితలపై ప్రముఖుల అభిప్రాయాలున్నాయి. కొంతమంది ప్రముఖ రచయితల వ్యక్తిత్వాల్ని అర్థం చేసుకోవడానికి 'మనసులోని కొన్ని మాటలు' పేరుతో కొంత సమాచారం ఇవ్వబడ్డది. ప్రతి కవితపై, వ్యాఖ్యానం ఉంచబడింది. వ్యాఖ్యానాలు నా సహసంకలనకర్త చేపూరు సుబ్బారావు చాలా ఓపిగ్గా అద్భుతంగా రాశారు. కొన్ని కవితలకు సంబంధిత నేపథ్యం ఇవ్వబడింది. క్లిష్టమైన పదాలకు అర్థాలను పొందుపరచడం జరిగింది.

జీవిత చరిత్రల కొరకు మేము పడ్డ శ్రమ ఇంతా అంతా కాదు. ముఖ్యంగా వెలుగులో లేని రచయితలు కాని, చనిపోయిన వారి సమాచారం కాని పట్టుకోవడం అంత తేలిక కాదు. ముగ్గురు నలుగురి విషయంలో చాలా చాలా కష్టపడాల్సి వచ్చింది. 'నగ్నవృక్షం' పేరుతో ఒక మంచి కవితకు పుస్తకంలో స్థానం కల్పించాం. దాని రచయిత పాశం వెంకటేశ్వర్ రెడ్డి. ఆయన జీవిత చరిత్ర కొరకు, నేనూ, మౌనశ్రీ మల్లిక్ చేయని ప్రయత్నం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలిసిన సాహితీవేత్తలందరినీ అడిగాం. ఎక్కడా లభ్యం కాలేదు. అతని జీవిత చరిత్ర పెట్టలేదనే అసంతృప్తి విగిలిపోయింది.

> **సంకలనంలో కవితను ఉదహరించి, రచయిత నేపథ్యం, సంక్షిప్త జీవిత చరిత్ర ఇవ్వక పోవడం సబబు కాదని నా అభిప్రాయం. 'కవన గర్బరాలు'లో ప్రధాన విభాగంలో ప్రస్తావించబడ్డ ప్రతి రచయిత సంక్షిప్త జీవిత చరిత్ర ఉంది. ప్రతి కవితపై, వ్యాఖ్యానం ఉంచబడింది.**


ఈ కవితల ఎంపిక గురించి రాసిన ముందు మాటలో 'లయ' గురించి మాట్లాడారు. 'లయ'ను ఒక ప్రమాణంగా తీసుకోవటానికి కారణం ఏమిటి?

ఈ సందర్భంలో, గణిత శాస్త్రంలో వాడే రెండు పదాలను ఉదహరించాలి. అవి necessary, sufficient అనే పదాలు. లయ అనేది కవితకు necessity కాదు. లయ అనేది మంచి కవిత అనిపించుకోవడానికి sufficient కూడా కాదు. ఉపోద్ఘాతంలో మేము సి. నారాయణ రెడ్డి మాటను ఉటంకించాం. ఏ నియమం లేకుండా శుద్ధ వచనాన్ని లయబద్ధంగా మార్చినచో, అది వచన కవిత అవుతుందని అన్నాడు. ఆయన అన్నప్పటికీ, అధునాతన వచన కవిత్వంలో లయకు అంతగా ప్రాధాన్యత నివ్వడం లేదు. మేము పుస్తకంలో స్థానం కల్పించిన అనేక కవితల్లో లయ ప్రత్యక్షంగానో, అంతర్లీనంగానో ఉంది. లయ ఉన్న కవితలు పాఠకులకు, శ్రోతలకు ఎక్కువ ఆనందాన్ని కలిగిస్తాయి.

కవితల్లో లయతో పాటు కవితాశిల్పం కూడా ముఖ్యం. కవితల్లో వస్తువుని, శిల్పాన్ని, రెండింటినీ పరిశీలించాలి. పూర్తిగా వస్తువు వల్లనే కవిత శోభాయమానంగా ఉండదు. వస్తువుకు కవితాశిల్పాన్ని జోడించినప్పుడే అది బాగుంటుంది.

కవితల ఎంపికలో ఎలాంటి కొలమానాలు తీసుకున్నారు?

మొదటిది, రచయిత తీసుకున్న విషయాన్ని అందంగా, ఆసక్తికరంగా చెప్పగలిగాడా అనేది ముఖ్యమైనది. రెండవది, shared experience. రచయిత కవితలో వ్యక్తీకరించిన అనుభవాన్ని కాని, అనుభూతిని కాని, చదువరి పొందగలిగాడా అనేది ముఖ్యం. పాఠకుల వ్యక్తిత్వాలను బట్టి, వారి ఆసక్తులను బట్టి, ఈ shared experience, విభిన్నమైన వ్యక్తుల్లో విభిన్నమైన degrees లో ఉండవచ్చు. కాని, targeted readers కు అట్లాంటి shared experience లభించిందా అనేది ముఖ్యం. ఉదాహరణకు, పాపినేని శివశంకర్ రాసిన రెండు కవితలు ఒకటి ముఖేశ్ పైన, రెండవది హరిప్రసాద్ చౌరాసియా పైన. కొంతమంది పాఠకులకు వారిపై ఆసక్తి ఉండకపోవచ్చు. అందువల్ల అవి మంచి కవితలు కాదనలేం.



వి.కె. ప్రేమ్‌చంద్ పలకరింపు

ఈ సంకలనంలో కవితల్లో ఎక్కువ శాతం ఎలాంటి ఇతివృత్తాలు ఉన్నాయని గమనించారు?

ఏ ఇతివృత్తం పై అయినా ఎక్కువగా కవితలుంటే అది యాదృచ్ఛికమే కాని conscious decision కాదు. వెనక్కి మరలి చూస్తే, నలుగురు కళాకారులపైన కవితలున్నాయి. ఒకటి సూర్యకాంతం, రెండవది భానుమతి, మూడవది ముఖేశ్, నాల్గవది హరిప్రసాద్ చౌరాసియా. మైకేల్ జాక్సన్‌పై కొండెపోగు డేవిడ్ లివింగ్‌స్టన్ రాసిన కవితను కూడా కలుపుకుంటే అయిదు కవితలనుకోవచ్చు.

ఈ సంకలనం కూర్పులో మీకు దారి చూపిన, ప్రేరేపించిన సంకలనాలు?

ఏ ఒక్క సంకలనమో మాకు దారి చూపించిందని భావించడంలేదు. కాని ప్రప్రథమంగా, దాదాపు 90 ఏళ్ళ క్రింద, 1935లో ముద్దుకృష్ణ ద్వారా ప్రచురించబడ్డ 'వైతాళికులు' పుస్తకం పేరు చెప్పాలి. తరువాత ఎన్నో సంకలనాలు వచ్చినా, ఇప్పటి వరకు కూడా సంకలనం అంటే జ్ఞాపకం వచ్చేది 'వైతాళికులు' పుస్తకమే. అయితే ప్రస్తుత కొలమానాలను బట్టి చూస్తే 'వైతాళికులు' పుస్తకంలో దోషాలు, పరిమితులు కనిపిస్తాయి. ఈ కొలమానాలను బట్టి ఆ పుస్తకాన్ని విమర్శించడమూ సరి అయింది కాదు. ఆ పుస్తకం వచ్చిన తరవాత గేయకవితలో మార్పులొచ్చాయి. వచన కవిత చాలా ముఖ్యమైన మార్పును తెచ్చింది.

సంకలనానికి సహాయం చేసిన మరికొన్ని inputsను ప్రస్తావించడం ఉచితం. 1960 నుండి 1990 వరకు నిరాఘాటంగా అత్యుత్తమ సాహిత్య పత్రికగా పేరొందింది భారతి. ఈ సంకలనం రూపకల్పన జరిగినప్పుడు, దాదాపు 30 ఏళ్ళ భారతి పత్రికల్ని అంటే సుమారు 360 పత్రికలను సంపాదించి పరిశీలించాం. వాటిలో నుండి కొన్ని ఉత్తమ కవితల్ని ఎంపిక చేశాం. అట్లాంటి కవితలు ఇప్పుడు ఎక్కడా దొరకవు. ఉదాహరణకు, గంధం వేదవేశ్వరావు తెలంగాణ మాండలికంలో రాసిన 'నా దేశం శాన శాన మారింది'.

విజయవాడ నుండి సాహితీమిత్రులు ఏటా ప్రచురించే 'కవిత' సంకలనాలు కూడా బాగా ఉపయోగపడ్డాయి. రచయితల పుస్తకాలు ఎంత సహాయపడతాయో చెప్పనక్కరలేదు. అనువాద కవితలకు అనిల్ బత్తుల తీసుకొచ్చిన 'దేశదేశాల కవిత్వం' ఉపయోగపడింది.

98480 52486

పద్యం రాస్తా...

దిశమొలతో చిత్తుకాగితాలేరుతున్న
ఒక చీమిడిముక్కు పిల్లవాడు
ఈ దేశమై కనిపిస్తుంటే
నేనొక పద్యం రాస్తా

మేఘం చిట్లి నగరం
నడుము మీద కూలితే
విరిగి పోయిన
పిట్ట గూళ్ళ ఇండ్లలో
కన్నీటి వరదలో ఈదుతున్న మానవ పక్షుల
జీవన సంధ్యను చూస్తూ
నేను పద్యం రాస్తా

మాధ్యమాల మాయతెరలమీద
కనిపిస్తున్న ప్రగతి
ఈ దేశపు జండా అంటూ
పరిహాసం స్వాభావికం చేస్తున్నపుడు
నేనొక పద్యం రాయకుండా ఎలా ఉంటాను?

ఆకాశంలో సగం చేసే
శోకాలాపాలే జీవన సంగీతం
అయినపుడు,
ఉత్పత్తి శక్తులు పాదాల నుండి
పుట్టిన సూత్రీకరణలు
చాపకింద నీరై
తెలియకుండా
కాటు వేస్తూనే ఉంటే
పద్యంగా శోకించని కవి ఎవ్వడు?

రాజ్యానికి మతాన్ని కవచం
చేసుకునే మహాయోగం
నిస్సిగ్గు వెలుగులతో
రొమ్ము చూపిస్తుంటే
పద్య గర్జనతో, కలం
లక్ష్యాన్ని చాటి చెబుతా

నిశ్శబ్ద రాత్రిలో
నల్లటి కొండ కొనలో
చేతిలో కాగడాతో
నడుస్తూ అదిగో ఒకడు...
రెక్కలు మొలచిన
రేపటి ఆశకు వాడొక సంకేతం

భూమిని చీల్చుకొని మొలిచే
ఆకుపచ్చని రైతు ప్రాణం
సూర్యుణ్ణి తలమీద మోస్తూ
ఎదుగుతున్న కలను
ఆవాహన చేసుకొంటూ
కనిపించని తాళ్ళతో
కట్టేసే శాసనపు గొలుసులను
పడగవిప్పిన పద్యమై
సవాల్ చేస్తూనే ఉంటా
మరణం అంచు మీద
జీవన శాసనం
రాస్తూనే ఉంటా.

కాంచనపల్లి గోవర్ధన్ రాజు

96760 96614



AKBAR

అంబేడ్కర్ భావాలకు కవిత్వ రూపమిచ్చిన కవి

"హరిజనులలో నేడు మంచి కవులు పుట్టినారు. పుట్టుచున్నారు. మనము ఏర్పాటు చేయబోవుచున్న ఒకానొక సామ్యవాద రాజ్యాంగమునకు ఇది గొప్ప శుభసూచికము" (జ్ఞానానంద కవి 'అక్షరాభిషేకం' కావ్యానికి ముందుమాట) అని విశ్వనాథ సత్యనారాయణ ప్రకటించడం విశేషంగా భావించవచ్చు. మిగతా కవుల కంటే హరిజన కవులు కరుణ రసముట్టిపడునట్లు కవిత్వం రాస్తున్నారని విశ్వనాథ ప్రశంసించాడు. నెత్తుటి సిరాతో తన జాతి కవులు కఠినాత్ముల హృదయాలు ద్రవించేలా కరుణరస భరితమైన అనేక కావ్యాలు రచిస్తున్నారని గుర్రం జాషువ గబ్బిలం కావ్యంలో చాటిచెప్పాడు. వీరివురి మాటల్లో దళిత వర్గానికి చెందిన అప్పటి కవుల సృజన ప్రాభవం అర్థమవుతుంది.

భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న అందించిన రాజకీయ, సాహిత్య ప్రేరణతో, జాషువ కవిత్వ ప్రభావంతో, హరిజనోద్యమ సాహిత్య స్ఫూర్తితో, ఈ వర్గాల నుండి వచ్చిన ఎంతో మంది కవులు ఆధునిక తెలుగు పద్య కవిత్వానికి జవజీవాలను అందించారు. తరతరాలుగా అక్షరానికి దూరం చేయబడిన జాతిలో నుండి దూసుకు వచ్చిన ఈ కవులు కఠోరమైన సాధన జేసి, పద్య రచనా నైపుణ్యాన్ని వశ పరచుకొని ఆత్మగౌరవ స్పృహతో మహాకావ్యాలు రాశారు. తక్షణ సామాజిక గౌరవాన్ని అందుకోవడానికి, తమ జాతిని తృణీకరించే ప్రాబల్య వర్గాల కవి పండితుల ఆదరణను పొందడానికి ఈ కవులు పద్య కావ్య సృజనను సరియైన ఆలంబనగా భావించారని అనిపిస్తుంది. అందుకే జాషువతో పాటు, బోయి భీమన్న, జ్ఞానానంద కవి, గద్దెల జోసెఫ్, బీర్నీడి మోషే, ప్రసన్న, నంబూరు దుర్వాస మహర్షి, అత్తోట రత్నకవి, నూతక్కి అబ్రహాం, మల్లవరపు జాన్, ధైద వేములపల్లి దేవేందర్, కొలకలూరి స్వరూపరాణి లాంటి ఎంతోమంది కవులు పట్టుబట్టి పద్య కవిత్వమే రాశారు. వీరిలో ప్రధానంగా జాషువ, భీమన్నల కేంద్రంగా సాహిత్యంలో విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యంగా గుర్రం జాషువా కవితా ప్రభంజనంలో చాలామంది విస్మృత కవులుగా మిగిలిపోయారు. ఇలాంటి విస్మృతకవుల్లో చోడగిరి చంద్రరావు ఎంతో ప్రాసంగికత ఉన్న కవి.

చంద్రరావు గురించి ఆధునిక సాహిత్యంలో, దళిత సాహిత్యంలో చర్చ జరగ లేదు. కల్లూరి ఆనందరావు పరిశోధనా గ్రంథంలో తప్ప ఈ కవికి సంబంధించిన రచనల ప్రస్తావన ఆధునిక సాహిత్య చరిత్రలో మృగ్యం. డెబ్బయ్యో దశకం లోనే విప్లవ కవితా ఉధృతికి భిన్నంగా స్పష్టమైన దళిత తాత్వికతతో చంద్రరావు ప్రభావశీలమైన పద్య కవిత్వం రాయడం గొప్ప విషయం.

'భీమ' కవిగా సాటి కవుల నీరాజనాలందుకున్న చోడగిరి చంద్రరావు గోదావరి తీరంలో కోరుమిల్లి గ్రామంలో 1932 జూలై 15న జన్మించాడు. తల్లితండ్రులు బుల్లెమాంబ, వెంకటస్వామి. చంద్రరావు కొంతకాలం రక్షణ శాఖలో సైనికుడిగా, ఆ తరువాత భారతీయ రైల్వే శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి, సూపర్‌వైజర్‌గా పదవీ విరమణ చేశాడు. రెండుపదుల వయసులోనే కవిత్వ రచనను ప్రారంభించిన చంద్రరావు మూడున్నర దశాబ్దాల పాటు అప్రతిహతంగా సాహిత్య సృజన కొనసాగించాడు. వేమన, వేదుల సత్యనారాయణ, జాషువ, భీమన్నలను సాహిత్య గురువులుగా భావించాడు. గేయం, ఖండ కావ్యం, శతకం, పాట లాంటి ప్రక్రియల్లో చైతన్యభరితమైన రచనలు చేశాడు. వేకువ, మన గేయాలు, హృదయవీణ, చంద్రరావు గీతాలు, భీమ త్రిశతి తదితర రచనలతో కవిగా గుర్తింపు పొందాడు. మధుర కవిగా ప్రఖ్యాతి గాంచిన చంద్రరావు సుమధుర గాయకుడు, హార్మోనిస్టు కూడా. తాను రాసిన సామాజిక చైతన్య గీతాలను స్వయంగా తానే స్వరపరిచి, శ్రవణ శుభగంగా గానం చేస్తుంటే, ఆయన రాగవాహినిలో శ్రోతలు ఆనంద పరవశులయ్యే వారు. 'చంద్రరావు కవిత' అనే ఖండ కావ్యం అమెరికన్ల ఆదరణ అందుకున్నదని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'వాషింగ్‌టన్' గ్రంథాలయంలో ఈ కావ్యానికి చోటు లభించందని ఈ గ్రంథ ప్రచురణకర్తలు తెలియజేశారు.

కవిత్వం పట్ల, కవిత్వ ప్రయోజనం పట్ల చంద్రరావు స్పష్టమైన అభిప్రాయాలను ప్రకటించాడు. పీడితుల దుఃఖ విముక్తికి దోహద పడేదే ఉత్తమ కవిత్వమని సూత్రీకరించాడు. 'చంద్రరావు గీతాలు' సంపుటిలోని వస్త్రాపహరణం, ఘన కార్యం తదితర కవితల్లో చంద్రరావు తన కాలం నాటి కవితాధోరణులను విమర్శించాడు. కవి దుశ్శాసనులు తమ దుష్ట సృజన చేష్టలతో కవితా ద్రౌపదికి వస్త్రాహరణం చేస్తున్నారని ఆవేదన చెందాడు. వర్ణాశ్రమ ధర్మసూత్రాలను కవిత్వంలో వల్లిస్తూ "జాతిని రాతియుగం గుహలోనికి రమ్మని పిలిచే" తిరోగమన కవిత్వాన్ని ఈ కవి తిరస్కరించాడు. నవ్య సంప్రదాయ కవుల తీరుతెన్నులను వ్యంగ్యంగా ఎత్తి చూపాడు. "నీవు కన్న వారు నిన్ను కొల్చెడి వారు/ నీకు భర్తలంచు నిక్కువారు/ భాష యనెడి పాడు బావిలో పడ్డారు" అంటూ పాండిత్య ప్రకర్షతో సాధారణ పాఠకులను గంగవెర్రులెత్తించే కవి పుంగవులను వ్యతిరేకించాడు. వీరంతా సమాజాన్ని విడిచి, సగటు మనిషిని విస్మరించి సాహిత్య సాము చేసి, "బంధ కవితలల్లి తెలుగు సొగసును పాడు జేశారని" చంద్రరావు ఆక్షేపించాడు. కేవలం శాబ్దిక పరమైన ఆడంబరంతో, భావ పరమైన క్లిష్టతతో కొంతమంది కవులు కవితాసారాన్ని పాఠకులకు అందకుండా చేస్తున్నారని చంద్ర రావు నిరసించాడు. "పేరు వచన కవిత నోరైన తిరగని/ బండరాళ్ళు నింపి, బండినిండ/ దుష్ట కృతులు జెప్పి దుంపతెంచదరయ్య" అని కొంతమంది వచన కవుల విపరీత ధోరణులను ప్రశ్నించాడు. వచన కవిత్వాన్ని ఆవరించిన అస్పష్టతను ఈ కవి తీవ్రంగా వ్యతిరేకించాడు. ఏ ఎండకా గొడుగు పట్టే వారిని "కాకా కవీశ్వరుల్" అని నిందించాడు.



> **"కవిత నీవు నాదు కావ్య వస్తువు నీవు/ కంఠ మందు నీవు, కనుల నీవు/ నీవు లేని నేను నిర్జీవ ప్రతిమనే/ ఏమి చెప్పనయ్య భీమరాయ" అంటూ చోడగిరి చంద్రరావు అంబేడ్కర్ స్ఫూర్తిని ఆవాహన చేసుకొని, ఆయన రాజకీయ, సామాజిక లక్ష్యాలను సుబోధకంగా పద్యీకరించాడు.**

దివాకర్ల వేంకటావధాని చెప్పినట్లుగా ప్రారంభ దశలో చంద్రరావు "నిష్కపటాను రాగమునకు, మాధుర్యమునకు నిలయమైన భావగీతములు" రచించాడు. ఆత్మాశ్రయ ధోరణిలో ప్రణయ వేదనను కవిత్వంలో రసరమ్యంగా పలికించాడు. "నన్ను కన్నభూమి, నా అన్నదమ్ములన్/ చిత్రహింస జెసి చితుల ద్రోయ/ ప్రేమ కవిత నేను ఏ మొగమ్మున వ్రాతు" నని ఆత్మవిమర్శ చేసుకొని, అసమ సమాజంలో దుర్భరమైన అణచివేతతో కునారిల్లుతున్న తన జాతి జనుల బతుకు వెతలను ఆర్ద్రంగా కవిత్వీకరించాడు. తీయనైన అబద్ధాలను శిల్పశోభితంగా వర్ణించడం కంటే వేదనాభరితమైన చేదునిజాలను సరళ సుందరంగా ప్రజలకు తెలియజెప్పాలనే సమున్నత సంకల్పంతో అట్టడుగు జన సమూహం వైపు చంద్రరావు చూపు సారించాడు. "విసిరేసిన విస్తరి కోసం కుక్కలతో పోరాడే" ఆగర్భదరిద్రులను, రూపాయి కోసం మండే ఎండలో తమ రూపాన్ని కరిగించుకుంటున్న మట్టిమనుషులను, రక్కసిమూకల కర్కశత్వానికి బలవుతున్న దిక్కులేని మానవతులను దర్శించి, వారి వేడి కన్నీటి భాష్పాలకు కవితాభాష్యం చెప్పాడు. "దీనుల బాధల చీకటి/ దీపావళినే మ్రింగును/ దీనుల కన్నీటి ఝరులు/ దిక్కులన్నీ ముంచెత్తును" అని దీన మానవ జీవన స్థితిగతుల ఎరుకతో దీపావళిని అభివర్ణించాడు. బూర్జువా వర్గం నశించి, కార్మిక వర్గం గెలిచినప్పుడే నిజమైన దీపావళి యని చంద్రరావు భావించాడు. "భక్తులు పుట్టిన దేశంలో, శక్తులు పుట్టిన దేశంలో, భక్తి మరిగిన దేశంలో" కొందరికి భుక్తి ఎందుకు కరువైందని చంద్రరావు ప్రశ్నించాడు.

కవికి భావుకత ఎంత ముఖ్యమో భావజాలపరమైన పరిణతి కూడా అంతే ముఖ్యం. వైవిధ్యంతో పాటు, వైరుధ్య భరితమైన భారతీయ సమాజ స్వరూప స్వభావాలను అర్థం చేసుకొని కవితా రచన చేయడానికి స్పష్టమైన తాత్విక మార్గం అవసరం. చంద్రరావు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ తాత్విక పథంలో వడి వడిగా ముందుకు సాగిపోయాడు. కాకినాడ, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో అంబేడ్కర్ చైతన్యం గోదావరి నదిలా పరవళ్ల తొక్కుతుంది. ఈలి వాడపల్లి, కుసుమ ధర్మన్న తదితర నాయకుల, కవుల ప్రభావంతో చంద్రరావు అంబేడ్కర్ ఆలోచనలను, ఆశయాలను అందిపుచ్చుకున్నాడు. యుక్త వయస్సు నుండే ఈ కవి అంబేడ్కర్‌ను గురువుగా, ప్రియనేతగా ఆరాధించాడు. అంబేడ్కర్ మరణించినపుడు తెలుగులో తొలి స్మృతి గీతం రాసింది కూడా చంద్రరావే. "నీ జీవితమును ఆదర్శముగ నిడుకొని బ్రతికెదమయ్య/ నీ ఆశయములు నెరవేరగ నిరతము పోరెద మయ్య/ నీ నవయానమును మేలగు పథముగ నెంచి/ నీవు నడిచిన పథమును విడువగా లేము" అంటూ అంబేడ్కర్‌కు ఈ కవి గేయ నీరాజనం సమర్పించాడు. ఆ మహనీయుని ఆశయ సాధనకు పునరంకితం కావడమే ఆయనకు నిజమైన నివాళి అనిభావించిన చంద్రరావు ఈ దిశగాతన కవిత్వాన్ని పుటం పెట్టుకున్నాడు. కాకినాడలో 'భీమ సాహితీ స్రవంతి' అనే సంస్థను స్థాపించి అంబేడ్కర్ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడు. 'భీమ కవిని' నేను అని సగర్వంగా చెప్పుకున్నాడు. "ఏమి చెప్పనయ్యా భీమ రాయ!" అనే మకుటంతో మూడు భాగాలుగా భీమశతకం రచించాడు. చంద్రరావు రచనల్లో భీమ శతకం అత్యంత విశిష్టమైనది. దళిత సాహిత్యానికి తాత్విక భూమికను అందించిన ఈ శతకం ఆధునిక సాహిత్యంలో అంబేడ్కర్ ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

వ్యక్తిపూజతో చంద్రరావు ఈ శతకం రాయలేదు. బహుముఖీనమైన 'భీమ' తాత్విక ఎరుకతో ఆయన ఈ శతకాన్ని రాశాడు. "కవిత నీవు నాదు కావ్య వస్తువు నీవు/ కంఠ మందు నీవు, కనుల నీవు/ నీవు లేని నేను నిర్జీవ ప్రతిమనే/ ఏమి చెప్పనయ్య భీమరాయ" అంటూ చంద్రరావు అసామాన్యమైన అంబేడ్కర్ స్ఫూర్తిని ఆవాహన చేసుకొని, ఆయన రాజకీయ, సామాజిక లక్ష్యాలను సుబోధకంగా పద్యీకరించాడు. అంబేడ్కర్ ఆలోచనల వెలుగుల్లోనే కుల మత, వర్గాల ప్రాతిపదికగా రూపుదిద్దుకున్న మనువాదాన్ని, సమాజంలో వేళ్లానుకున్న మూఢనమ్మకాలను చంద్రరావు తన కవిత్వం ద్వారా ఖండించాడు. మనిషి బతుకును మతంతో ముడివేసి, మనిషి గుండెను గుడిలో దాచిపెట్టి, మనిషి తెలివిని మంటగలిపారని అర్ధ శతాబ్దం క్రితం చంద్రరావు రాసిన కవిత్వానికి ఈనాటికీ ప్రాసంగికత ఉందని చెప్పవచ్చు. "ఆవు పేడ కన్న అంత తక్కువ వీడు/ మంత్రియైన ముఖ్య మంత్రియైన/ ఎవడు సృష్టి జేసె నీ కులమ్ముల తండ్రీ" అని ఎందెందు వెదకినా అందందు బుసలు కొట్టే నాలుగు పడగల నాగరాజు కుటిలత్వాన్ని చంద్రరావు బట్ట బయలు చేశాడు. సర్పంచి నుండి దేశాధ్యక్షుడి వరకు ప్రోటోకాల్ కతీతంగా కులసర్పం చేసిన గాయాలకు లెక్కలేదు. "కులహీనుడని గొడ్డళ్లతో గొట్టి/ గునపములను దించి గుండెలందు/ ఇళ్ళు తగుల బెట్టనేమి మా నేరమ్ము" అని కులం పేరుతో జరుగుతున్న సామాజిక హింసను చంద్రరావు వాస్తవ దృష్టితో అక్షరబద్ధం చేశాడు. కులాధిపత్యాన్ని, దళిత ఉపకులాల మధ్య రగులుతున్న అంతరాలను తద్వారా సంభవించే ప్రమాదాలను హెచ్చరించి, కులనిర్మూలన ఆవశ్యకతను చంద్రరావు తన పద్యాల ద్వారా ఆమోదయోగ్యంగా నిరూపించాడు.

గౌతమబుద్ధుని ఔన్నత్యాన్ని, ఆయన బోధించిన శాంతి సందేశాన్ని, ప్రేమైక దృష్టిని, జీవకారుణ్యాన్ని చంద్రరావు కవిత్వంలో పలికించాడు. అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో ఈనాడు వెలువడుతున్న సాహిత్య తత్వానికి చంద్రరావు రచనలు వెలుగు దారులుగా నిలుస్తాయి. అంబేడ్కర్ గురించి విశ్వవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సందర్భంలో భీమ దృక్పథాన్ని సమర్థవంతంగా చాటి చెప్పిన చోడగిరి చంద్రరావు కవిత్వాన్ని మరింత గాఢంగా అధ్యయనం చేయవలసిన అవసరముంది.

కోయి కోటేశ్వరరావు

94404 80274

నెచ్చెలి కథ, కవితా పోటీలు

నెచ్చెలి ఐదవ వార్షికోత్సవం (జూలై10, 2024) సందర్భంగా నిర్వహిస్తున్న ద్వితీయ కథ, కవితా పురస్కార పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నాం. కథలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.1000. కవితలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ. 1500, రూ.1000, రూ.750. ఇతివృత్తం స్త్రీలకు సంబంధించిన అంశమై ఉండాలి. వర్డ్ ఫైల్‌లో కథలు పది పేజీలకు మించకుండా, కవితలు 2 పేజీలకు మించకుండా యూనికోడ్‌లో పీడీఎఫ్‌తో పాటు పంపాలి. ఈ-మెయిలు మీద 'నెచ్చెలి - కథ - కవితల పోటీ - 2024కి' అని రాసి editor@neccheli.comకు మే 10లోగా పంపాలి.

కె. గీత

ఆత్మీయ సభ

బుర్రా లక్ష్మీనారాయణ సంస్మరణార్థం ఆత్మీయ సభ ఏప్రిల్ 15 సా.6గంటలకు సుందరయ్య కళానిలయం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో రూప్ కుమార్ డబ్బీకార్, కె.వి.ఎస్.వర్మ, ఏనుగు నరసింహారెడ్డి, ఎం.నారాయణశర్మ, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ పాల్గొంటారు.

గుడిపాటి

కవిత్వంపై ముఖాముఖి

అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ చైతన్య సాహితి సంయుక్త ఆధ్వర్యంలో వరుల శివకుమార్ కవిత్వం 'వేళ్లరహస్యం'తో ముఖాముఖి సమావేశం ఏప్రిల్ 20 సా.5గంటలకు 'ముఖ్దుంభవన్' హిమాయత్‌నగర్‌లో జరుగుతుంది.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

కవిగాయక సమూహ గానం


దేశం ప్రమాదంలో ఉన్న ప్రస్తుత సందర్భంలో 'ప్రజాస్వామిక లౌకిక రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కలం గళం ఎత్తుదాం!' అనే నినాదంతో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో 'కవి గాయక సమూహ గానం' కార్యక్రమం ఏప్రిల్ 21 రాత్రి 9 గంటలకు దొడ్డి కొమురయ్య హాల్, సుందరయ్య భవన్, హైదరాబాద్‌లో జరుగుతుంది. మొత్తం పన్నెండు సెషన్లలో సభలు జరుగుతాయి. కె.శ్రీనివాస్, కె. శివారెడ్డి, పసునూరి రవీందర్, గోరటి వెంకన్న, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, జయరాజు, కవి యాకూబ్, మాస్టార్జీ, మెర్సీ మార్గరెట్, సిద్ధార్థ, జ్వలిత, ప్రసేన్, నరేష్కుమార్ సూఫీ, నిజం, నాళేశ్వరం శంకరం, కోయి కోటేశ్వరరావు, కటుకోఝ్వల ఆనందాచారి, ప్రసాద మూర్తి, జూపాక సుభద్ర, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, సీతారాం, ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు ఈ సభలో పాల్గొంటారు.

సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్

అనుమంద్రం ఆవిష్కరణ సభ

రాళ్ళబండి శశిశ్రీ కవితా సంపుటి 'అనుమంద్రం' ఆవిష్కరణ సభ ఏప్రిల్ 17 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. తల్లావఝ్ఝల శివాజీ, అనిల్ డ్యాని, కవి యాకూబ్, మామిడి హరికృష్ణ; వక్తలుగా- అంబటి సురేంద్ర రాజు, ఘంటశాల నిర్మల, సిద్ధార్థ పాల్గొంటారు.

బోధి ఫౌండేషన్



మోదం

నేను కవిత్వం రాస్తున్న కొత్తలో
ఎవరిదైన కవిత్వం చదువుతుంటే
ఒక్కొక్కసారి ఆశ్చర్యపోయి
ఒక్కో వాక్యం దగ్గరే
పిడిగుద్దు గుద్దినవాడిలా నిశ్శబ్దుణ్ణయ్యేవాణ్ణి.

నా జీవితం ఇతనికెలా తెలిసిందని
తెగ ఆలోచించి
ఆ రాసిన కవి వంక అదోలా చూస్తూ నిలబడేది.

మనం అనుభవిస్తున్న వర్తమాన జీవితంలోనో
గతంలో నుండో ఒక సన్నివేశం
మరొక కవి రాసుకొచ్చినా
అదొక ఎడతెగని అనుభూతిలా మన పుస్తకంలో
జ్ఞాపకంగా మిగిలిన నెమలీకలా మిగిలిపోతది.

నేను మోకాళ్లను భూమికి ఆనించి
అడవిలో ఊటసెలిమె దగ్గర నీళ్ళు తాగి
దప్పిక తీర్చుకున్న రహస్య దృశ్యాన్ని
ఎవరో ఓ కవి రాసుకొస్తే
ఆ వాక్యం ముగిసిన చుక్క దగ్గరే ఆగిపోయేవాణ్ణి.

వాన ముసురు పట్టుకుంటే
గోనె కొప్పెర గప్పుకొని మట్టిమిద్దె మీద గవాసి మీద
పగిలిన కుండ పెంకుల్ని మూసి వస్తుంటే
చటుక్కున మెరిసిన మెరుపులో
నా గుండె పగిలిన శబ్దం రాసిన కవి వద్దే
నేను మోకరిల్లుత.

నీళ్ళు దొర్కని ఎండకాలంలో
దిగుడుబాయిల దిగి రెండు బిందెలను భుజం మీద
మోసుకొస్తుంటే బండ మీద నుండి జారి
బావిలో పడి మోకాటిచిప్పలకు గాయమైతే
ఆ సంఘటనను రాసిన కలానికి ప్రణమిల్లుతా.

పల్లె వాకిట పండు వెన్నెల రాలుతున్నప్పుడు
పిలువని పెండ్లికిపోయి ఇసుకకుప్పలమీద
పడుకుంటే ఆ రాత్రి నా కండ్లల్లోకి వచ్చిన
పంచవన్నెల జింకపిల్ల వేటను
అచ్చుగుద్దినట్లు పాటగా వినబడితే ఆ క్షణం
ఆ కలం బట్టిన చేతికింద బానిసగా మారిపోత.

అద్దమరాత్రి దీపం వెలుగులో
వరిసేనుకు నీళ్ళు పారబెట్టబోయి
పక్కపొలంలో కూడా అటువంటి దీపం వెలుగే కనవడ్తే
లోలోపల మనిషున్నడనే ధైర్యం తెచ్చుకొని
పొలం గెట్ల మీదనే కునికిపాట్లు పడిన గడ్డుకాలాన్ని
ఏ కవైన పట్టుకుంటే
ఆ కవిని ఏడు రంగుల గుర్రం బండి మీద ఊరేగిస్తా.

అవనిశ్రీ

99854 19424

విపక్షాలపై విషం..!

సీఎం జగన్‌పై రాళ్ల దాడిలో రాజకీయాలు



గన్నవరం సచివాలయ వాట్సాప్ గ్రూపుల్లో ప్రభుత్వ అనుకూలంగా, ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా పెట్టిన పోస్టులు

* సోషల్ మీడియా వేదికగా దారుణమైన పోస్టులు
* ప్రతిపక్షాలను టార్గెట్ చేసి అసభ్యకర మాటలు
* సచివాలయ వాట్సాప్, క్లస్టర్ గ్రూపుల్లో ప్రత్యక్షం
* ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సానుభూతి అస్త్రాలు

విజయవాడ, ఆంధ్రజ్యోతి : సీఎం జగన్‌పై దాడి ఘటన నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా వైసీపీ విధ్వంసానికి తెరలేపింది. ఎన్నికల కోడ్‌ను తుంగలో తొక్కి. మరీ ప్రతిపక్ష పార్టీలపై విద్వేషపూరిత పోస్టులతో రచ్చ చేస్తున్నారు. చివరికి గ్రామ సచివాలయాల క్లస్టర్ వాట్సాప్ గ్రూపుల్లోనూ ప్రతిపక్షాలపై దారుణమైన పోస్టులు పెడుతున్నారు. దాడికి కారకులు టీడీపీ వారేనంటూ చంద్రబాబును లక్ష్యంగా చేస్తూ అధికార పార్టీ నేతలు గ్రామ, వార్డు సచివాలయాల వాట్సాప్, కమ్యూనిటీ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నారు. ఇలాంటి పోస్టులు ఎన్నికల కోడ్ పరిధిలోకే వస్తాయి. వీటివల్ల రాజకీయ ఘర్షణలు జరిగే అవకాశముంది. ముఖ్యమంత్రిపై రాళ్ల దాడిలో దోషులెవరో ఇంతవరకు పట్టుబడలేదు. విచారణలో ఈ విషయాలు బయటపడతాయి. కానీ, ఈ అంశాన్ని అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోంది. దాడిని రాజకీయ పార్టీలకు ఆపాదించేలా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో సచివాలయాల గ్రూపుల్లో పోస్టులు పెట్టిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీపై విద్వేషం నూరిపోసేలా ఈ ఫొటోలు ఉంటున్నాయి. అలాగే, జగన్‌కు రాజకీయ ప్రయోజనం, సానుభూతి కల్పించేలా దృశ్యాలు, క్యాప్షన్లు, పాటలతో ఈ పోస్టులు ఉంటున్నాయి. దీనిపై తక్షణం జిల్లా ఎన్నికల యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టిసారించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నివాళి



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఆదివారం నగరంలోని స్వరాజ్యమైదానంలో ఉన్న అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద ఘనంగా జరిగింది. కలెక్టర్ దిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేశారు.

- కృష్ణలంక

వరుసపెట్టి.. వలసలు

రెండు జిల్లాల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు





టీడీపీలో చేరిన వారితో గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు (ఇన్‌సెట్‌లో) లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరిన చెన్నుపాటి శ్రీను, పరమేశ్, పక్కన టీడీపీ నాయకులు

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణంగా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గెలిచే పార్టీలో చేరడం ప్రతిసారి జరిగే విషయమే. ఈసారి మాత్రం ఈ వలసలు సునామీని తలపిస్తున్నాయి. జగ్గయ్యపేట మొదలు అవనిగడ్డ వరకు ఎటుచూసినా వైసీపీ నుంచి టీడీపీలో చేరికలే కనిపిస్తున్నాయి.

- గన్నవరంలో ఒకేరోజు 800 మంది రాక
- టీడీపీలోకి చెన్నుపాటి శ్రీనివాస్, మంచినేని పరమేశ్
- లోకేశ్ సమక్షంలో చేరిన విజయవాడ నగర నాయకులు
- నందిగామలో వైసీపీకి బిగ్ షాక్
- సీనియర్ నాయకులంతా తెలుగుదేశంలోకి..
- గొట్టుముక్కల నుంచి ఒకేసారి 200 కుటుంబాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించే నియోజకవర్గాల్లో గన్నవరం, గుడివాడ, విజయవాడ తూర్పు నియోజకవర్గాలు ముందుంటాయి. గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ దాదాపు ఖాళీ అయింది. ఇక్కడి నుంచి టీడీపీ అభ్యర్థిగా యార్లగడ్డ వెంకట్రావు బరిలో ఉన్నారు. ఆయనకు ప్రత్యర్థిగా వల్లభనేని వంశీ వైసీపీ తరఫున పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో వెంకట్రావు వైసీపీ తరఫున పోటీ చేయడంతో ఆ పార్టీలో ఆయనకు బలమైన క్యాడర్ ఉంది. ఎప్పుడైతే వెంకట్రావు వైసీపీని వీడి టీడీపీ కండువా కప్పుకున్నారో ఆరోజే అధికశాతం మంది టీడీపీలో చేరారు. అయితే, మొదటి నుంచి టీడీపీలో ఉండి పార్టీ కోసం పనిచేస్తున్న వారిని దృష్టిలో పెట్టుకుని వెంకట్రావు తన వెంట వచ్చే వైసీపీ శ్రేణుల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తూ వచ్చారు. ఇప్పుడు ఒక్కసారిగా గేట్లు ఎత్తేయడంతో ఒక్కసారిగా వలసల వరద మొదలైంది. శనివారం ఒక్కరోజే సుమారు 800 మంది ఎస్సీ, బీసీ, మైనారిటీ సోదరులు వైసీపీని వీడి టీడీపీ కండువా కప్పుకొన్నారు. నియోజకవర్గంలో 50 గ్రామాల నుంచి వైసీపీ శ్రేణులు, నాయకులు ఇప్పటికే టీడీపీలో చేరారు. మిగిలిన 30 గ్రామాల నుంచి కూడా త్వరలో చేరికలు ఉంటాయని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గుడివాడ నియోజకవర్గంలోనూ వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరుతున్నారు. ఇక విజయవాడ తూర్పులో కీలకమైన నాయకులుగా ఉన్న బొప్పన భవకుమార్, యలమంచిలి రవి వంటి నాయకులను పార్టీ వైపు ఆకర్షింపజేయడంలో టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని విజయవంతమయ్యారు.

టీడీపీలోకి చెన్నుపాటి శ్రీనివాస్

విజయవాడ నగరానికి చెందిన వంగవీటి రంగా బావమరిది, ప్రముఖ నాయకుడు చెన్నుపాటి శ్రీనివాస్ ఆదివారం టీడీపీ కండువా కప్పుకొన్నారు. కేశినేని చిన్ని ఆధ్వర్యంలో చెన్నుపాటి శ్రీనివాస్‌తో పాటు పెనమలూరు నియోజకవర్గానికి చెందిన మంచినేని పరమేశ్ కూడా తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. ఉండవల్లిలోని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నారా లోకేశ్ సమక్షంలో వారు పార్టీలో చేరారు. లోకేశ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేశినేని చిన్నితో పాటు టీడీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామ్మోహన్, సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు, పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి బోడె ప్రసాద్, బొప్పన భవకుమార్, బుద్దా వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కాగా, రాధారంగా మిత్రమండలిని తెరవెనుక ఉండి నడపడంలో చెన్నుపాటి శ్రీనివాస్ కీలకంగా వ్యవహరిస్తారు. కాపు సామాజికవర్గానికి చెందినవారిని సమన్వయం చేయడంతో పాటు మిగిలిన సామాజికవర్గాలతోనూ శ్రీనివాస్‌కు పరిచయాలు ఉన్నాయి.

తల్లిదండ్రులు మందలించారని..

పురుగు మందు తాగిన అక్కాచెల్లెలు

చెల్లి మృతి.. అక్కకు తప్పిన ప్రాణాపాయం

గుడివాడ రూరల్ పర్నాసలో ఘటన

గుడివాడ రూరల్, ఏప్రిల్ 14 : చదువులో వెనుకబడ్డారని తల్లిదండ్రులు మందలించడంతో అక్కాచెల్లెలు పురుగు మందు తాగగా, చెల్లి మృతిచెంది, అక్క ప్రాణాపాయం నుంచి బయటపడిన ఘటన గుడివాడ రూరల్ మండలం పర్నాస గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్నాసకు చెందిన కుక్కల బ్రహ్మం, పార్వతీలకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె నాగ లావణ్య (18) గుడివాడలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతోంది. రెండో కుమార్తె దేవి ధనలక్ష్మి ఇంటర్ రెండో సంవత్సరం చదివింది. దేవి ధనలక్ష్మి ఇంటర్ మొదటి సంవత్సరంలో కొన్ని సబ్జెక్టులు మిగిలిపోయాయి. పెద్ద కుమార్తెకు కూడా ఇంజనీరింగ్‌లో కొన్ని సబ్జెక్టులు విగలగా, కష్టపడి చదివిస్తుంటే సబ్జెక్టులు మిగలటం ఏమిటని తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపం చెందిన అక్కాచెల్లెలు శనివారం సాయంత్రం పురుగు మందు సేవించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గుడివాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అందించి శనివారం రాత్రి విజయవాడ తరలించారు. కాగా, చిన్న కుమార్తె దేవి ధనలక్ష్మి చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మరణించింది. పెద్ద కుమార్తెకు ప్రాణాపాయం తప్పిందని రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మీనరసింహమూర్తి తెలిపారు. ధనలక్ష్మి మృతితో పర్నాస గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



వైభవంగా నవరాత్రోత్సవాలు

- ఆరో రోజు ప్రత్యేక పుష్పార్చనలు

- 6లో..

నందిగామలో వైసీపీకి భారీ షాక్



విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలో చేరిన గొట్టుముక్కల నాయకులు

టీడీపీలోకి సీనియర్ నాయకులు

కంచికచర్ల/నందిగామ : నందిగామ నియోజకవర్గంలో వైసీపీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. నేతలతో పాటు కార్యకర్తలు కూడా ఒక్కొక్కరూ టీడీపీలో చేరుతున్నారు. నందిగామ పట్టణానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు కత్తురోజు శ్రీనివాసాచారి, మునిసిపల్ కౌన్సిలర్లు గద్దే శేషకుమారి, మారం అమరయ్య, వైసీపీ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి గద్దే రమేశ్, విద్యావేత్త, జీడీఎంఎం కళాశాల అధినేత డాక్టర్ జీవీ ప్రసాదరావు, వైసీపీ మైనారిటీ సెల్ నాయకుడు షేక్ రబ్బాని, న్యాయవాది కామసాని ఉదయ్ టీడీపీలో చేరారు. మునిసిపల్ చైర్‌పర్సన్ దివంగత మండవ వరలక్ష్మి భర్త పిచ్చయ్య కూడా టీడీపీలో చేరడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దశాబ్దాలుగా పట్టణ ప్రజలతో మంచి సంబంధాలు ఉన్న పిచ్చయ్య వివాద రహితుడు. ఎమ్మెల్యే సోదరులతో విభేదాలు ఏర్పడటంతో కొంతకాలం నుంచి దూరంగా ఉంటున్న ఆయన రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. అలాగే, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ డైరెక్టర్ రాటకొండ కోటేశ్వరరావు సొంత గూటికి చేరుకున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీల నేతగా ఉన్న రాటకొండ గత ఎన్నికల ముందు వైసీపీలో చేరారు. అరాచక పాలనపై విసుగు చెందిన ఆయన తిరిగి టీడీపీలోకి వచ్చారు. చందర్లపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు కొరారు దశరథ రామయ్య, చింతలపాడుకు చెందిన సీనియర్ నాయకుడు ముక్కపాటి నరసింహారావు, బొబ్బిళ్లపాడుకు చెందిన కోండ్రు యాకోబు, బిట్టు రమేశ్, తుర్లపాడుకు చెందిన దాసరి శ్రీనివాసరావు, వైసీపీ తోటరావులపాడు గ్రామ అధ్యక్షుడు ములకలపల్లి వెంకట్రావు, గొర్రెల, మేకల కాపరుల సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు దద్దుకూరి వెంకటకృష్ణ వైసీపీకి గుడ్‌బై చెప్పి సైకిలెక్కారు. ప్రముఖ బీసీ నేత, గుడిమెట్ల సర్పంచ్ ఆళ్ల సైదమ్మ, ఆమె వర్గంతో టీడీపీలో చేరారు. గొట్టుముక్కల గ్రామంలో మెజారిటీ వైసీపీ వర్గమంతా టీడీపీలో చేరింది. మాజీ సర్పంచ్ గుదే రంగారావు, సొసైటీ మాజీ చైర్మన్లు బండ్లమూడి చౌదరిరావు, తాటుకూరు గంగాధరరావు, ఎంపీటీసీ సభ్యురాలు గుదే సరస్వతి వర్గమంతా మూకుమ్మడిగా వైసీపీకి గుడ్‌బై చెప్పింది. అన్నివిధాలా బుజ్జగించినప్పటికీ 200కుపైగా కుటుంబాలు టీడీపీకి జైకొట్టాయి.

దేనికి సిద్ధం?

నేడు గుడివాడలో సిద్ధం బహిరంగ సభ

టీడీపీ హయాంలో గుడివాడలో నిర్మించిన టిడ్కో ఇళ్లు..? 'సిద్ధం' కాలేదు..

సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించిన దళితుల శ్మశానవాటిక..? 'సిద్ధం' కాలేదు..

మచిలీపట్నం-ముదినేపల్లి రహదారి అనుసంధాన ప్రక్రియ..? 'సిద్ధం' కాలేదు..

గుడివాడ, నందివాడ మండలాల్లోని తాగునీటి రిజర్వాయర్..? 'సిద్ధం' కాలేదు..

జలజీవన్ మిషన్‌లో గుడివాడకు తాగునీరు..? 'సిద్ధం' కాలేదు..

గుడివాడలో అంతర్గత రహదారుల నిర్మాణం..? 'సిద్ధం' కాలేదు..

సరిగ్గా పది నెలల కిందట టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవానికి గుడివాడ విచ్చేసిన సీఎం జగన్ వేదికపై ఆర్భాటపు ప్రసంగాలు చేస్తూ.. వరాల జల్లు కురిపించారు. రూ.కోట్లు కుమ్మరిస్తామని ఘంటాపథంగా ప్రకటించారు. నెలలు గడుస్తున్నా ఒక్కటంటే ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదు. ఇన్నాళ్లకు 'మేమంతా సిద్ధం' అంటూ సోమవారం మళ్లీ గుడివాడ గడప తొక్కుతున్న సీఎంకు 'మేమంతా ఎందుకు సిద్ధం కావాలి..' అంటూ పురవాసులు ప్రశ్నిస్తున్నారు.

- గుడివాడకు గతంలోనే సీఎం జగన్ వరాల వర్షం
- పది నెలలు అవుతున్నా ఒక్క హామీ నెరవేరని దైన్యం
- ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారంటున్న పురవాసులు
- 'మేమంతా సిద్ధంగా లేం' అంటూ ఆగ్రహం



పదినెలల కిందట సీఎం జగన్ గుడివాడలో టిడ్కో లబ్ధిదారులకు పట్టాలు ఇస్తున్న చిత్రమిది. నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్కరికి ఇల్లు చేతికొచ్చింది లేదు..

గుడివాడ : 2023, జూన్ 16వ తేదీన టిడ్కో గృహ సముదాయాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి జగన్ గుడివాడ విచ్చేసి బహిరంగ సభలో నియోజకవర్గానికి వరాలజల్లు కురిపించారు. పురపాలక పరిధిలో దళితుల శ్మశానవాటికకు రూ.5 కోట్లు, టిడ్కో మాస్టర్ ప్లాన్ రోడ్డు మచిలీపట్నం-ముదినేపల్లి రహదారి అనుసంధానం కోసం రూ.17 కోట్లు, గుడివాడ, నందివాడ మండలాల్లోని తాగునీటి రిజర్వాయర్ నిర్మాణం భూసేకరణ కోసం రూ.45 కోట్లు, టిడ్కో ఇళ్ల వద్ద, జగనన్న కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణం కోసం రూ.9.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జల్‌జీవన్ మిషన్ కింద తాగునీటి పనుల నిమిత్తం గుడివాడకు రూ.160 కోట్ల పనులు, గుడివాడ పురపాలక సంఘంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.26 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు.

టిడ్కో.. మాట మార్చుకో..

2018, మే 7వ తేదీన ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా జగన్ గుడివాడ బహిరంగ సభలో టిడ్కో ఇళ్లను ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కారు. లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చి, వారితో బ్యాంకు రుణాలు తీసుకుని, రాష్ట్ర ఖజానాకు జమ చేసుకున్నారు. మౌలిక వసతులు కల్పించి ఇళ్లు ఇస్తామని జగన్ అప్పట్లో హామీ ఇచ్చారు. ఇక స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని అయితే ఒక అడుగు ముందుకేసి అన్ని సౌకర్యాలను కల్పిస్తామని, లబ్ధిదారులు కట్టుబట్టలతో వస్తే చాలని, ఫర్నిచర్ సహా ఇళ్లను సిద్ధం చేసి ఇస్తామని హామీలు గుప్పించారు. కానీ, నేటికీ లబ్ధిదారులకు ఇళ్లు అందలేదు.

అంతర్గత రహదారులేవీ..?

టిడ్కో మాస్టర్ ప్లాన్ రోడ్డు మచిలీపట్నం-ముదినేపల్లి రహదారి అనుసంధానం కోసం రూ.17 కోట్లు, టిడ్కో గృహాల వద్ద, జగనన్న కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణం కోసం రూ.9.50 కోట్లతో అభివృద్ధి చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. జెట్ స్పీడ్‌తో పనులను చేపట్టనున్నామని పేర్కొన్నారు. కానీ, ఎక్కడా పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. ఈ ప్రతిపాదన కూడా కాగితాలకే పరిమితమైంది. కనీసం టెండర్లు కూడా పిలవలేదు. ఇక సీఎం ప్రత్యేక నిధులు రూ.26.45 కోట్లతో గుడివాడ పురపాలక సంఘంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి జగన్ సభాముఖంగా శంకుస్థాపన చేశారు. కొడాలి నాని అండ్ కో మాత్రం ఎన్నికల కోడ్ రాకకు వారం ముందు రహదారుల నిర్మాణానికి హడావిడిగా మళ్లీ శంకుస్థాపన చేసింది. పనులు ప్రారంభించకుండానే బిల్లులు చేసుకున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

దళిత శ్మశానంపై దోబూచులాట

స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని అడిగారంటూ దళితుల శ్మశాన వాటిక స్థల సేకరణకు నిధులు మంజూరు చేస్తున్నానని సీఎం హామీలు గుప్పించారు. కేవలం నెల వ్యవధిలో స్థలాన్ని సేకరించి అప్పగిస్తానన్నారు. ఈ మాటలకు పొంగిపోయిన స్థానిక వైసీపీ నాయకులు.. జగన్ దళితుల పాలిట దేవుడని, సమస్యలు తీర్చే గొప్ప నాయకుడంటూ ఆయన చిత్రపటాలకు పాలభిషేకాలు చేశారు. కానీ, నేటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. కనీసం భూసేకరణ దశ కూడా దాటలేదు.

పీబీ సిద్ధార్థలో మాగ్నోవా-2024 రేపు



మొగల్రాజపురం, ఏప్రిల్ 14 : విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడానికి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో మాగ్నోవా -2024 రాష్ట్రస్థాయి మెగా ఈవెంట్‌ను ఈనెల 16న కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. కళాశాలలో ఆదివారం మాగ్నోవా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మాగ్నోవాలో భాగంగా వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్, ఈవెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, కె.విజయ్, డాక్టర్ శ్రీనివాసులు, పి. కిషోర్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.04

కూటమి ఎన్నికల కార్యాలయం ప్రారంభం

విద్యాధరపురం : భవానీపురంలో కూటమి ఎన్నికల కార్యాలయాన్ని ఆదివారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) ప్రారంభించారు.

వైభవంగా దుర్గమ్మ నవరాత్రోత్సవాలు

● ఆరో రోజు ప్రత్యేక పుష్పార్చనలు

వన్‌టౌన్, ఏప్రిల్ 14 : దుర్గమ్మ ఆలయంలో చైత్ర మాస వసంత నవరాత్రోత్సవాల్లో ప్రత్యేక పుష్పార్చనలు కొనసాగుతున్నాయి. ఆరోరోజు ఆదివారం అమ్మవారికి కాగడా మల్లెలు, జాజులు, మరువంతో అర్చించారు. భక్తులు కరుణించు మాయమ్మ కనకదుర్గ అంటూ దుర్గమ్మను స్తుతించారు. పుష్పార్చన, అమ్మవారి మూలవిరాట్టును దర్శించుకున్న భక్తులు మొక్కుబడులను తీర్చుకున్నారు. కొందరు భక్తులు పొంగళ్లు సమర్పించారు. ఆదివారం, చైత్రమాస వసంత నవరాత్రోత్సవాల కారణంగా ఎండను, ఉక్కపోతను సైతం లెక్కచేయకుండా మహిళలు, వృద్ధులు, పిల్లలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మరువం, జాజులు, కాగడా మల్లెలతో జరిగిన అర్చనలో ఈవో కేఎస్ రామారావు దంపతులు పాల్గొని అమ్మవారిని అర్చించారు.




సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, వీక్షిస్తున్న భక్తులు



ధర్మపథం వేదికపై కళాకారుల నృత్యప్రదర్శన

● సూర్యోపాసన సేవ

దేవస్థానంలో ప్రతి ఆదివారం లోకకల్యాణార్థం సూర్యోపాసన సేవ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భక్తులు పలువురు పాల్గొని తమ ఆయురారోగ్యాలను పరిరక్షించాలని కోరుతూ సూర్యనారాయణస్వామిని కొలిచారు. అర్చకులు యథావిధిగా సూర్యోపాసన సేవ, అరుణ పారాయణ తదితరాలను నిర్వహించారు. పలువురు భక్తులు చండీ హోమం, ఖడ్గమాలార్చన, లక్షకుంమార్చన, శ్రీచక్రనవావరణార్చన తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.

● సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

దుర్గగుడిలో షష్టి తిథి సందర్భంగా మాసవారి ఆర్జిత సేవ కింద వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల లీలా కల్యాణోత్సవాన్ని మహామండపం ఏడో అంతస్తులో నిర్వహించారు. కల్యాణోత్సవ క్రతువును శాస్త్రోహితంగా నిర్వహించారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామారావుతో పాటు దేవదాయ కమిషనర్ సత్యనారాయణ భక్తులకు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

● అన్నవితరణకు విరాళం

దుర్గగుడిలో ప్రతిరోజూ నిర్వహించే అన్నవితరణ కార్యక్రమానికి విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన దంగేటి రవిశంకర్, యమున దంపతులు ఆదివారం ఆలయానికి విచ్చేసి రూ.1,01,116లు విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేశారు.

● ధర్మపథం

వసంత నవరాత్రోత్సవాల సందర్భంగా ఆలయంలోని ధర్మపథం వేదికపై ఆదివారం నందికొట్కూరుకు చెందిన డి.సాయిలిక్షిత ఆధ్వర్యంలో నృత్యప్రదర్శన నిర్వహించారు. కళాకారుల ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సుజనా చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న కేశినేని శివనాథ్(చిన్ని)



బాడవపేటలో ప్రచారం చేస్తున్న గద్దె అనురాధ

పశ్చిమను తీర్చిదిద్దుతా

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి

చిట్టినగర్, ఏప్రిల్ 14: పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేసి, అన్ని హంగులతో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి అన్నారు. ఆదివారం 48,49వ డివిజన్లలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారిని సుజనా చౌదరి, టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లా ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నాగుల్‌మీరా, టీడీపీ నాయకులు ఎంఎస్. బేగ్ దర్శించుకొని పూజలు చేశారు. చిట్టినగర్, బంగారయ్యకొట్టు సెంటర్, జోడుబొమ్మల సెంటర్, ఎర్రకట్ట ప్రైజర్‌పేట ప్రాంతాల్లో ప్రచారం చేశారు. కొండప్రాంతాల సమస్యలు పరిష్కరించి, పశ్చిమాన్ని అన్ని హంగులతో మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు.

విద్యాధరపురం : విజయవాడ వెస్ట్‌ను బెస్ట్‌గా మారుస్తానని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. ఆదివారం ఉమ్మడి పార్టీల కార్యకర్తల సమావేశం జరిగింది. కుల మతాలకు అతీతంగా సమర్థత ఉన్న వ్యక్తిని ఎన్నుకోవాలన్నారు. జనసేన కార్యకర్తలకు పవన్‌కల్యాణ్ అన్న అయితే తనను పెద్దన్నగా పరిగణించాలన్నారు. కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, విజయవాడలో అషాఢ భూతులు పోతిన మహేష్, కేశినేని నానీలు పార్టీలు వీడిపోయారన్నారు. టీడీపీ బీసీ మైనార్టీ నాయకుడు నాగుల్‌మీరా, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్ తోపాటు జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

వన్‌టౌన్ : అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కూటమి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ(సుజనా చౌదరి) అన్నారు. ఉండవల్లి ఆక్వా డెవిల్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీజేపీ మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో టీడీపీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)తో కలిసి ఆయన పాల్గొన్నారు. వైసీపీ పాలనలో అమరావతి అభివృద్ధి జరగకపోగా రాష్ట్రం 20 ఏళ్ల వెనుకకు పోయిందన్నారు. అమరావతిని టూరిస్ట్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని కేశినేని చిన్ని తెలిపారు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బీజేపీ నాయకుడు పైలా సోమినాయుడు, జనసేన నాయకురాలు రజని పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా

వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సహకరిస్తామని కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం వించిపేటలోని కోదండ రామాలయాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకట్ ఆహ్వానం మేరకు దర్శించారు. అర్చకులు పూర్ణకలశంతో స్వాగతం పలికారు. ఆశీస్సులు అందజేశారు. శ్రీరామనవమి కల్యాణ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నానీ పిచ్చివాగుడు మానుకో

కూటమి విస్తృత స్థాయి సమావేశంలో నేతలు

విద్యాధరపురం : వైసీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) పిచ్చి వాగుడు మానుకోవాలని టీడీపీ నాయకులు హితవు పలికారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నేతల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం భవానీపురంలోని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో జరిగింది. కేశినేని శివనాథ్(చిన్ని)పై కేశినేని శ్రీనివాస్ (నాని), ఆయన కుమార్తె శ్వేత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. పద్ధతి మార్చుకోకపోతే సహించేది లేదన్నారు. నానికి దమ్ముంటే వైసీపీ టికెట్‌పై విజయవాడలో ఏ డివిజన్ నుంచైనా ఒక కార్పోరేటర్‌గా నైనా గెలవగలరా అంటూ సవాల్ విసిరారు.



తూర్పుకాపులు, యాదవుల అభ్యున్నతికి కృషి : బొండా ఉమా

పాయకాపురం : తూర్పుకాపు సామాజికవర్గ అభ్యున్నతికి కృషి చేస్తానని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. తూర్పుకాపుల ఆత్మీయ సమావేశం పైపులరోడ్డు వద్దగల ఓ కన్వెన్షన్‌లో ఆది వారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బొండా ఉమా హాజరయ్యారు. **మధురానగర్ :** కూటమి అధికారంలోకి రాగానే యాదవుల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటామని హామీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మధురానగర్ యాదవ సంఘం అధ్వర్యంలో ఆదివారం నేతాజీ రోడ్డులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మసిముక్కు శ్రీనివాస యాదవ్, ఎస్వీ శ్రీనివాస్‌యాదవ్, అంగిరేకుల రాంబాబు, ఎలక్ట్రికల్ బుజ్జి, టిడిపి డివిజన్ అధ్యక్షుడు పీవీఆర్, రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, జనసేన నాయకురాలు కెంబూరి భవాని పాల్గొన్నారు.

సంపద సృష్టికర్త చంద్రబాబు: కేశినేని జానకీలక్ష్మి

సత్యనారాయణపురం : సంపద సృష్టికర్త చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందని టీడీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకీలక్ష్మి పిలుపునిచ్చారు. 33వ డివిజన్ సత్యనారాయణపురంలో ఆదివారం బొండా ఉమా మహేశ్వరరావు సతీమణి బొండా సుజాతతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్, మంచి కంటి ధనలక్ష్మి, నిర్మల చౌదరి, తంగిరాల లక్ష్మి, జొన్నలగడ్డ సాయి పాల్గొన్నారు. **అజిత్‌సింగ్‌నగర్:** టీడీపీ మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు మహిళల జీవితాల్లో వెలుగును నింపుతాయని కేశినేని చిన్ని సతీమణి కేశినేని జానకీలక్ష్మీ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ 58వ డివిజన్‌లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. బొండా సుజాత, ఎరుబోతు శ్రావణి, రామారావు, గౌస్య, నాగమణి పాల్గొన్నారు.

బాడవపేటలో గద్దె అనురాధ ప్రచారం

మొగల్రాజపురం : అవినీతి, అక్రమాల వైసీపీకి చెక్‌పెట్టాలని జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ అన్నారు. ఏడో డివిజన్ బాడవపేట ఏరియాలో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేశినేని చిన్ని, గద్దె రామ్మోహన్‌లను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆమె కోరారు. సొంగా సంజయ్ వర్మ, గుమ్మడి గురుప్రసాద్, దోమకొండ అశోక్, కొండపల్లి లక్ష్మణరావు, మాదాల మల్లికార్జునరావు, దయాల శిరీషా గాంధీ, నాగుమోతు రాజా, నందిగం రమాదేవి, మోత్రపు బెనర్జీ, కలగట్ల చిన్న, కూరపాటి దిలీప్, చీలి జగన్ ఉన్నారు.

టీడీపీతోనే మహిళలకు రక్షణ

రాణిగారితోట : మహిళలకు గౌరవం టీడీపీ ప్రభుత్వంలోనే లభిస్తుందని, మహిళల అభ్యున్నతికి పాటుపడని జగన్‌ను ఇంటికి సాగనంపాలని కేశినేని చిన్ని సోదరి కేశినేని శ్రీదేవి పిలుపునిచ్చారు. 18వ డివిజన్‌లో ఆదివారం ఆమె గద్దె అనురాధతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉషారాణి, వేముల దుర్గారావు పాల్గొన్నారు.



బందెల దొడ్డి వద్ద కేకు కట్ చేస్తున్న మాలమహానాడు నాయకులు



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న 17వ డివిజన్ టీడీపీ నాయకులు

జయంతి సందర్భంగా బి.ఆర్.అంబేడ్కర్‌కు ఘననివాళి

పాయకాపురం, ఏప్రిల్ 14 : ప్రపంచానికే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సెంట్రల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్య దర్శి బెజ్జం జైపాల్ ఆధ్వర్యంలో ఆదివారం 63వ డివిజన్ రాజీవ్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. పైడి శ్రీను, బత్తుల కొండ, లబ్బా వైకుంఠం, పైడి తులసి, లబ్బా దుర్గ పాల్గొన్నారు. **అజిత్‌సింగ్‌నగర్:** అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి బొండా ఉమా పూలమాల వేసి నివాళులు అర్పించారు. **అజిత్‌సింగ్‌నగర్:** రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడమే అంబేడ్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడుసీహెచ్ బాబురావు అన్నారు. అజిత్‌సింగ్ నగర్‌లోని అంబేడ్కర్ గ్రంథాలయం వద్ద బాబూరావు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కె.దుర్గారావు, రమణారావు, సాంబిరెడ్డి పాల్గొన్నారు. **భవానీపురం:** బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అవిరళ కృషి చేసిన బీఆర్ అంబేడ్కర్ ధన్యజీవి అని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.గాంధీనాగరాజన్ అన్నారు. ఊర్మిళానగర్‌లోని ట్రస్టు కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన నివాళి అర్పించారు. ట్రస్ట్ సభ్యులు బంగారు భారతి, శివరంజని పాల్గొన్నారు. **పాత రాజరాజేశ్వరి పేట:** 34వ డివిజన్ కేదారేశ్వరరావుపేటలో మాజీ కార్పొరేటర్ బుట్టి రాయప్ప అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కాళ్ల చిన్నప్ప, కాళ్ల విజయ్, మారయ్య, జి.ప్రసాద్ పాల్గొన్నారు. **మొగల్రాజపురం:** 8వ డివిజన్‌లో టీడీఈపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవరపల్లి ఆంజనేయులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మల్లెల రామకృష్ణ, జాస్తి లక్ష్మీపతి, నారు రామారావు, మామిడి రాంబాబు, మెరకనపల్లి నాగేశ్వరరావు, జంతిక నాగేశ్వరరావు, మల్లవరపు జ్యోతి పాల్గొన్నారు. జనశిక్షణా సంస్థాన్ ఛైర్మన్ నాగళ విద్యాఖన్నా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రోగాం ఆఫీసర్ డి.కోటేశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. 7డివిజన్‌లో వీవీ రావు మాలమహానాడు ఆధ్వర్యంలో బందిలదొడ్డి వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు నివాళులర్పించారు. తోట శ్రీనివాసరావు, పాల జాన్సీ, ఉదయ్, కాపు దేసి రాజేష్,బాపట్ల అనిల్, నత్తా ప్రవీణ్ పాల్గొన్నారు. **రాణిగారితోట:** టీడీపీ 17వ డివిజన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ పార్టీ అధ్యక్షురాలు రాయి రంగమ్మ, టీడీపీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. దైదా మహేష్, గురవయ్య, వీరాస్వామి, ఆది బాబు పాల్గొన్నారు. **చిట్టినగర్:** అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని కేశినేని ఫౌండేషన్(కేశినేని చిన్ని) సహకారంతో 49వ డివిజన్ టైలర్‌పేట ప్రాంతంలో అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందజేశారు. తెలుగుయువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్.మాధవ, 49వ డివిజన్ అధ్యక్షుడు బడుగు వెంకన్న, లంకె శ్రీనివాసరావు, పాల్గొన్నారు. **వన్‌టౌన్:** అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం తుమ్మలపల్లివారి క్షేత్రయ కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు మాదిగాని గురునాథ నివాళులర్పించారు. అంబేద్కర్ ఒక వ్యక్తి కాదని, అనంత శక్తి అంటూ కొనియాడారు. నరసింహచౌదరి, డాక్టర్ సంకే విశ్వనాధం, స్వామిదాస్,కామాదేవరాజ్, పరిశపోగు రాజేష్, ఎం అబీద్ హుసేన్, ఈవీ ఛార్లెస్ తదితర నాయకులు పాల్గొన్నారు.


Sathya.retail
ఏప్రిల్ 15 నేటి నుండి
మీ సత్యా ఇప్పుడు
విజయవాడ లో
(శ్రీ హరి సూపర్ మార్కెట్ పక్కన)
సత్యా
అంటే సంతోషం
ప్రారంభోత్సవ ఆఫర్‌గా,
రూ. 20000 పైగా
వస్తువులు కొనుగోలు చేసే అందరికీ
బంగారు నాణెం ఉచితం
SATHYA
SPREADING HAPPINESS
చల్లగా చల్లగా
AC OFFER
అన్ని బ్రాండ్ల AC లు
అతి తక్కువ ధరలకే లభిస్తాయి
VOLTAS LG BLUE STAR DAIKIN Haier Carrier GENERAL
SAMSUNG Godrej Panasonic HITACHI LLOYD IFB
3 Star AC ₹28990 onwards
5 Star AC ₹34990 onwards
EMI ₹1999 onwards
0 Down Payment
upto ₹5000 Exchange Offer
₹5000 Cash Back
20% OFF Single / Double Booster Stabilizer
Authorised Reseller
ఎక్కడా అందుబాటులో లేని ధరలో
iPhone 15
now at just ₹67990
MRP ₹79900
EMI ₹2832 0 Down Payment
SAVE ₹12000 on MRP
offer valid till 15 April 2024
Buy iPhone / iPad
Sathya Instant Discount upto ₹5000
Cash Back upto ₹4000
Exchange Bonus upto ₹6000
Trade in Value upto ₹25000
Buy Smartphone
Cash Back upto ₹6000
0 Down Payment
Earbuds
Non-stick Tawa
FREE*
Buy 2 Calling Smartwatches
Just ₹1999* Assured Gift
Buy Fridge (Refrigerator)
& get upto 46% OFF
Buy Side By Side Refrigerator & get 10990 worth Mini Refrigerator FREE*
Buy Double / Single Door Refrigerator & Get Electric Rice Cooker (or) Pressure Cooker FREE*
upto ₹5000 Cash Back
LG SAMSUNG Haier Whirlpool Godrej IFB BOSCH VOLTAS beko
Buy Washing Machine
& get upto 54% OFF
8 kg Washing Machine EMI ₹1791*
VIP STROLLEY FREE*
Buy Front Load Washing Machine & get Juicer Mixer COMBO FREE*
Buy Top Load Washing Machine & get Iron Box FREE*
LG SAMSUNG Haier Whirlpool IFB Panasonic BOSCH Godrej
Buy LED TV
EMI ₹999* onwards
0 Down Payment*
OLED evo
Buy any OLED 32" LED TV FREE*
Buy any 55" & 65" LED Sound Bar FREE*
Buy any 32" & 43" LED Neck Band 499 only
Buy any 75" LED Sound Bar FREE*
upto ₹15000* Cash Back Offer
Buy Kitchen Appliance
& get upto 63% COMBO OFF
& get upto 10% OFF
& get ₹1000 worth Non Stick Tawa FREE*
Buy Water Purifier
& get Butterfly Electric Kettle FREE*
Buy Pedestal Fan
& get 3 Pcs Set FREE*
Buy Laptop
₹23,700 onwards
DELL hp acer mi SAMSUNG
Buy Water Heater
Bath Towel FREE*
Buy Microwave Oven
Biriyani Pot FREE*
Available PS5
*T&C Apply
SATHYA
SPREADING HAPPINESS
Scan to find our Showroom Locations
Scan to know Prices, Offer details & to Shop Online
www.sathya.store
Whatsapp: 99166 98985 or Call: 88805 98985
For corporate bookings or bulk orders, mail us: corporatesales@sathya.email
Extended Warranty Available
onsitego
శ్రీ హరి సూపర్ మార్కెట్ పక్కన, పాత చెక్ పోస్ట్, ఆటోనగర్, విజయవాడ. PH: 81060 84659, 90309 94899
Our Branches now: Naidupeta Opp. to Railway Station 8754469985 | Sulurpeta SHAR Byepass Road 91501 75985 | Chittoor Near Old Bus Stand 9003179985 | Tirupathi (Thirumala Road 7845229985 & Air Byepass Road 78453 63985) | Venkatagiri RTC Bus Stand Road 7338740985 | Pileru Cross Road Junction 78453 45985 | Tadipatri Canara Bank Road 95001 21985 | Chilkulurpeta Near India Bank GT Road 73583 80985 | Palamnar Near Old Canara Bank 73387 96985 | Bapatla 6304983454 | Koduru 9789778985 | Tenali 9866865813 | Nellore 7026278985 | Vijayawada 81060 84659
Now 200+ Showrooms
త్వరలో
Punganur | Sri Kalahasti | Nandyal | Narasaraopet | Rajampet | Guntur | Machilipatnam | Vijayawada | Kurnool | Ongole | Proddutur | Badvel | Puttur | Rayachoti | Anantapur | Adoni | Vinukonda | Kadapa | Tadepalligudem | Thadapali | Guntur | Madanapalli | Chirala | Bhimavaram | Eluru | Buchireddy Palem | Kadiri | Kavali | Kaikalur | Gudivada | Atmakur | Tanuku | Mydukur | Vuyyur

దిక్సూచి DIKSUCHI

ఇండియన్ హిస్టరీ

గుప్తుల కాలంలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు



భారతదేశ చరిత్రలో గుప్తుల కాలాన్ని పరిశీలించే క్రమంలో ఆనాటి సామాజిక, ఆర్థిక తదితర పరిణామాలను తరచి చూడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు వీటిని మరింత లోతుగా తెలుసుకోవాలి.

గుప్తుల కాలం నాటి సమాజంలో నాలుగు వర్ణాలతో పాటు 'చండాలులు' అనే పంచమ వర్ణం ఏర్పడింది. దీనిని ఫాహియాన్ 'అంటరాని వర్ణం'గా పేర్కొన్నాడు. వర్ణాశ్రమ ధర్మాలు ఉండేవి. అయినప్పటికీ 'వర్ణ సంకర' విధానం కొనసాగింది. వర్ణాశ్రమ ధర్మం కాపాడటానికి 'అభయదత్తుడు' అనే ఉద్యోగిని రాజు నియమించాడు. శాతవాహనుల మాదిరిగానే వీరు కూడా బ్రాహ్మణులకు అగ్రహారాలు(గ్రామాలు) దానంగా ఇచ్చేవారు.

గుప్తుల కాలంలో స్త్రీ స్వేచ్ఛ తగ్గిపోయింది. సతీసహగమనం, బాల్య వివాహాలు, బహుభార్యత్వం వంటి అనాచారాలు కొనసాగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహాలు ఉండేవి. పురుషులు అధిక వర్ణం స్త్రీలను వివాహాలు చేసుకోవడాన్ని ధర్మశాస్త్రాలు నిషేధించాయి. క్రీ.శ.510లో 'ఎరాన్' శాసనాన్ని భానుగుప్తుడు చెక్కించాడు. దీనిలో సతీసహగమనం, దేవదాసి ఆచారం ఉన్నట్లు రాసి ఉంది. సమాజంలో శెట్టిలు(వ్యాపారులు), జితిక అనే వృత్తిపనివారు ఉన్నారని 'భితారి' శాసనంలో రాశారు. సేద్య బానిసలు, జాజ్‌మని అనే వ్యవస్థకు గుప్తుల కాలంలోనే పునాది పడింది. ఈ వ్యవస్థకు గల కారణాలు 'ఇండోర్' శాసనంలో ఉన్నాయి.

నలంద విశ్వవిద్యాలయం



దీనిని కుమారగుప్తుడు నిర్మించాడు. తరవాత పుష్యభూపతి వంశంలో హర్షుడు ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేశాడు. ఆ తరవాత పాలరాజులకు చెందిన ధర్మపాలుడు కూడా ఈ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేశాడు. సంస్కృతంలో 'నలం' అంటే జ్ఞానం లేదా పద్మం అని, 'ద' అంటే ఇవ్వడం అని అర్థం. నలంద విశ్వవిద్యాలయంలో మూడు గొప్ప గ్రంథాలయాలు ఉన్నాయి. వీటికి తురుష్కరాజులు సహాయం చేశారు. 12వ శతాబ్దంలో భక్తియార్ ఖిల్జీ చేతిలో ఈ విశ్వవిద్యాలయం పతనం చెందింది.

ఆర్థిక విధానం

భూములను సామంతులకు, ఉద్యోగులకు, బ్రాహ్మణులకు దానాలుగా ఇవ్వడం వల్ల రాజుకు భూమిపై అధికారం తగ్గింది. రాజుకు, సాగుచేసే సామాన్య రైతుకు మధ్య అనేక మంది మధ్యవర్తులు ఉండటంతో ఫలితాన్ని అనుభవించే భూస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. ఈ భూస్వామ్య వ్యవస్థ గురించి 'భితారి' శాసనంలో రాశారు. 'సార్థవాహనులు' అనే సంచార వర్తకులు కూడా నగరాల్లో ఎక్కువగా ఉండేవారు. రైతులపై హిరణ్య(నగదు పన్ను); కొనుగోలు మీద వేసే క్లిప్త, ఉపక్లిప్త పన్నులు; అమ్మకపు పన్ను; వ్యవసాయానికి వాడుకునే నీటిపై వేసే వత భూత పన్ను గుప్తుల కాలంలో విధించేవారు.

భూ విభజన: భూములను ఖిల్ల(వ్యవసాయ), క్షేత్ర(నివాస), స్థల(అటవీ) అని మూడు రకాలుగా విభజించారు.

నాణేలు: కంస, సిక్క

విదేశీ వాణిజ్యం: గుప్తులు ఎక్కువగా ఆగ్నేయాసియా దేశాలతో వర్తక వాణిజ్యాలు నిర్వహించేవారు. అరికమేడు, ముజ్రిస్, కావేరి రేవు పట్టణాలు ప్రసిద్ధి. పర్షియా, అరేబియా, ఆఫ్ఘానిస్థాన్ దేశాల నుంచి గుర్రాలను దిగుమతి చేసుకునే వారు.

మత విధానం

వైదిక మతం పునరుద్ధరించారు. క్రతువులు, యజ్ఞయాగాలు పెరిగాయి. వేదాలు వినడం, ఇతిహాసాలు చదవడానికి శూద్రులకు అవకాశం కల్పించారు. దశావతారాలు, త్రిమూర్తులను నాటి ప్రజలు పూజించేవారు. బౌద్ధ, జైన మత సూత్రాలను హిందూ మతం గ్రహించింది. శైవ మతానికి ఆదరణ పెరిగింది. మూఢ నమ్మకాలు కూడా పెరిగాయి. విగ్రహారాధన స్థిరపడింది.

వైష్ణవం: ఈ మతంలో నూతన శాఖలు ఏర్పడ్డాయి. పంచరాత్రి, వైఖానస మొదలైన శాఖలు ఏర్పడ్డాయి. రెండో చంద్రగుప్తుడు పరమ భాగవతుడని పేరు పొందాడు.

శైవం: శైవంలో తాంత్రిక శాఖలు, భక్తి శాఖలు ఏర్పడ్డాయి. వీటిని కాపాలిక, కాలాముఖ శాఖలు అనేవారు. మితవాద శాఖలు కూడా ఉండేవి. శివున్ని లింగ రూపంలో పూజించడం ప్రారంభించారు. ఇది మొదట కశ్మీర్‌లో ప్రారంభమైంది. అభినవ గుప్తుడు త్రిక అనే శాఖను ప్రారంభించాడు. వసుగుప్తుడు ప్రత్యాభిజ్ఞా అనే శైవ శాఖను ప్రారంభించాడు.

జైన మతం: అనేక జైన స్థావరాలు నిర్మించారు. గుజరాత్‌లో జైనమతం అభివృద్ధి చెందింది.

బౌద్ధ మతం: అనేక ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు నిర్మించారు. బుద్ధగయలో బౌద్ధ విహారం నిర్మించడానికి శ్రీలంక రాజు మేఘవర్ణుడికి సముద్రగుప్తుడు అనుమతించి పరమత సహనం చాటాడు. మథుర, సార్‌నాథ్, కౌశాంబి మొదలైనవి బౌద్ధ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. అసంగుడు, పరమార్థుడు, దిగ్నాగుడు ఈ కాలపు గొప్ప బౌద్ధ పండితులు.

గుప్తుల పరమత సహనం: గుప్తులు హిందూ మతాభిమానులైనా...పరమత సహనం చూపారు. బౌద్ధ, జైనులకు పదవులు ఇచ్చారు. దానాలు చేశారు. విరాళాలు ఇచ్చారు. రెండో చంద్రగుప్తుని సేనాని 'అమరక దేవుడు' బౌద్ధుడు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

సాహిత్యం

గుప్తుల కాలం సాహిత్యానికి స్వర్ణయుగం అని చెప్పవచ్చు. సముద్రగుప్తుడు స్వయంగా కవి. అతనికి 'కవిరాజు' అనే బిరుదు ఉండేది. రెండో చంద్రగుప్తుని కాలంలో 'నవరత్నాలు' అని పేరుపొందిన కవులు ఉండేవారు. వారిలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కాళిదాసు ఒకరు. ఈయన రాసిన 'అభిజ్ఞాన శాకుంతలం' గ్రంథాన్ని సర్ విలియం జోన్స్ ఆంగ్లంలోకి అనువదించాడు. 'మాళవికాగ్నిమిత్రం' నాటకంలో ఉజ్జయని రాకుమార్తె మాళివికను మగధ యువరాజు అగ్నిమిత్రుడు చేసుకున్న వివాహం(రాక్షస వివాహం) గురించి కాళిదాసు అద్భుతంగా రాశాడు.

గుప్తుల కాలంలో కొనసాగిన సాహిత్య సేవను చరిత్రకారులు గ్రీస్‌లోని పెరిక్లస్ యుగంతో, రోమ్‌లోని అగస్టస్ యుగంతో, ఇంగ్లాండ్‌లోని ఎలిజబెత్ యుగంతో పోల్చారు. గుప్త రాజులు సంస్కృత, సాహిత్య రంగాల్లో చేసిన సేవల వల్లనే వారి యుగానికి స్వర్ణయుగం అనే పేరు వచ్చింది. గుప్త చక్రవర్తులు స్వయంగా పండితులు. అలహాబాద్ ప్రశస్తి శాసనంలో కావ్యశైలిలో హరిసేనుడు అద్భుతంగా రాశాడు.

నవరత్నాలలో ఒకడైన కాళిదాసు రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం అనే కావ్యాలు రాశాడు. అదేవిధంగా ఇతర కవుల గ్రంథాలు... శూద్రకుడు - మృచ్ఛకటికం; విశాఖదత్తుడు- ముద్రా రాక్షసం, దేవీచాంద్రగుప్తం; భానుడు- వాసవదత్త, విష్ణుశర్మ- పంచతంత్రం మొదలైనవి. అమరసింహుడు 'అమరకోశం' అనే వ్యాకరణ గ్రంథాన్ని రాశాడు. కామాంధకుడు 'నీతి శాస్త్రం' రచించాడు. ఇది గుప్తుల కాలంలో వచ్చిన రాజకీయ గ్రంథం. మౌర్యుల అర్థ శాస్త్రంతో పోల్చదగినది.

వేదాంత శాస్త్రాలు: ఈ కాలంలో అద్భుతమైన గ్రంథాలు వచ్చాయి. అసంగుడు బౌద్ధ గ్రంథాలపై వ్యాఖ్యానాలు రాయగా, దిగ్నాగుడు ప్రమాణచముచ్ఛేయం రాసి తర్కశాస్త్ర పితగా ప్రసిద్ధి చెందాడు. అష్టాదశ పురాణాలను ఈ కాలంలోనే రాశారు. మనుధర్మశాస్త్రం, యజ్ఞవల్క్యస్మృతి మొదలైనవి ఈ కాలంనాటి ప్రముఖ గ్రంథాలు.

విజ్ఞానశాస్త్ర గ్రంథాలు: గుప్తుల కాలంలో సాహిత్యంతోపాటు విజ్ఞాన శాస్త్రం కూడా అభివృద్ధి చెందింది. గణిత, ఖగోళ, భౌతిక, వైద్యశాస్త్రాలు అభివృద్ధి చెందాయి. దశాంశ పద్ధతి, సున్నా విలువలు వాడుకలోకి వచ్చాయి. రెండో చంద్రగుప్తుడు ఉజ్జయినిలో నక్షత్రశాలను నెలకొల్పాడు. మెహరోలిలో నక్షత్రాల పరిశీలన కోసం వరహమిహిరుడికి రెండో చంద్రగుప్తుడు ఎత్తయిన ఇనుప స్తంభం నిర్మించి ఇచ్చాడు. రోమక, జాతక, లఘు అనే గణితశాస్త్ర గ్రంథాలను వరహమిహిరుడు రాశాడు. అదేవిధంగా బృహత్‌సంహిత గ్రంథంలో భూగోళ, ఖగోళ, జ్యోతిష, వృక్ష శాస్త్రాల గురించి రాశాడు. ఆర్యభట్టీయం, సూర సిద్ధాంతాలను ఆర్యభట్టు రచించాడు. వీటిలో సూర్య, చంద్ర గ్రహణాల గురించి వివరించాడు. వాగ్భటుడు వైద్యంలో అష్టాంగ సంగ్రహం అనే గ్రంథం రాశాడు. పాలకశ్యపుడు హస్త్యాయుర్వేదంలో పశువైద్యం గురించి రాశాడు. ధన్వంతరి, శుశ్రుతుడు గుప్తుల కాలంలో గొప్ప వైద్యులు.



డాక్టర్ ఐ. నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

రీజనింగ్

కోడింగ్ - డీకోడింగ్

పోటీపరీక్షల ప్రత్యేకం

పార్ట్-3

1. ఒక కోడ్ భాషలో MERITను 7, 18, 9, 22, 14గా రాశారు. అదే కోడ్ భాషలో PONDSను ఏ విధంగా రాస్తారు?

ఎ) 11, 12, 23, 13, 8 బి) 11, 13, 12, 8, 23
సి) 8, 23, 13, 12, 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: MERIT అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా M అనగా 14వ అక్షరం, E అనగా 22, R అనగా 9, I అనగా 18, T అనగా 7. ఈ సంఖ్యలను రివర్స్ చేయగా 7, 18, 9, 22, 14. ఇదే విధంగా PONDS అనే పదాల్లోని అక్షరాలకు అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా P అనగా 11, O అనగా 12, N అనగా 13, D అనగా 23, S అనగా 8. కావున 8, 23, 13, 12, 11 అనగా 'సి' సమాధానం అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో LUNCHను 58గా రాశారు. అదే కోడ్ భాషలో FRUITను ఏ విధంగా రాస్తారు?

ఎ) 74 బి) 68 సి) 72 డి) ఏదీకాదు

సమాధానం:(ఎ)

వివరణ: LUNCH అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా L అనగా 12, U అనగా 21, N అనగా 14, C అనగా 3, H అనగా 8, 12+21+14+3+8=58. ఇదే విధంగా PONDS అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా F అనగా 6, R అనగా 18, U అనగా 21, I అనగా 9, T అనగా 20. కావున 6 +18+21 + 9 + 20=74 సమాధానం అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో BIGను 324గా రాశారు. అదే కోడ్ భాషలో ACTను ఏ విధంగా రాస్తారు?

ఎ) 576 బి) 529 సి) 676 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: BIG అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 9, 7 వీటిని కూడగా 2+9+7=18. ఈ 18 వర్గం (స్క్వేర్) 324. అదే విధంగా ACT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 3, 20 వీటిని కూడగా 1+3+20=24. ఈ 24 వర్గమే (స్క్వేర్) 576.

4. ఒక కోడ్ భాషలో AIMను 251గా రాశారు. అదే కోడ్ భాషలో INKను ఏ విధంగా రాస్తారు?

ఎ) 416 బి) 398 సి) 264 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: AIM అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 9, 13. వీటి విడివిడి వర్గాలను కూడగా అనగా $1^2, 9^2, 13^2$ = 1+81+169=251 అదే విధంగా INK అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 9, 14, 11. వీటి విడివిడి వర్గాలను కూడగా అనగా $9^2, 14^2, 11^2$= 81+196+121=398 సమాధానం అవుతుంది.

5. ఒక కోడ్ భాషలో HATను 160గా రాశారు. అదే కోడ్ భాషలో 'PAN'ను ఏ విధంగా రాస్తారు?

ఎ) 224 బి) 242 సి) 422 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: HAT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 8, 1, 20. వీటిని గుణించగా 8x1x20=160 అదే విధంగా PAN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 16, 1, 14 వీటిని గుణించగా 16x1x14 = 224 సమాధానం అవుతుంది.

6. ఒక కోడ్ భాషలో PLANEను 96గా రాశారు. అదే కోడ్ భాషలో SOLVEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 142 బి) 144 సి) 146 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: PLANE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు P అనగా 16, L అనగా 12, A అనగా 1, N అనగా 14 E అనగా 5 వీటిని కూడగా 16+12+1+14+5=48కి రెట్టింపు 96. అదే విధంగా SOLVE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు S అనగా 19, O అనగా 15, L అనగా 12, V అనగా 22, E అనగా 5 వీటిని కూడగా 19+15+12+22+5=73 కి రెట్టింపు 146 సమాధానం అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో SMART ను 128గా రాశారు. అదే కోడ్ భాషలో RANGEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 180 బి) 160 సి) 168 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: SMART అనే పదంలోని అక్షరాలకు అపసవ్య దిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా S అనగా 8, M అనగా 14, A అనగా 26, R అనగా 9, T అనగా 7. వీటిని కూడగా 8+14+26+9+7=64కి రెట్టింపు 128. ఇదేవిధంగా RANGE అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు R అనగా 9, A అనగా 26, N అనగా 13, G అనగా 20, E అనగా 22 వీటిని కూడగా 9+26+13+20+22=90 రెట్టింపు 180 సమాధానం అవుతుంది.

8. ఒక కోడ్ భాషలో LIKEను 33గా రాశారు. అదే కోడ్ భాషలో EARNను ఏ విధంగా రాస్తారు?

ఎ) 34 బి) 38 సి) 37 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: LIKE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 12+9+11+5=37. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 37 నుంచి 4 తీసివేస్తే 37-4=33. అదే విధంగా EARN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 5+1+18+14=38. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 38 నుంచి 4 తీసివేస్తే 38-4=34 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దక్షిణ భారత్‌కూ బుల్లెట్ రైలు

- 'ఒకే దేశం ఒకే ఎన్నిక' నిర్వహిస్తాం..
- ఇంటింటికీ నీరు, పైప్‌లైన్‌తో గ్యాస్
- అన్నదాతలందరికీ డ్రోన్లు
- ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం
- బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలు



బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న మోదీ, నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో సాధించిన ప్రగతిని వివరిస్తూ.. మళ్లీ అధికారంలో వస్తే ఐదేళ్లలో ఏం చేస్తామో చెబుతూ.. దేశ ప్రగతి, యువత, మహిళలు, పేదలు, రైతులు, కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆ పార్టీ అగ్రనేతలు ఆవిష్కరించారు. మోదీకి గ్యారెంటీ శీర్షికతో ఉన్న ఈ మ్యానిఫెస్టోను ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో ఆదివారం మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మ్యానిఫెస్టో కమిటీ ఛైర్మన్ రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ దక్షిణాదికీ బుల్లెట్ రైలు సేవలను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర, తూర్పు భారత్‌కూ బుల్లెట్ రైలు వేస్తామన్నారు. దీనిపై త్వరలో సర్వే ప్రారంభం కానుందని పేర్కొన్నారు. శరవేగంగా సాగుతున్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు పనులు పూర్తయ్యే దశకు వచ్చాయని.. ఈ అనుభవంతో మిగతా మూడు ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పారు. వందే భారత్ రైలు సేవలను దేశవ్యాప్తం చేస్తామన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని తెలిపారు. ముద్ర పథకం రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని ప్రకటించారు. ప్రతి ఇంటికీ నీరు, పైప్ ద్వారా గ్యాస్ అందిస్తామని హామీ ఇచ్చారు. పీఎం సూర్య ఘర్ ద్వారా జీరో పవర్ బిల్‌ను సాకారం చేస్తామన్నారు. మరో ఐదేళ్లపాటు ఉచిత రేషన్ అందిస్తామని మోదీ తెలిపారు. ఇప్పటికే 4కోట్ల ఇళ్లు కట్టించామని.. మధ్య తరగతికి మరో 3కోట్ల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు.

నాలుగు స్తంభాలతో సంకల్ప్ పత్ర

పేదలు, యువశక్తి, అన్నదాత, నారీశక్తి.. అనే నాలుగు స్తంభాలపై సంకల్ప్ పత్రకు పునాదులు వేశామని మోదీ వెల్లడించారు. పదేళ్లలో ఎంతో ప్రగతిని సాధించామని, 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని అందుకే బీజేపీ మ్యానిఫెస్టో కోసం యావత్ దేశం ఎదురుచూసిందని చెప్పారు. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్ హబ్‌గా మారుస్తామని ప్రకటించారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం పెంచుతామని మోదీ చెప్పారు. ప్రతి రైతు ఇంటిపై డ్రోన్లు తిరిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అభివృద్ధికి ఆటంకంగా మారిన అవినీతిని అంతమొందించడానికి ఎంతో చేశామని, భవిష్యత్తులోనూ దీనిని కొనసాగిస్తామని చెప్పారు. 140 కోట్ల మంది ప్రజలను దృష్టిలో పెట్టుకుని మ్యానిఫెస్టోను తయారు చేసామని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. మోదీ గ్యారెంటీపత్రం 24 క్యారెట్ల బంగారంతో సమానమన్నారు. మోదీ గ్యారెంటీ, 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాలుగా పేర్కొన్న బీజేపీ మ్యానిఫెస్టో తొలి కాపీలను ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన నలుగురికి అందజేశారు. విశ్వబంధు, స్వస్థ భారత్, సురక్షిత భారత్, సుస్థిర భారత్, సమృద్ధ భారత్, సాంకేతిక, ప్రపంచ తయారీ కేంద్రం, అత్యుత్తమ శిక్షణ, క్రీడా, సాంస్కృతిక వికాసం, ఈజ్ ఆఫ్ లివింగ్, సుపరిపాలన అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపరిచారు.

మ్యానిఫెస్టోలోని కీలక అంశాలు

ట్రాన్స్‌జెండర్లకూ ఆయుష్మాన్ భారత్; వందేభారత్ స్లీపర్, ఛైర్ కార్, మెట్రో రైల్ సర్వీసుల ప్రారంభం; జాతీయ విద్యా విధానం అమలు; 2036లో ఒలింపిక్స్ నిర్వహణ; పీఎం ఆవాస్ యోజనలో దివ్యాంగులకు ప్రాధాన్యం; యువతకు మౌలిక సదుపాయాల కల్పన; పర్యాటక రంగంలో లక్షల ఉద్యోగాల కల్పన; 3కోట్ల మంది మహిళలను లక్షాధికారుల చేసే లక్ష్యం; ఈశాన్యంలో సైన్యానికి ప్రత్యేకాధికారాల చట్టం క్రమంగా ఎత్తివేత; ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా గిగ్ వర్కర్లు, ట్యాక్సీ, ఆటో, ట్రక్కు డ్రైవర్లకు సంక్షేమ పథకాలు; తిరువళ్లూర్ కల్చరల్ సెంటర్ ద్వారా భారత సంస్కృతి ప్రపంచ దేశాలకు పరిచయం; ఉన్నత విద్యాసంస్థల్లో భారతీయ భాషల అధ్యయనానికి తోడ్పాటు; ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి ప్రయత్నం; ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా శాటిలైట్ పట్టణాలు; ఏకలవ్య పాఠశాలలు, పీఎం జన్‌మన్ పథకాలకు ప్రాధాన్యం; అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం.

నిరుద్యోగం కనపడలే.. ద్రవ్యోల్బణం వినపడలే

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

దేశ ప్రజల జీవితాల్లో ఎంతో కీలకమైన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అనే అంశాలు బీజేపీ మ్యానిఫెస్టోలో లేనే లేవని, మోదీ ప్రసంగంలోనూ వినపడలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. ఈమేరకు ఆయన ట్వీట్ చేశారు. ఈ రెండు అంశాలపై చర్చించడం బీజేపీకి ఇష్టం లేదని విమర్శించారు. యువత ఈసారి మోదీ వలలో పడదని, ఉపాధి విప్లవం రాబోతోందని వ్యాఖ్యానించారు. కాగా, మోదీ గ్యారెంటీ ఒక జుమ్లా అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. యువతకు ఏటా 2కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతు ఆదాయం రెట్టింపు చేశారా? అని నిలదీశారు. దక్షిణాదికీ బుల్లెట్ రైలు అంటున్నారని.. మొదటి బుల్లెట్ రైలే ఇంకా పట్టాలెక్కలేదని ఎద్దేవా చేశారు.

సెల్ టవర్ లేకున్నా మొబైల్ కమ్యూనికేషన్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్స్‌లో చైనా విప్లవాత్మక ఆవిష్కరణను తీసుకొచ్చింది. భూవిపై ఉన్న సెల్ టవర్ల అవసరం లేకుండా నేరుగా స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్‌ను సాధ్యం చేయగలిగేలా ప్రపంచంలోనే మొదటి ఉపగ్రహాన్ని ఆ దేశ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. స్వర్గంతో కనెక్ట్ అవ్వడం అని అర్థం వచ్చేలా దీనికి 'టియాంటాంగ్' అని దీనికి పేరుపెట్టారు. ఎనిమిదేళ్ల క్రితం చైనా రోదసీలోకి పంపిన 'టియాంటాంగ్-1' ఉపగ్రహ శ్రేణి ప్రస్తుతం మూడుకు చేరింది. ఇవి జియోసింక్రోనస్ కక్ష్యలో తిరుగుతూ మొత్తం ఆసియా-పసిఫిక్ ప్రాంతాన్ని కవర్ చేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతమంతా మొబైల్ శాటిలైట్ కనెక్టివిటీకి మార్గం సుగమమైంది. చైనాకు చెందిన 'హువావే' ఇప్పటికే ప్రపంచంలోనే శాటిలైట్ కనెక్టివిటీని సపోర్ట్ చేసే మొదటి మొబైల్ కంపెనీగా గుర్తింపు పొందింది. హువావే టెక్నాలజీస్ గతేడాది సెప్టెంబరులో శాటిలైట్ కాల్స్‌కు మద్దతునిచ్చే స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ జాబితాలో షియోమి, హానర్, ఒప్పో వంటి మొబైల్ కంపెనీలు కూడా చేరాయి. గతేడాది డిసెంబరు 18న చైనాలోని గాన్సు ప్రావిన్స్‌లో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించినప్పుడు.. సాంప్రదాయ కమ్యూనికేషన్ వ్యవస్థలు పనిచేయలేదు. ఈ సమయంలో బాధితుల్లో కొందరు శాటిలైట్ కాల్ సౌకర్యం ద్వారా బాహ్య ప్రపంచంతో సమాచారాన్ని పంచుకోగలిగారు.



కొందరికి అవకాశాలు పుష్కలంగా ఉన్నా చదువును పెద్దగా లక్ష్యపెట్టరు. మరి కొందరికి చదువంటే ప్రాణమైనా, వారికి సరైన అవకాశాలుండవు. సరిగ్గా ఇలాంటి పరిస్థితే కర్నూలు జిల్లాకు చెందిన సజ్జలగుడ్డం నిర్మలది కూడా. పదోతరగతిలో పాఠశాల ఫస్ట్ వచ్చిన అమ్మాయిని వ్యవసాయకూలీ పనులకు పంపారు తల్లితండ్రులు. అయినా, చదువుకోవాలన్న అమ్మాయి సంకల్పం ముందు ఆడపిల్లకు పెద్దచదువులు అక్కర్లేదన్న వాళ్ళ అమ్మానాన్న మొండితనం ఓడిపోయింది. బాగా చదివి ఐపీఎస్ అవ్వాలన్న నిర్మల పత్తిచేలో పనిచేస్తుండటాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెస్తే, అదిచూసిన కర్నూలు జిల్లా కలెక్టరు సృజన అమ్మాయిని తిరిగి తరగతి గదికి చేర్చారు. ఆస్పరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలో ఇంటర్ మొదటి సంవత్సరం 440కుగాను 421మార్కులతో సత్తాచాటిన నిర్మలను 'నవ్య' పలకరించింది.

ఒకప్పటి కూలి ఫస్ట్ వచ్చింది

"మాది కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని పెద్ద హరివనం. ఆంధ్రా-కర్ణాటక సరిహద్దు గ్రామం కావడంతో అభివృద్ధి అస్సల్లేదనే చెప్పాలి. బాల్యవివాహాలు బాగా ఎక్కువ. మూఢనమ్మకాల సంగతి చెప్పనక్కర్లేదు. ఆడపిల్లల విషయంలో అయితే అవి మరీనూ! అమ్మాయిలకు చదువుకన్నా పెళ్లి ముఖ్యమని మా ఊరివాళ్ల అభిప్రాయం. మా అమ్మానాన్న హనుమంతమ్మ, శీలప్పలది పొలంపని. మేము నలుగురు అక్కచెల్లెళ్లం. నేను అందరికన్నా చిన్నదాన్ని. మా ముగ్గురు అక్కలకూ పెళ్లిళ్లు అయ్యాయి. వారెవరూ హైస్కూలు దాటి చదవలేదు. కానీ నేను మాత్రం బాగా చదువుకొని ఐపీఎస్ అవ్వాలి అని కోరిక. ఎనిమిదో తరగతి నుంచి అదే నా జీవిత లక్ష్యంగా పెట్టుకొన్నాను. పదోతరగతిలో నాకు 537మార్కులు వచ్చాయి. పాఠశాల టాపర్ని కావడంతో మా ఉపాధ్యాయులతో పాటు ఊరివారంతా "మంచి మార్కులు వచ్చాయని" నన్ను అభినందించారు. కానీ ఆ సంతోషం ఎక్కువ రోజులు నిలవలేదు. ఇంటర్‌లో చేర్పించమని ఇంట్లో అడిగితే, "చదువులేదు గిదువులేదు పొలం పనుల్లో మాకు సాయంగా ఉంటే చాలు" అన్నారు. 'రెక్కలకష్టంతో బతికే మనం వేలకువేలు కాలేజీ ఫీజులు ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలి' అన్నారు. పేదరికానికి తోడు ఆడపిల్లను పొరుగూరుకు పంపించడం కూడా మా వాళ్లకు ఇష్టంలేదు. ఏదైతేనేం, నా చేత బలవంతంగా చదువు మాన్పించారు. నేను ఎంత బతిమాలినా వినలేదు. రోజులతరబడి ఏడ్చినా లాభంలేకపోయింది. చివరికి ఇంట్లో వాళ్లు చెప్పినట్లే రోజూ కలుపు తీయడం, పత్తి ఏరడం, సజ్జ కంకులు కోయడం లాంటి పొలంపనులకు వెళుతున్నా, చదువుకోలేకపోతున్నానన్న బాధ మాత్రం నన్ను కుదురుగా ఉండనివ్వలేదు.

> స్మార్ట్‌యుగంలోనూ అమ్మాయిలకు చదువుకన్నా పెళ్లి ముఖ్యమని చాలా గ్రామాలలో బలంగా నమ్ముతున్నారంటే... మనం చాలా వెనుకబడి ఉన్నామనే కదా అర్థం.! నన్ను మా కలెక్టరు గారు మొదట కర్నూలులోని ఒక మంచి కాలేజీలో చేర్పించడానికి ప్రయత్నించారు. అయితే, మా అమ్మానాన్న అందుకు అస్సలు ఒప్పుకోలేదు. పట్టణాలలో అమ్మాయిలకు భద్రతలేదన్నది వారి నమ్మకం. నాకేమైనా అవుతుందేమో అన్నది వాళ్ల భయం. అమ్మాయిల తల్లిదండ్రుల్లోని ఇలాంటి భయాలను పోగొట్టాలి. ఆడపిల్లలు చదువుకోవడం వల్ల కుటుంబానికి ఎంత ప్రయోజనమో మారుమూల పల్లెల్లోని వారికి తెలియజేయాలి.

'ఆంధ్రజ్యోతి'లో రాబట్టే...

ఇంకొద్ది రోజులు అయితే పెళ్లిసంబంధాలు చూడటం మొదలుపెడతారు. ఇక చదువుకోలేనన్న భయం నన్ను వెంటాడింది. ఐపీఎస్ అవ్వాలన్న నా కల ఇక తీరదన్న బెంగతో ఒక్కోరోజు తిండి కూడా సహించేది కాదు, నిద్ర పట్టేది కాదు. ఆ సమయంలో నేను పడిన బాధ అంతా ఇంతాకాదు. అలాంటి పరిస్థితుల్లో 'గడప గడపకు' కార్యక్రమంలో భాగంగా ఒకరోజు మా ఇంటికి ఎంపీడీవో, ఎంఆర్వో లతో పాటు పోలీసు సబ్ ఇన్ స్పెక్టర్ మేడం వాళ్లు వచ్చారు. "నాకు చదువుకోవాలనుంది. ప్లీజ్ మేడం! నన్ను ఇంటర్‌లో చేర్పించమని మీరైనా మా అమ్మానాన్నకు చెప్పండి" అని అధికారులను బతిమాలాను. వారంతా మా అమ్మకు నచ్చచెప్పాలని చూశారు. కానీ "నా కూతురిని కాలేజీలో చేర్పించాలంటే టౌన్‌కు పంపాలి. అక్కడ అమ్మాయికి జరగరానిదేమైనా జరిగితే ఎవరు పూచీ. అయినా కూలీనాలీచేసుకొని బతికేవాళ్లం. వేలకువేలు ఫీజు కట్టాలంటే కూడా మాతో అయ్యేపని కాదు" అని మా అమ్మ తెగేసి చెప్పింది. దాంతో వాళ్లు ఏమీ చేయలేకపోయారు. తర్వాత రోజు ఆంధ్రజ్యోతిలో 'ప్లీజ్.! మా అమ్మకు మీరైనా చెప్పండి' శీర్షికతో అదంతా వార్తగా వచ్చింది. ఆంధ్రజ్యోతిలో వార్త చదివిన కలెక్టరు సృజనా మేడం నన్ను మా అమ్మానాన్నను కలెక్టరు కార్యాలయానికి పిలిపించారు. మా వాళ్లకు నచ్చచెప్పి, నన్ను ఆస్పరిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో(కేజీబీవీ) ఇంటర్‌లో చేర్పించారు. అలా ఆగిందనుకొన్న నా చదువు ఆంధ్రజ్యోతిలో వార్తగా రావడం వల్ల తిరిగి కొనసాగిస్తున్నాను. అప్పుడు నా ఆనందానికి అంతులేదు. ఐపీఎస్ సాధిస్తానన్న నమ్మకం నాలో పెరిగింది.

అధ్యాపకుల ప్రోత్సాహం

నాకు మొదటి నుంచి సైన్స్ అంటే ఇష్టం. కనుక బైపీసీ తీసుకొన్నాను. నా చదువుకు ఒక ఏడాది బ్రేక్ పడినా అంతవరకు చదివినదేదీ మర్చిపోలేదు. కలెక్టరు సృజనా మేడం నన్ను కేజీబీవీలో చేర్పించిన తర్వాత కూడా నా పర్యవేక్షణ బాధ్యతను సర్వశిక్షా అభియాన్ అధికారి వేణుగోపాల్ సార్‌కు అప్పగించారు. చదువు అంటే నాకు చాలా ఇష్టం కనుక మా అధ్యాపకులు, వార్డెన్ లు కూడా నన్ను బాగా ప్రోత్సహించారు. రోజూ వేకువజామున, సాయంత్రం మమ్మల్ని దగ్గరుండి చదివిస్తారు. కనుక మా విజయం వెనుక వారి శ్రమ ఎంతో ఉంది. వారందరి ప్రోద్బలం వల్లే ఇంటర్ మొదటి సంవత్సరంలో నాకు 440కుగాను 421 మార్కులు వచ్చాయి. కర్నూలు జిల్లా కేజీబీవీల్లో టాపర్ని కూడా. ఇప్పుడు కూడా సృజన మేడం కలెక్టరు కార్యాలయానికి ప్రత్యేకంగా పిలిపించి మరీ నన్ను సన్మానించారు. తాను మరొక చోటుకు బదిలీ అయినా, నా చదువుకు ఆటంకం రాకూడదని నాపేరుతో బ్యాంకులో కొంత డబ్బు డిపాజిట్ చేస్తున్నట్టు చెప్పారు. అదిపూర్తిగా నా చదువుకు వినియోగించేలా ఏర్పాటు చేస్తున్నారు. నాలాంటి నిరుపేద అమ్మాయిలను ఆదుకొనే సృజనా మేడం లాంటి కలెక్టర్లు ఎంతమంది ఉంటారు. మా కలెక్టర్ మేడంను చూసిన తర్వాత సివిల్స్ సర్వీసుమీద అభిమానం మరింత పెరిగింది. నాకు మంచిమార్కులు రావడంతో మా అమ్మానాన్న కూడా సంతోషిస్తున్నారు.

● గోరంట్ల కొండప్ప, కర్నూలు

నా బిడ్డను చూసి గర్వపడుతున్నా

- హనుమంతమ్మ, విద్యార్థిని తల్లి



మేము పేదోళ్లం. మాబోటోళ్లకు చదువెందుకని పొలం పనులకు పొమ్మని చెప్పినాను. కలెక్టరమ్మ వల్లే నా కూతురు నిర్మల కాలేజీలో చేరింది. మంచి మార్కులు తెచ్చుకుందని గొప్పగొప్పోళ్లంతా అంటుంటే ఆనందంగా ఉంది. అమ్మాయికి పోలీసు అవ్వాలి అని మొదటి నుంచి కోరిక. ఏపూటకు ఆపూట తిండికి వెతుక్కొనే మనలాంటోళ్లకు అలాంటి పెద్ద ఆశలుండద్దు అని మేము అమ్మాయిని నిరుత్సాహపరిచాం. అమ్మాయి అనుకున్నది సాధిస్తుందని మాకు ఇప్పుడు నమ్మకం వచ్చింది. నా బిడ్డను చూసి గర్వపడుతున్నా. అమ్మాయి ఎంతచదువుకొంటే అంతవరకు చదువుకొమ్మని చెప్పాం.



బాలలకు రక్షణ కవచం

చైల్డ్ ట్రాఫికింగ్‌ను అరికట్టాలి... పల్లవి ఘోష్ చిన్ననాటి ఆశయం ఇది. దాని కోసం 75 వేల మందితో ఒక సైన్యాన్ని సృష్టించారు. పది వేలమందికి పైగా పిల్లలను కాపాడారు. వారి ఉపాధి కల్పనకు దోహదం చేస్తున్నారు. పొరుగు దేశాల్లోనూ సేవలందిస్తున్న ముప్పై మూడేళ్ళ పల్లవి ఘోష్ ప్రయాణం ఇది...

"నేను పుట్టింది, పెరిగింది అసోంలోని లుమ్డింగ్ పట్టణంలో. ఎప్పుడు సెలవులు వచ్చినా కోల్‌కతాలోని మా మామయ్య ఇంటికి వెళ్ళేదాన్ని. ఏడో తరగతి పరీక్షలు రాసిన తరువాత... వేసవి సెలవుల్లో మళ్ళీ కోల్‌కతా వెళ్ళాను. ఒక రోజు మార్కెట్లో ఒక వ్యక్తి అరుస్తూ పరుగులు పెట్టడం కనిపించింది. ఆయన కుమార్తె మాయమైందనీ, ఆమెను వెతుక్కుంటూ ఆయన పిచ్చివాడై తిరుగుతున్నాడనీ తెలిసింది. అప్పుడు నా వయసు పన్నెండేళ్ళు. ఆ అమ్మాయిదీ అదే వయసు. నా ఈడు అమ్మాయి హఠాత్తుగా ఎలా అదృశ్యమైంది? ఆమెను ఎవరు ఎత్తుకుపోయారు? ఏం చేస్తారు?... నాలో కొన్నాళ్ళపాటు ఇవే ఆలోచనలు. ఆ సంఘటన నా జీవితాన్ని పెద్ద మలుపు తిప్పింది" అని గుర్తు చేసుకున్నారు పల్లవి ఘోష్. తనకు ఎదురైన సంఘటనల్లాంటివి అరుదేమీ కాదనీ, దేశవ్యాప్తంగా కొన్ని వేలమంది పిల్లలు ట్రాఫికింగ్‌కు గురవుతున్నారనీ, వారి అదృశ్యం ఎన్నో కుటుంబాలకు శాశ్వతమైన వేదనను మిగులుస్తోందనీ ఆమె తెలుసుకున్నారు. చైల్డ్ ట్రాఫికింగ్‌ను నిరోధించడానికి అంకితం కావాలనే ఆశయం ఆమెలో నానాటికీ బలపడింది. "నేను ఇంటర్ చదువుతున్నప్పుడు రైల్వే స్టేషన్‌లో చాలామంది పిల్లలను గమనించాను. స్థానికంగా మేము మాట్లాడుకొనే భాష బెంగాలీ. కానీ ఆ పిల్లలు హిందీ బాగా మాట్లాడుతున్నారు. వాళ్ళు రాజస్థాన్‌కు చెందినవారని తెలిసింది. ఎక్కడినుంచో వాళ్ళను కొన్ని ముఠాలు తీసుకొస్తున్నాయి. "మాకు మంచి జీవితాన్ని ఆశ చూపిస్తున్నారు. భాష తెలియని చోట చాకిరీ చేయిస్తున్నారు. తిండి, వసతి కల్పిస్తారు. మేం సంపాదించినదంతా తీసుకుంటారు. ఎత్తుకొచ్చిన వారిలో ఆడపిల్లలను వేశ్యాగృహాలకు అమ్మేస్తుంటారు" అని ఆ పిల్లలు చెప్పారు. ఇది నేను ఊహించిన దానికన్నా పెద్ద సమస్య అని అర్థమయింది" అని అంటారు పల్లవి.

> "ఆ 75 వేల మందీ నా సైన్యం. మేము ఇప్పటివరకూ పదివేలమందికి పైగా పిల్లలను రక్షించగలిగాం. అంతేకాదు... పలుచోట్ల బాల్య వివాహాలను కూడా ఆపగలిగాం.



విదేశాల్లో సైతం...

ఇంగ్లీష్ లిటరేచర్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తరువాత... ఇటువంటి కేసులపై శోధించే ఢిల్లీకి చెందిన ఒక సంస్థలో రీసెర్చ్ ఆఫీసర్‌గా ఆమె చేరారు. చైల్డ్ ట్రాఫికింగ్ మూల కారణాలను మరింత స్పష్టంగా అర్థం చేసుకున్నారు. అనేక చైల్డ్ రెస్క్యూ మిషన్లలో స్వయంగా పాల్గొన్నారు. "పిల్లలను కాపాడి... వారి సొంతవారికి అప్పగించినప్పుడు... వారిలో కలిగే సంతోషాన్ని చూస్తే ఎంతో తృప్తి కలిగేది. ఆరేళ్ళపాటు ఆ సంస్థలో పని చేశాను. వేలమందిని కాపాడి, వారికి కొత్త జీవితం దొరికేలా చేశాను" అని చెప్పారు పల్లవి. తమ ప్రాంతంలో కార్యకలాపాలను విస్తరించడానికి 'ఇంపాక్ట్ అండ్ డైలాగ్ ఫౌండేషన్' అనే సంస్థను 2020 డిసెంబర్‌లో ఆమె ఏర్పాటు చేశారు. "ఒక సంస్థలో భాగంగా పని చేయడం వేరు. అన్నీ నేనై ఒక సంస్థను నడిపించడం వేరు. ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. అయిదుసార్లు కొవిడ్ ఇన్ఫెక్షన్‌కు గురయ్యాను. అయినా ఆత్మస్థైర్యం కోల్పోలేదు. అసోం, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలతో పాటు భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్ తదితర దేశాల్లో కూడా చైల్డ్ ట్రాఫికింగ్ నిరోధానికి మా సంస్థ కృషి చేస్తోంది. ఆ ప్రాంతాలకు వెళ్ళి... పిల్లల అదృశ్యం గురించి స్థానికులను ప్రశ్నించినప్పుడు... మొదట్లో వాళ్ళు సహకరించలేదు. ఆ తరువాత వాళ్ళ ధోరణిలో మార్పు వచ్చింది" అని ఆమె వివరించారు.

వాళ్ళందరూ నా సైన్యం...

కేవలం ఏడాదిన్నర కాలంలో... ఈశాన్య రాష్ట్రాల్లో 75 వేలమందికి పైగా మహిళలను ఆమె కలిశారు. వర్క్ షాప్‌లు, సదస్సులు నిర్వహించి... చైల్డ్ ట్రాఫికింగ్‌కు కారణమవుతున్న కుటుంబ, సామాజిక కారణాలపై అవగాహన కల్పించారు. వారి సహకారంతో చైల్డ్ ట్రాఫికింగ్ నిరోధానికి చర్యలు చేపట్టారు. పిల్లల అక్రమ రవాణాకు పాల్పడుతున్న కొన్ని వందల మందిని చట్టానికి పట్టించారు. చైల్డ్ ట్రాఫికింగ్ మాఫియా నుంచి బెదిరింపులు వచ్చినా, తనపై దాడులకు ప్రయత్నాలు జరిగినా భయపడలేదు. "ఆ 75 వేల మందీ నా సైన్యం. మేము ఇప్పటివరకూ పదివేల మందికి పైగా పిల్లలను రక్షించగలిగాం. అంతేకాదు... పలుచోట్ల బాల్య వివాహాలను కూడా ఆపగలిగాం. అసోంలో దాదాపు ప్రతి గ్రామంలోనూ మా సభ్యుల నిఘా ఉంటుంది. అయితే పిల్లలను కాపాడినంతమాత్రాన సరిపోదు. వారి పునరావాసానికి, ఉపాధికి సాయపడడం కూడా కీలకం. లేదంటే మళ్ళీ ప్రలోభాలకు గురై, ట్రాఫికింగ్ బారిన పడే ప్రమాదం ఉంది. మేము రక్షించిన బాలికల్లో పలువురు కుట్టుపని నేర్చుకొని.. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించారు. 2019లో నేను కాపాడిన ఒక అమ్మాయి... ఇప్పుడు ఎంబీబీఎస్ చదువుతోంది. పలువురు బాలలకు కౌన్సెలింగ్, వివిధ వృత్తుల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం. ఇంట్లోని ఆర్థిక పరిస్థితుల వల్లో, ఇతర కారణాలవల్లో పారిపోయే పిల్లలు కొందరైతే... స్వార్థపరుల ప్రలోభాలకు లేదా అపహరణలకు బలై... అక్రమ రవాణా అవుతున్నవారు మరికొందరు. పిల్లలు మన దేశ భవిష్యత్తు. వారందరికీ సమాన అవకాశాలు అందాలి. ఎదిగే వయసులో వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. సమాజంలో మార్పు, చైతన్యం ద్వారానే ఇది సాధ్యమవుతుంది" అంటారు పల్లవి.

నవ్య | చిత్రజ్యోతి



'రోమా, గ్రావిటీ' వంటి విభిన్న తరహా చిత్రాలను తెరకెక్కించిన మెక్సికన్ ఫిల్మ్ మేకర్ అల్ఫాన్సో కోరన్ ఇండియా పర్యటనకు వచ్చారు. ఆదివారం ఆయన చెన్నైకు వెళ్లగా ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఈ దర్శకుడికి అతిథ్యం ఇచ్చి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. మణిరత్నం, ఏ ఆర్ రెహమాన్, సిద్ధార్థ్, అదితిరావు హైదరీ పాల్గొన్నారు.

2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా

హీరో విశాల్




తమిళనాట 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని హీరో విశాల్ ప్రకటించారు. ఆ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తానని, పొత్తు పెట్టుకోనని ఆయన స్పష్టం చేశారు. చెన్నైలో ఆదివారం తమిళ్ ఫిల్మ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీఎంజేఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన తమిళ ఉగాది వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు విశాల్ సమాధానమిస్తూ, 2026 ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తానని చెప్పారు. ఒంటరిగానే బరిలోకి దిగుతానని తెలిపారు. ప్రజల్లో తానేంటో నిరూపించుకోకుండా పొత్తు ఎలా పెట్టుకుంటానని ప్రశ్నించారు. ఆ ఎన్నికల్లో తాను మాత్రమే కాకుండా, చెన్నై లయోలా కాలేజీలో తనతో పాటు చదువుకుని సినీ స్టార్స్‌గా ఉన్న మరికొంతమంది కూడా ఎన్నికల బరిలోకి దిగుతారన్నారు. అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరుగుతాయా? ముందుగానే జరుగుతాయా? అన్నది తనకు తెలియదన్నారు. కానీ, ఎన్నికల్లో పోటీ చేయడం తథ్యమన్నారు. తన అభిమాన నటుడు విజయ్ అని, ఆయన్ను డైరెక్ట్ చేయాలని ఉందన్నారు. - ఆంధ్రజ్యోతి, చెన్నై

గతం వర్తమానం ఢీకొంటే...



తమిళ నటుడు సూర్య నటిస్తున్న చిత్రం 'కంగువ'. శివ దర్శకుడు. దిశాపటానీ, బాబీడియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఆదివారం సూర్య ఈ చిత్రం నూతన పోస్టర్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో విడుదల చేశారు. కంగువ పాత్రలోని సూర్య, మోడరన్ పాత్రలోని సూర్య ఇందులో ముఖాముఖి తలపడనున్నట్లు ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచింది.

సల్మాన్ ఖాన్ ఇంటి బయట కాల్పులు



బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి బయట ఆదివారం ఉదయం కొందరు దుండగులు తుపాకీతో కాల్పులు జరిపారు. ఆరు రౌండ్ల కాల్పులకు పాల్పడగా అందులో ఓ బుల్లెట్ మొదటి అంతస్తులోకి దూసుకువచ్చింది. ఈ దాడి జరిగిన సమయంలో సల్మాన్ ఇంట్లోనే ఉన్నారు. ఈ సంఘటనపై ముంబై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ కాల్పులు తామే చేశామని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ ఫేస్‌బుక్‌లో ప్రకటించారు. "సల్మాన్... ఇప్పుడు మేం చేసిన పని జస్ట్ ట్రైలర్. మేం ఎంతకు తెగిస్తామో నీకు అర్థమై ఉంటుంది. మా సహనాన్ని పరీక్షించొద్దు. ఈ సారి తుపాకీ పేలుడు ఇంటి బయట దాడితోనే ఆగిపోదు" అని హెచ్చరించారు.

బరిలో దిగాడు గెలిచే కుర్రాడు

రాకేశ్ వర్రె టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'జితేందర్‌రెడ్డి'. 1980ల్లో జరిగిన సంఘటన ఆధారంగా దర్శకుడు విరించి వర్మ తెరకెక్కిస్తున్నారు. ముదుగంటి రవీందర్‌రెడ్డి నిర్మాత. చిత్రబృందం ఈ



సినిమా నుంచి 'బరిలో దిగాడు గెలిచే కుర్రాడు' అంటూ సాగే యూత్‌ఫుల్ లిరికల్ సాంగ్‌ను విడుదల చేసింది. 'కాలేజ్ స్టూడెంట్ లీడర్ జితేందర్ రెడ్డి కథ ఇది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఆయన ఎదుర్కొన్న తీరును ఇందులో ఆవిష్కరిస్తున్నాం' అని యూనిట్ తెలిపింది.

భయపెట్టే భామలు



హారర్ కామెడీ సిరీస్‌లో వస్తున్న తమిళ చిత్రం 'అరణ్మణై 4'. తమన్నా, రాశీఖన్నా, ప్రధాన పాత్రలు పోషించారు. సుందర్ సీ దర్శకత్వం వహించడంతో పాటు లీడ్‌రోల్‌లో నటించారు. తెలుగులో 'బాక్' పేరుతో ఈ నెల 26న విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. ఆదివారం 'అయ్యో అయ్యో అయ్యయ్యో... భయమవుతోంది అయ్యయ్యో...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. తమన్నా, రాశీఖన్నా గ్లామర్‌తో పాటు తమదైన స్టెప్పులతో అలరించారు. ఖుష్బూ సుందర్, ఏసీఎస్ అరుణ్‌కుమార్ నిర్మిస్తున్నారు.

సోలోగా అలరించేందుకు సిద్ధం



వినూత్న ప్రేమకథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'సోలో బాయ్'. గౌతమ్ కృష్ణ హీరోగా పి. నవీన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సెవెన్‌హిల్స్ సతీశ్‌కుమార్ నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గౌతమ్ కృష్ణ మీడియాతో మాట్లాడుతూ 'మా నిర్మాత సింగిల్ సిట్టింగ్‌లో కథను ఓకే చేశారు. త్వరలో ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ "సోలో బాయ్' చిన్న సినిమాయే అయినా, మంచి కథతో తెరకెక్కించాం. ప్రేక్షకులను మెప్పించేలా దర్శకుడు సినిమాను తీర్చిదిద్దాడు' అని అన్నారు. పాటలు, ఫైట్స్ మా సినిమాకు ప్రత్యేకాకర్షణ అని దర్శకుడు తెలిపారు.

కమర్షియల్ హంగులతో కాప్



రవిశంకర్ ప్రధాన పాత్రధారిగా రూపొందిన కమర్షియల్ ఎంటర్టైనర్ 'కాప్'. నిఖిల్, రాజశేఖర్, తేజ హీరోలుగా నటిస్తున్నారు. బి. సోమసుందరం దర్శకత్వంలో మాధవన్ సురేశ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే తిరుపతిలో చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'పొలిటికల్ సెటైర్‌తో పాటు కమర్షియల్ హంగులు ఉన్న చిత్రమిది. మంచి సందేశంతో ప్రజల్ని ఆలోచింపజేసే విధంగా తెరకెక్కించాం' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'వేసవిలో 'కాప్'ను విడుదల చేస్తాం. అందరికీ నచ్చుతుంది' అన్నారు.

కోల్‌కతా అలవోకగా..

8 వికెట్లతో లఖ్‌నవూపై గెలుపు
మెరిసిన సాల్ట్, స్టార్క్
పూరన్ పోరాటం వృథా


ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 89 నాటౌట్)

కోల్‌కతా: ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 89 నాటౌట్) దూకుడైన అర్ధ శతకంతోపాటు పేసర్ స్టార్క్ (3/28) చెలరేగడంతో.. కోల్‌కతా నైట్‌రైడర్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. ఆదివారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 8 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)పై అలవోక విజయం సాధించింది. తొలుత లఖ్‌నవూ 20 ఓవర్లలో 161/7 స్కోరు చేసింది. పూరన్ (45), రాహుల్ (39), ఆయుష్ బదోని (29) ఫర్వాలేదనిపించారు. నరైన్ (1/17) ఒక్క బౌండ్రీ కూడా ఇవ్వకుండా పొదుపుగా బౌలింగ్ చేశాడు. అనంతరం కోల్‌కతా 15.4 ఓవర్లలో 162/2 స్కోరు చేసి నెగ్గింది. లక్ష్య ఛేదనలో ఓపెనర్ నరైన్ (6), రఘువంశీ (7)లను మొహిసిన్ అవుట్ చేసి కోల్‌కతాకు షాకిచ్చాడు. కానీ, మరో ఓపెనర్ సాల్ట్, శ్రేయాస్ అయ్యర్ (38 నాటౌట్) మూడో వికెట్‌కు 76 బంతుల్లో 120 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో కోల్‌కతా 26 బంతులు మిగిలుండగానే గెలిచింది. లఖ్‌నవూ తరఫున అరంగేట్రం చేసిన జోసెఫ్ తొలి ఓవర్ బౌల్ చేసి రెండు వైడ్లు, రెండు నోబాల్స్‌తో ఏకంగా 22 పరుగులిచ్చాడు. కాగా, ఐపీఎల్‌లో లఖ్‌నవూపై కోల్‌కతాకు ఇదే మొదటి విజయం. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా సాల్ట్ నిలిచాడు.

పూరన్ ఒక్కడే..: మిస్టరీ స్పిన్నర్ నరైన్, వరుణ్ పరుగులను కట్టడి చేయగా.. ఆఖరి ఓవర్‌లో స్టార్క్ రెండు వికెట్లతో సత్తా చాటడంతో లఖ్‌నవూ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. ఒక దశలో ఎల్ఎస్‌జీ 111/5తో పీకల్లోతు కష్టాల్లో పడిన సమయంలో పూరన్ ఎదురుదాడితో టీమ్ స్కోరు 160 పరుగుల మార్క్‌ను దాటింది. క్రునాల్ (7 నాటౌట్)తో కలసి ఆరో వికెట్‌కు 44 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన పూరన్‌ను ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో స్టార్క్ పెవిలియన్ చేర్చాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఓపెనర్ డికాక్ (10), హుడా (8)లను స్వల్ప స్కోర్లకే కోల్పోయింది. దీంతో పవర్‌ప్లే ముగిసే సమయానికి సూపర్ జెయింట్స్ 49/2తో నిలిచింది. ఈ దశలో రాహుల్, బదోని ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసినా.. నరైన్, రాణా భారీ షాట్లు ఆడకుండా అడ్డుకొన్నారు. రాహుల్‌ను రస్సెల్ పెవిలియన్ చేర్చగా.. స్టొయినిస్ (10)ను వరుణ్ బోల్తా కొట్టించాడు. బదోనిని 15వ ఓవర్‌లో నరైన్ క్యాచవుట్ చేశాడు. అయితే, డెత్ ఓవర్లలో పూరన్ దూకుడైన ఆటతో లఖ్‌నవూ 48 పరుగులు రాబట్టగలిగింది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: డికాక్ (సి) నరైన్ (బి) వైభవ్ 10, రాహుల్ (సి) రమణ్‌దీప్ (బి) రస్సెల్ 39, దీపక్ హుడా (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 8, బదోని (సి) రఘువంశీ (బి) నరైన్ 29, స్టొయినిస్ (సి) సాల్ట్ (బి) వరుణ్ 10, పూరన్ (సి) సాల్ట్ (బి) స్టార్క్ 45, క్రునాల్ (నాటౌట్) 7, అర్షద్ (బి) స్టార్క్ 5; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 161/7; వికెట్ల పతనం:** 1-19, 2-39, 3-78, 4-95, 5-111, 6-155, 7-161; **బౌలింగ్:** స్టార్క్ 4-0-28-3, వైభవ్ 3-0-34-1, హర్షిత్ రాణా 4-0-35-0, నరైన్ 4-0-17-1, వరుణ్ చక్రవర్తి 4-0-30-1, రస్సెల్ 1-0-16-1.

కోల్‌కతా: సాల్ట్ (నాటౌట్) 89, నరైన్ (సి) స్టొయినిస్ (బి) మొహిసిన్ 6, రఘువంశీ (సి) రాహుల్ (బి) మొహిసిన్ 7, శ్రేయాస్ (నాటౌట్) 38; **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 15.4 ఓవర్లలో 162/2; వికెట్ల పతనం:** 1-22, 2-42; **బౌలింగ్:** జోసెఫ్ 4-0-47-0, మొహిసిన్ 4-0-29-2, క్రునాల్ 1-0-14-0, యశ్ ఠాకూర్ 2-0-25-0, అర్షద్ 2-0-24-0, బిష్ణోయ్ 2.4-0-17-0.

ధవన్ రెండు మ్యాచ్‌లకు దూరం



న్యూఢిల్లీ: పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శిఖర్ ధవన్ దాదాపు పది రోజుల పాటు ఐపీఎల్‌కు దూరం కానున్నాడు. భుజం నొప్పి కారణంగా శనివారం రాజస్థాన్‌తో మ్యాచ్‌లోనూ అతడు ఆడలేదు. ముంబై, గుజరాత్ జట్లతో జరిగే మ్యాచ్‌లకు అతను అందుబాటులో ఉండడు. దీంతో సామ్ కర్రాన్ సారథ్యం వహించనున్నాడు.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం.
బెంగళూరు x హైదరాబాద్

రోహిత్ వందేసినా చెన్నై చిందేసింది!

● ముంబైపై ఘనవిజయం ● రుతురాజ్, దూబే అర్ధసెంచరీలు
● మహీ మెరుపులు ● పతిరనకు నాలుగు వికెట్లు


రోహిత్ (63 బంతుల్లో 105 నాటౌట్)

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (సి) హార్దిక్ (బి) కొట్జీ 5, రచిన్ (సి) ఇషాన్ (బి) గోపాల్ 21, రుతురాజ్ (సి) నబీ (బి) హార్దిక్ 69, దూబే (నాటౌట్) 66, మిచెల్ (సి) నబీ (బి) హార్దిక్ 17, ధోనీ (నాటౌట్) 20, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 206/4; వికెట్ల పతనం:** 1-8, 2-60, 3-150, 4-186; **బౌలింగ్:** నబీ 3-0-19-0, కొట్జీ 4-0-35-1, బుమ్రా 4-0-27-0, ఆకాశ్ 3-0-37-0, శ్రేయాస్ గోపాల్ 1-0-9-1, హార్దిక్ 3-0-43-2, షెపర్డ్ 2-0-33-0.

ముంబై: రోహిత్ (నాటౌట్) 105, ఇషాన్ (సి) శార్దూల్ (బి) పతిరన 23, సూర్యకుమార్ (సి) ముస్తాఫిజుర్ (బి) పతిరన 0, తిలక్ (సి) శార్దూల్ (బి) పతిరన 31, హార్దిక్ (సి) జడేజా (బి) తుషార్ 2, టిమ్ డేవిడ్ (సి) రవీంద్ర (బి) ముస్తాఫిజుర్ 13, షెపర్డ్ (బి) పతిరన 1, నబీ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 186/6; వికెట్ల పతనం:** 1-17, 2-70, 3-130, 4-134, 5-148, 6-157; **బౌలింగ్:** తుషార్ దేశ్‌పాండే 4-0-29-1, ముస్తాఫిజుర్ 4-0-55-1, శార్దూల్ 4-0-35-0, జడేజా 4-0-37-0, పతిరన 4-0-28-4.

1 టీ20ల్లో 500+ సిక్సర్లు బాదిన తొలి భారత క్రికెటర్‌గా రోహిత్. ఓవరాల్‌గా ఐదో బ్యాటర్.

ముంబై: 'ఐపీఎల్ ఎల్‌క్లాసికో'గా పేరు తెచ్చుకున్న చెన్నై సూపర్ కింగ్స్-ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. చివరికి ఆల్‌రౌండ్‌షో చూపిన సీఎస్‌కేదే పైచేయి అయ్యింది. బ్యాటింగ్‌లో రుతురాజ్ (40 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 69), శివమ్ దూబే (38 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 66 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌కు తోడు.. ఆఖరి ఓవర్‌లో 42 ఏళ్ల ధోనీ (4 బంతుల్లో 3 సిక్సర్లతో 20 నాటౌట్) ఫినిషింగ్ జట్టు విజయంలో అత్యంత కీలకంగా నిలిచింది. ఇక వాంఖడేలో జోరు మీదున్న ముంబై బ్యాటర్లను 21 ఏళ్ల యువ పేసర్ పతిరన (4/28) అద్భుతంగా అడ్డుకున్నాడు. రోహిత్ శర్మ (63 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 105 నాటౌట్) అజేయ శతకంతో తుదికంటా నిలిచినా ఫలితం లేకపోయింది. దీంతో 20 పరుగులతో చెన్నై నెగ్గింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా చెన్నై 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. హార్దిక్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 రన్స్ చేసి ఓడింది. తిలక్ (31), ఇషాన్ (23) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా పతిరన నిలిచాడు.

రోహిత్ పోరాడినా..: 207 పరుగుల ఛేదనలో ముంబై 7 ఓవర్లలోనే 70 పరుగులు సాధించింది. అయితే, మధ్య ఓవర్లలో సీఎస్‌కే బౌలర్లు ముంబైకి ముకుతాడు వేశారు. వరుస విరామాల్లో వికెట్లు తీసి ముంబైని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టారు. అటు రోహిత్ భారీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నా జట్టును గెలిపించలేకపోయాడు. అయితే ఆరంభంలో ఓవర్‌కు పది రన్‌రేట్‌తో స్కోరు బోర్డు పరిగెత్తింది. ముఖ్యంగా రోహిత్ హిట్టింగ్‌తో చెన్నై బౌలర్లను ఆడేసుకున్నాడు. ఓపెనర్ ఇషాన్‌తో కలిసి తొలి వికెట్‌కు 70 రన్స్ జోడించాడు. వీరి జోరుకు పవర్‌ప్లేలోనే 63 పరుగులు చేరాయి. కానీ ఎనిమిదో ఓవర్‌లో ఇషాన్‌తో పాటు సూర్యను పతిరన డకౌట్ చేశాడు. అటు 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన రోహిత్ ఎక్కడా తగ్గలేదు. 11వ ఓవర్‌లో రోహిత్ 4,6.. తిలక్ 4తో 18 రన్స్ సమకూరగా జట్టు స్కోరు కూడా వంద దాటింది. మూడో వికెట్‌కు 60 రన్స్ జత చేరాక తిలక్‌ను పతిరన అవుట్ చేశాడు. ఇక్కడి నుంచి జట్టు తడబడింది. మరోవైపు 15, 16 ఓవర్లలో కలిపి ఐదు పరుగులే రాగా, హార్దిక్ (2) వికెట్ కూడా కోల్పోవడంతో ముంబై ఒత్తిడిలో పడింది. దీనికి తోడు రెండు వరుస సిక్సర్లతో ధాటిని చూపిన టిమ్ డేవిడ్ (13)ను ముస్తాఫిజుర్ అవుట్ చేయడం కూడా దెబ్బతీసింది. ఆఖరి ఓవర్‌లో 34 రన్స్ అవసరం కాగా ముంబై ఓటమి ఖాయమైంది. రెండు వరుస ఫోర్లతో రోహిత్ సెంచరీ పూర్తి చేసినా ఫలితం లేకపోయింది.


పతిరన (4/28)
ధోనీ (4 బంతుల్లో 20 నాటౌట్)

రుతురాజ్, దూబే అర్ధసెంచరీలు: టాస్ కోల్పోయిన చెన్నై బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్‌గా రహానె (5) ప్రయోగం విఫలమైంది. కానీ మధ్య ఓవర్లలో రుతురాజ్-దూబే జోడీ చెలరేగింది. అలాగే ధోనీ ఫినిషింగ్ టచ్‌తో స్కోరు 200 దాటగలిగింది. రహానెను రెండో ఓవర్‌లోనే కొట్జీ అవుట్ చేశాడు. ఇక వన్‌డౌన్‌లో వచ్చిన రుతురాజ్ వేగాన్ని చూపుతూ, మూడో ఓవర్‌లో సిక్సర్‌తోపాటు ఐదో ఓవర్‌లో 4,6,4తో 14 రన్స్ అందించాడు. అలాగే ఆరో ఓవర్‌లో రచిన్ (21), రుతురాజ్ చెరో ఫోర్‌తో పవర్‌ప్లేలో సీఎస్‌కే 48 పరుగులు చేయగలిగింది. కానీ, స్పిన్నర్ శ్రేయాస్ గోపాల్ ఓవర్‌లో సిక్సర్ బాదిన వెంటనే ఓ గూగ్లీకి రచిన్ క్యాచవుటయ్యాడు. కీపర్ ఇషాన్ ఒత్తిడి మేరకు రివ్యూకు వెళ్లిన ముంబై ఈ వికెట్ సాధించింది. దీంతో రెండో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో రుతురాజ్‌కు దూబే కలవడంతో చెన్నై స్కోరు దూసుకెళ్లింది. పదో ఓవర్‌లో దూబే మూడు ఫోర్లు బాదగా, అటు రుతురాజ్ ఓ భారీ సిక్సర్‌తో 33 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఇక 14వ ఓవర్‌లో దూబే 6,6,4,4తో శివాలెత్తి 22 పరుగులు రాబట్టాడు. ఈ దూకుడుకు 28 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ పూర్తయ్యింది. ఇక మధ్వల్ ఓవర్‌లో 6,4 సాధించిన రుతురాజ్‌ను హార్దిక్ పాండ్యా దెబ్బతీశాడు. దీంతో వికెట్ కోసం ఎదురుచూస్తున్న ముంబైకి రిలీఫ్ దక్కింది. అప్పటికే మూడో వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. అయితే డారిల్ మిచెల్ (17) నిదానంగా ఆడడం చెన్నై భారీ స్కోరుపై ప్రభావం పడింది. 19వ ఓవర్‌లో బుమ్రా యార్కర్లకు 7 పరుగులే రాగా.. ఆఖరి ఓవర్ రెండో బంతికి మిచెల్ అవుటయ్యాడు. అటు వాంఖడేలో ఫ్యాన్స్ చప్పట్ల మధ్య బరిలోకి దిగిన ధోనీ తానెదుర్కొన్న 4 బంతుల్లో వరుసగా 6,6,6,2తో హోరెత్తించాడు. దీంతో 26 పరుగులు రాబట్టిన సీఎస్‌కే సవాల్ విసిరే స్కోరును సాధించగలిగింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	6	5	1	0	10	0.767
కోల్‌కతా	5	4	1	0	8	1.688
చెన్నై	6	4	2	0	8	0.726
హైదరాబాద్	5	3	2	0	6	0.344
లఖ్‌నవూ	6	3	3	0	6	0.038
గుజరాత్	6	3	3	0	6	-0.637
పంజాబ్	6	2	4	0	4	-0.218
ముంబై	6	2	4	0	4	-0.234
ఢిల్లీ	6	2	4	0	4	-0.975
బెంగళూరు	6	1	5	0	2	-1.124

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

షూటర్ పాలక్‌కు ఒలింపిక్ బెర్త్



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల విజేత పాలక్ గులియా షూటింగ్‌లో భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ అందించింది. బ్రెజిల్‌లోని రియో డి జెనీరోలో ఆదివారం జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫికేషన్ (రైఫిల్, పిస్టల్) షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 18 ఏళ్ల పాలక్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కాంస్యం సాధించింది. పారిస్ విశ్వక్రీడల్లో రైఫిల్, పిస్టల్ విభాగంలో భారత్‌కు ఇది 16వ బెర్త్ కావడం విశేషం.

అంజు, హర్షితకు రజతాలు

అంతిమ్, మనీషా కంచు మోత
ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్

బిష్‌కెక్ (కిర్గిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్‌ను భారత మహిళా రెజ్లర్లు కూడా స్వర్ణం లేకుండానే ముగించారు. ట్రయల్స్‌లో వినేష్ ఫొగట్‌కు ఝలక్ ఇచ్చిన అంజుతోపాటు హర్షిత రజతాలతో సరిపెట్టుకోగా.. అంతిమ్, మనీషా కాంస్య పతకాలు సాధించారు. ఆదివారం జరిగిన 53 కిలోల ఫైనల్లో అంజు 0-10తో జి హయంగ్ కిమ్ (కొరియా) చేతిలో పరాజయం పాలైంది. మొత్తంగా మహిళలు మూడు రజతాలు, మూడు కాంస్యాలు అందించారు. పురుషుల్లో ఉదిత్ (57 కి) రజతం సాధించగా.. అభిమన్యు (70 కి), విక్కీ (97 కి) కంచు పతకాలతో సరిపెట్టారు.

టాప్‌లో గుకేష్

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఎనిమిదో రౌండ్ ముగిసే సరికి గుకేష్ తిరిగి ఆధిక్యంలోకి వచ్చాడు. విదిత్ గుజరాతీతో జరిగిన ఈ రౌండ్‌లో గుకేష్ నెగ్గాడు. ప్రజ్ఞానంద ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజాతో గేమ్‌ను డ్రా చేశాడు. ఈ రౌండ్ ఆఖరికి నెపోమ్నియాచితో కలిసి 5 పాయింట్లతో గుకేష్ టాప్‌లో నిలిచాడు. ప్రజ్ఞానంద (4.5) రెండు, విదిత్ (3.5) నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. మహిళల్లో వైశాలిపై గెలుపొందిన హంపి (3.5పాయింట్లు)సంయుక్తంగా ఐదో స్థానంలో ఉంది.

బిజినెస్

21,320 దిగువన బేరిష్
(ఏప్రిల్ 15-19 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,776-21,504 పాయింట్ల మధ్యన కదలాడి అంతకుముందు వారంతో పోల్చితే చెప్పుకోదగ్గ తేడా ఏమీ లేకుండా ఫ్లాట్‌గా 22,519 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 21,320 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,270, 22,142, 21,633, 20,574 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,820 బ్రేక్‌డౌన్ స్థాయి: 22,420
నిరోధ స్థాయిలు: 22,720, 22,820, 22,920 (22,620 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,420, 22,320, 22,220 (21,420 దిగువన బేరిష్)

అదానీ షేర్లతో ఎల్ఐసీకి జాక్‌పాట్

ఏడాదిలో రూ.22,739 కోట్ల లాభం

న్యూఢిల్లీ: విమర్శలు ఎలా ఉన్నా, అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో పెట్టుబడులు భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ)కి జాక్‌పాట్‌గా మారాయి. 2023 మార్చి 31 నాటికి అదానీ గ్రూప్‌లోని ఏడు లిస్టెడ్ కంపెనీల షేర్లలో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ రూ.38,471 కోట్లుగా ఉంటే ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.22,739 కోట్ల (59 శాతం) లాభంతో రూ.61,210 కోట్లకు చేరింది. హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత కూడా అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో పెట్టుబడి పెట్టాలన్న ఎల్ఐసీ నిరయం గత ఏడాది తీవ్ర విమర్శలకు లోనైంది. మరోవైపు ఈ నివేదిక దెబ్బకు ఒక దశలో 15,000 కోట్ల డాలర్ల వరకు మార్కెట్ క్యాప్‌ను కోల్పోయిన అదానీ గ్రూప్ కంపెనీలు మళ్లీ అంతే వేగంగా మదుపరులకు లాభాలు పంచాయి. అయితే రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఎల్ఐసీ.. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లలో వ్యూహాత్మకంగా పెట్టుబడులు తగ్గించుకుంది. అయితే ఈ రెండు కంపెనీల షేర్ల ధరలు గత ఏడాది కాలంలో 68.4 శాతం, 83 శాతం పెరగటం గమనార్హం. అయినప్పటికీ గత ఏడాది కాలంలో అదానీ గ్రూప్‌లోని ఏడు లిస్టెడ్ కంపెనీల షేర్లలో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ 59 శాతం పెరగడం విశేషం.



విదేశీ మదుపరులదే హవా

హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత ఎల్ఐసీ తప్ప దేశీయ సంస్థాగత మదుపరులు గానీ, రిటైల్ మదుపరులు గానీ అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు అంటేనే భయపడ్డారు. ఈ షేర్లు కొంటే ఎక్కడ మునిగిపోతామోనని భయపడిపోయారు. అయితే అదే అదునుగా విదేశీ మదుపరులు అదానీ గ్రూప్ కంపెనీల షేర్లను భారీగా కొనుగోలు చేశారు. ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, అబుదాబీ కేంద్రంగా పని చేసే ఐహెచ్‌సీ, ఫ్రాన్స్‌కు చెందిన ఇంధన దిగ్గజం టోటల్ ఎనర్జీస్, అమెరికా కేంద్రంగా పని చేసే పీఈ సంస్థ జీక్యూజీ ఇన్వెస్ట్‌మెంట్ దాదాపు రూ.45,000 కోట్ల మొత్తాన్ని అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో మదుపు చేసి మంచి లాభాలు మూటగట్టుకున్నాయి.

ఇళ్ల అమ్మకాల్లో 41% వృద్ధి

- హైదరాబాద్‌లో 40% అప్
- లగ్జరీ ఫ్లాట్లకే యమ గిరాకీ
- ప్రాప్ టైగర్ వెల్లడి

న్యూఢిల్లీ: రియల్టీ మార్కెట్ జోరు కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 1,20,640 నివాస గృహాలు, ఫ్లాట్లు అమ్ముడుపోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 41 శాతం ఎక్కువ. ఇందులో 74 శాతం గృహాలు, ఫ్లాట్లు ముంబై, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం, పుణెల్లో అమ్ముడైనట్లు హౌసింగ్ బ్రోకరేజీ సంస్థ ప్రాప్‌టైగర్.కామ్ నివేదిక వెల్లడించింది.

రూ.1,10,880 కోట్ల టర్నోవర్: విలువపరంగా చూసినా ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో అమ్ముడైన ఇళ్లు, ఫ్లాట్ల విలువ రూ.66,155 కోట్ల నుంచి 68% పెరిగి రూ.1,10,880 కోట్లకు చేరింది. అన్నిటికంటే ప్రధాన అంశం ఈ ఏడాది జనవరి-మార్చిలో అమ్ముడైన ఇళ్లు, ఫ్లాట్లలో రూ.కోటి అంతకంటే ఖరీదైన ఇళ్లు, ఫ్లాట్ల వాటా 37 శాతంగా ఉంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11% ఎక్కువ. ఇదే సమయంలో రూ.25 లక్షల వరకు విలువ ఉండే ఇళ్ల అమ్మకాలు 15% నుంచి 5 శాతానికి, రూ.25-45 లక్షల మధ్య ఉండే ఇళ్ల అమ్మకాలు 23% నుంచి 17 శాతానికి పడిపోయాయని పేర్కొంది.



హైదరాబాద్ అదుర్స్

హైదరాబాద్‌లోనూ ఇళ్లు, ఫ్లాట్ల అమ్మకాలు 40 శాతం వృద్ధి రేటుతో 10,200 యూనిట్ల నుంచి 14,290 యూనిట్లకు చేరాయి. ఇక విలువపరంగా చూసినా హైదరాబాద్‌లో అమ్ముడైన ఇళ్లు, ఫ్లాట్ల విలువ 143 శాతం వృద్ధి రేటుతో రూ.9,711 కోట్ల నుంచి రూ.23,580 కోట్లకు చేరింది. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలో తప్ప ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో మరే నగరంలోనూ ఇళ్ల అమ్మకాలు ఇంత భారీ సాయిలో జరగలేదు. అమ్ముడైన ఇళ్ల విస్తీర్ణపరంగా చూస్తే మాత్రం 3.5 కోట్ల ఎస్ఎఫ్‌టీతో హైదరాబాద్ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126	గోదావరి	127
వరంగల్	126	విజయవాడ	127
కరీంనగర్	126	గుంటూరు	127
మహబూబ్‌నగర్	126	ఒంగోలు	127
కర్నూలు	126	చిత్తూరు	129
విశాఖపట్నం	114		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ

హైదరాబాద్	395	విజయవాడ	404
చిత్తూరు	468	విశాఖపట్నం	419
గోదావరి	404	వరంగల్	397

డజను గుడ్లు రూ.60

రెండేళ్లలో 250 స్టోర్లు
హియర్‌జాప్

హైదరాబాద్: హియరింగ్ కేర్ సొల్యూషన్స్ సంస్థ హియర్‌జాప్.. వచ్చే రెండేళ్లలో దేశవ్యాప్తంగా స్టోర్ల సంఖ్యను 250కి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆదివారం నాడిక్కడ జూబ్లీహిల్స్‌లో కంపెనీ 100వ ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించిన సందర్భంగా సంస్థ ఎండీ రాజా ఎస్ మాట్లాడుతూ.. కార్యకలాపాల విస్తరణలో భాగంగా 2026 నాటికి కొత్తగా 150 స్టోర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది నవంబరులో ప్రైవేట్ ఈక్విటీ సంస్థ 360 వన్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ నుంచి రూ.50 కోట్లు సమీకరించామని, వచ్చే రెండేళ్లలో కార్యకలాపాల విస్తరణ కోసం ఈ మొత్తాలను వెచ్చించనున్నట్లు రాజా తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మొత్తం 8 రాష్ట్రాల్లో 150 మంది ఆడియోలజిస్టులతో 100 స్టోర్లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అప్రమత్తంగా ఉండటం బెటర్..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. గరిష్ఠ స్థాయిల్లో నిరోధం ఎదురవటం, అంతర్జాతీయ పరిణామాలు ఇందుకు కారణాలుగా ఉండనున్నాయి. ఇజ్రాయెల్, ఇరాక్ మధ్య ప్రాక్సీవార్ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లో మాత్రమే పెట్టుబడులు పెట్టాలి. కొద్ది రోజులుగా రాణిస్తూ వస్తున్న బ్యాంకింగ్, మెటల్ రంగాల్లో స్వల్పకాల దిద్దుబాటు జరగొచ్చు. నిఫ్టీ ఫ్యూచర్స్ మద్దతు 22,600, నిరోధం 22,750 వద్ద ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

సీడీఎస్ఎల్: ఈ కౌంటర్ అప్‌ట్రెండ్‌కు సిద్ధంగా ఉంది. నవంబరు నుంచి అక్యుములేషన్ జరుగుతోంది. అప్పటి నుంచి సైడ్‌వేస్‌లో చలిస్తున్న షేరు ధర మరోసారి కీలక నిరోధ స్థాయికి చేరింది. నిఫ్టీతో పోల్చితే మెరుగైన ప్రదర్శన, డెలివరీ వాల్యూమ్ పెరగటం, అప్పర్ బొలింజర్ బ్యాండ్ బ్రేక్ చేయటం సానుకూల అంశాలు. గత శుక్రవారం ఈ షేరు 6.7 శాతం లాభంతో రూ.2,008 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,950 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.2,060/2,110 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,920 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గుజరాత్ ఫ్లోరోకెమికల్స్: కన్సాలిడేషన్ అనంతరం ఈ కౌంటర్‌లో మూమెంటమ్ పెరిగింది. రూ.3,150 స్థాయిల్లో మద్దతు లభించింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. చివరి రెండు సెషన్లలో మరుబోజు క్యాండిల్స్ ఏర్పడటం గమనార్హం. గత శుక్రవారం ఈ షేరు రూ.3,582 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.3,560 స్థాయిల్లో ప్రవేశించి రూ.3,700 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,520 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా పవర్: సుదీర్ఘకాలంగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. చివరి పది సెషన్లలో ఈ కౌంటర్ లాభాల్లోనే ముగుస్తూ వస్తుండటం విశేషం. వాల్యూమ్ తక్కువగా నమోదవుతుండటాన్ని బట్టి చూస్తే ఇన్వెస్టర్లు ఈ షేరును వదులుకోవటానికి ఇష్టపడటం లేదని తెలుస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.436 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.430/410 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.485/510 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.400 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


క్రాంప్టన్ గ్రీవ్స్: గత మూడేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తూ వస్తున్న ఈ షేరు టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి అక్యుములేషన్ జరుగుతోంది. ఈ ఏడాది మార్చి నుంచి డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ గణనీయంగా పెరుగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతుండటం, మరుబోజు క్యాండిల్ ఏర్పడటం బుల్లిష్‌నెస్‌కు సంకేతాలు. గత శుక్రవారం 2.94 శాతం లాభంతో రూ.298 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.290 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.325/355 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.270 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ: ఈ కౌంటర్‌లో కొంతకాలంగా బుల్లిష్‌నెస్ కనిపిస్తోంది. స్వల్ప దిద్దుబాటు తర్వాత కీలక నిరోధ స్థాయి రూ.290ని అధిగమించింది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా ట్రేడవ్వటం, వాల్యూమ్ భారీగా పెరుగుతుండటం సానుకూల అంశాలు. గత శుక్రవారం ఈ షేరు రూ.305.30 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.280 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.310/330 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.260 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

మార్కెట్ బలహీనం.. 22,500 కీలకం


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గానే ప్రారంభమై 22,775 వరకు వెళ్లినా నిలదొక్కుకోలేక అంతకుముందు వారంతో పోల్చితే ఫ్లాట్‌గా వారం కనిష్ఠ స్థాయికి చేరువలో అత్యంత కీలక స్థాయి 22,500 సమీపంలో క్లోజైంది. గరిష్ఠ స్థాయిల నుంచి 275 పాయింట్ల మేరకు ఇంట్రా వీక్ కరెక్షన్‌కు లోనవటం గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తతకు సంకేతం. గత నాలుగు వారాల్లో 1,000 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించిన అనంతరం కరెక్షన్ ధోరణిలో పడినట్టు కనిపిస్తోంది. కాగా గత వారంలో మిడ్‌క్యాప్ 100 సూచీ 44 పాయింట్లు, స్మాల్‌క్యాప్ సూచీ 140 పాయింట్లు లాభంలో ముగిశాయి. శుక్రవారం మార్కెట్ ముగిసిన అనంతరం టీసీఎస్ ఆర్థిక ఫలితాలు, ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడడంతో పాటు పశ్చిమాసియాలో తాజా ఉద్రిక్తతలు కూడా చెలరేగినందు వల్ల మార్కెట్ ఆ పరిణామాలకు తగ్గట్టుగా ప్రారంభం కావచ్చు. అలాగే గతంలో కీలక స్థాయి 22,500ని బ్రేక్ చేసినందు వల్ల గత వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడి, ఇప్పుడు ఈ 22,500 మద్దతు స్థాయిగా మారింది.

బుల్లిష్ స్థాయిలు: రియాక్షన్ అనంతరం రికవరీ బాట పట్టినట్టయితే ట్రెండ్‌లో సానుకూలత కోసం 22,500 వద్ద నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధం 22,700. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది. మరో నిరోధం 23,000.

బేరిష్ స్థాయిలు: 22,500 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. దిగువన మద్దతు స్థాయి 22,300. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మద్దతు స్థాయిలు 22,150, 21,950.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా ర్యాలీలో 49,000 వరకు చేరిన అనంతరం 500 పాయింట్ల మేరకు కరెక్షన్ సాధించింది. చివరికి వారం కనిష్ఠ స్థాయి గత వారం కన్నా 70 పాయింట్ల స్వల్పలాభంతో 48,500 వద్ద ముగిసింది. ప్రధాన మద్దతు స్థాయిలు 48,000, 47,700. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. రియాక్షన్ అనంతరం రికవరీ బాట పడితే నిరోధ స్థాయి 48,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆపై నిరోధం 49,000.

పాటర్న్: నిఫ్టీ 22300 వద్ద "అడ్డంగా ఏర్పడిన ఏటవాలు మద్దతు రేఖ" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు. మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకునే ఆస్కారం ఉన్నందు వల్ల మరింత కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు.

టైమ్: ఈ సూచీ ప్రకారం శుక్రవారం తదుపరి రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,520, 22,600
మద్దతు	22,380, 22,300

www.sundartrends.in

రాయి దెబ్బ రివర్స్!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి జగన్‌కు తగిలిన రాయిదెబ్బ ఘటన నుంచి రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ నాయకత్వం వేసిన ఎత్తుగడ రివర్స్ అయింది. ఎన్నికల్లో ఓటమి భయంతోనే.. సానుభూతి కోసం వేసిన ఎత్తుగడగా ప్రజలకు అర్థమైపోయింది. వివేకా హత్యను, కోడికత్తి దాడి ఘటనలను చంద్రబాబుపై నెట్టి గత ఎన్నికల్లో అధికారం పొందినట్లే.. ఇప్పుడు దానిని నిలబెట్టుకోవడానికి, రాజకీయ లబ్ధి కోసం రాయి దాడి డ్రామాకు వైసీపీ తెరలేపిందని జనం సోషల్‌మీడియాలో విరుచుకుపడుతున్నారు. శనివారం రాత్రి దాడి ఘటన జరిగీ జరగకముందే ఈ విషయం వలంటీర్లకు, వైసీపీ కార్యకర్తలు, నేతలకు ఎలా తెలిసింది.. వారంతా క్షణాల్లో రోడ్లపైకి ఎలా వచ్చారు.. చంద్రబాబుకు వ్యతిరేకంగా వారు పట్టుకున్న ప్లకార్డులు నిమిషాల్లో ఎలా సిద్ధమయ్యాయి.. ఏం జరిగిందో తెలియక ముందే మంత్రుల నుంచి నాయకుల వరకూ జగన్ హత్యకు కుట్ర అంటూ ప్రచారం మొదలుపెట్టడం వెనుక మర్మమేమిటని నిలదీస్తున్నారు. సానుభూతి రాకపోగా.. జనం నుంచే ఎదురుదాడి మొదలవడంతో జగన్ అండ్ కో ఆత్మరక్షణలో పడింది. జగన్ విపక్షంలో లేరని.. సీఎంగా ఉన్నారని.. పోలీసు యంత్రాంగం ఆయన చేతిలోనే ఉందని.. భారీ భద్రత ఆయనకు కల్పిస్తున్నారని.. విపక్షంలో ఉన్న చంద్రబాబుపై ఆరోపణలు ఎలా చేస్తారని ప్రజలు నిలదీస్తుండడంతో అధికార పక్షానికి పాలుపోవడం లేదు. వివేకా హత్య కేసు నిందితులను జగన్ రక్షిస్తున్నారని ఆయన చెల్లెళ్లు షర్మిల, సునీత విమర్శిస్తుండడం.. సీఎం బస్సుయాత్రకు పెద్దగా స్పందన లేకపోవడంతో.. వీటినుంచి దృష్టి మళ్లించడానికే తాజా నాటకం మొదలుపెట్టారని జనం బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పైగా కోడికత్తి దాడి డ్రామాను గుర్తుచేస్తున్నారు. ఈ వ్యవహారంలో నాడు ఎన్నికల సమయంలో వైసీపీ చేసిన దుష్ప్రచారం.. దీనివెనుక రాజకీయ కుట్ర లేదని ఎన్ఐఏ తేల్చినా.. జగన్ హైకోర్టును ఆశ్రయించడం, ఐదేళ్లుగా జైల్లో మగ్గుతున్న శ్రీనివాసరావుకు కోర్టు బెయిల్ మంజూరు చేయడం.. వివేకా హత్య విషయంలోనూ జగన్నాటకం.. సీఎం సోదరుడు అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డిలను సీబీఐ నిందితులుగా చేర్చడం వంటి పరిణామాలను ప్రస్తావిస్తూ టీడీపీ విరుచుకుపడుతుండడంతో ఏం మాట్లాడాలో వైసీపీ నేతలకు తెలియడంలేదు. సీబీఐ దర్యాప్తుతోనే అసలు విషయాలు బయటికొస్తాయని.. తక్షణం కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని ఈసీకి టీడీపీ ఫిర్యాదు చేసింది. దీంతో సజ్జల నీలి, కూలి మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనతో తమకు సంబంధం లేదని టీడీపీ నేతలు చెబితే సబబుగా ఉంటుందని.. కానీ దీనిని కోడికత్తి ఘటన 2.0గా గేలి చేసి మాట్లాడడం ఏమిటని అన్నారు. జగన్ సభలకు జనాలు రావడం చూసి చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వల్లే దాడి జరిగిందని ఆరోపించారు. బలమైన దెబ్బ తగిలిందంటూనే.. సోమవారం నుంచి జగన్ బస్సు యాత్రను కొనసాగిస్తారని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీకి పరాజయం తప్పదని జాతీయసంస్థల సర్వేలతో పాటు జగన్ సొంత సర్వేలు కూడా చెబుతున్నాయి. నేపథ్యంలో.. ఆయనపై రాయి దాడి డ్రామాను వైసీపీ రక్తికట్టించేందుకు ప్రయత్నించి విఫలమైందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. సానుభూతిని పండించడం కోసమే ఇలా చేసిందని విమర్శిస్తున్నాయి.



గులకరాయితో హత్యాయత్నమా?

(మొదటి పేజీ తరువాయి)

నిజమంటూ విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అజిత్ సింగ్ నగర్ పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. ఐపీసీ చట్టం అధికార పార్టీకి వర్తించబోదని 2019 జూన్‌లోనే తేల్చేసిన ఏపీ పోలీసులు వైసీపీ చట్టాన్ని అమలు చేస్తున్నారు. తాజాగా అదే పంథాను కొనసాగించి 'మేమింతే' అని నిరూపించుకున్నారు. ఇదే విజయవాడలో ప్రతిపక్ష పార్టీకి చెందిన కార్పొరేటర్ భర్త చెన్నుపాటి గాంధీపై అధికార వైసీపీ రౌడీలు పదునైన ఇనుప చువ్వలతో దాడి చేసి కన్ను పొడిచేస్తే.. ఈ ఘటనలో హత్యాయత్నం వర్తించబోదంటూ ఇదే పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా చెప్పడం ఆయన అధికార భక్తికి నిదర్శనం. ఎన్నికల వేళ ఏదో ఒక డ్రామాకు తెరతీసే జగన్ రెడ్డి బ్యాచ్ గత ఎన్నికల ముందు కోడికత్తి డ్రామా తరహాలోనే ఇప్పుడు గులకరాయి సానుభూతికి పథక రచన చేసింది. సీఎం జగన్ కనుబొమ్మపై చర్మం చిట్లే గాయం చేసిన గులకరాయి ఘటన డ్రామాను ఆయన సొంత మీడియా మలుపులు తిప్పుతున్న తీరు అందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఎన్నికల్లో లబ్ధి కోసం జగన్ నటిస్తున్న తీరును సోషల్ మీడియాలో నెటిజెన్లు ఏకి పారేస్తున్నారు. 'కోడికత్తి కమల్‌హాసన్', 'గులకరాయి స్టార్' అంటూ బిరుదులు ఇస్తున్నారు.

ఎయిర్ గన్నా.. గులకరాయా?

జగన్‌ను ఎయిర్ గన్‌తో కాల్చారని సాక్షి టీవీ కథనం వండితే.. ఆయన పత్రికలో మాత్రం రాయి విసిరారంటూ రాశారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు జగన్ సొంత మీడియా చేస్తున్న అతితో పోలీసులు తల పట్టుకున్నారు. ఒక వ్యక్తిని హత్య చేయాలని ఎవరైనా అనుకుంటే ఒరిజినల్ గన్‌తోనే కాలుస్తాడు తప్ప ఎయిర్ గన్ ఎందుకు వాడతాడనే ప్రశ్న పోలీసుల నుంచి వస్తోంది. ప్రపంచ చరిత్రలోనే ఇంతవరకూ వాహనంలో వెళుతున్న వ్యక్తిని కాల్చిచంపిన ఘటన ఒక్కటే జరిగింది. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీని 1963లో చంపగలిగారు. ఆ తర్వాత ఇదే అన్నట్లు జగన్ మీడియా రాసుకొచ్చింది. కదులుతున్న వాహనంలో చుట్టూ భద్రతా సిబ్బంది మధ్యలో ఉన్న వ్యక్తి కణతపై ఎయిర్ గన్‌తో కాల్చాలంటే ఎంతో నైపుణ్యం ఉండాలి. అంతర్జాతీయ రైఫిల్ షూటర్ లేదా ప్రపంచంలోనే కరుడుగట్టిన తీవ్రవాద సంస్థల్లో శిక్షణ పొందిన వ్యక్తి అయి ఉండాలి. లేదంటే పోలీస్ అకాడమీలో రైఫిల్ షూటింగ్ శిక్షణ తీసుకొని ఉండాలి. బెజవాడలో ఆ స్థాయి వ్యక్తులు ఎవరూ లేరు. రోడ్డుపై నుంచి కాలిస్తే కనీసం 15అడుగుల ఎత్తులో బస్సుపై ఉన్న వ్యక్తిని గురిపెట్టడం అసాధ్యం. ఎయిర్ గన్ పేలిస్తే శబ్దం వస్తుంది. ఘటనా స్థలంలో అలాంటి శబ్దం ఎవరికీ వినిపించలేదు.



స్కూలు బిల్డింగ్ వైపు నుంచి రాయి వస్తున్నట్టు జగన్ మీడియాలో చూపిస్తున్న దృశ్యం

వీఐపీ ఆదేశాలు సెక్యూరిటీ పాటిస్తుందా?

సెక్యూరిటీ సిబ్బందికి వీఐపీ ఆదేశాల కన్నా ప్రాణాలను రక్షించడమే ముఖ్యం. గులకరాయి ఘటన దృశ్యాలు పరిశీలిస్తే వీడియోల్లో వేర్వేరుగా ఉంది. ఒక వీడియోలో దండకు ఉన్న తీగలాంటిది ఏదో గుచ్చుకున్నట్లు ఇద్దరూ (జగన్, వెలంపల్లి) పక్కకు తల తిప్పారు. మరో దాంట్లో జగన్ ఒక్కరే తిరగడం కనిపించింది. వీఐపీపై దాడిజరగ్గానే భద్రతా సిబ్బంది చుట్టుముడతారు. క్రిమినల్స్ మళ్లీ దాడి చేస్తారని అప్రమత్తమవుతారు. జగన్ సెక్యూరిటీ గార్డుల్లో కనీసం టెన్షన్ కనిపించలేదు. సీఎం కూర్చో అనగానే ముందున్న గార్డు కింద కూర్చున్నారు. గాయంపై వ్యక్తిగత సహాయకుడు టవల్‌తో తుడుస్తుంటే జగన్ ఫొటోలకు పోజులు ఇచ్చారు. గాయపడ్డ సీఎంను భద్రత సిబ్బంది వెంటనే బస్సులోకి దించేయాలి. రోప్ పార్టీ బస్సును చుట్టుముట్టాలి. పోలీసులు జనాన్ని చెదరగొట్టి ఎయిర్ గన్ శబ్దం వచ్చిన వైపుగా పరిగెత్తాలి. ఇవేవీ జరగలేదు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీపై శ్రీలంకలో దాడి జరగ్గానే సెక్యూరిటీ మెరుపువేగంతో స్పందించారు. గులకరాయి ఘటనలో జగన్ నుదుటి నుంచి రక్తం కారుతుంటే.. అయన్ను నిలబెట్టి కర్చీఫ్‌తో తుడుస్తారా? రోడ్డు ప్రమాదంలో ఎవరైనా గాయపడితే ఆ దారిన వెళ్లేవారు పక్కకు తీసుకెళ్లి కూర్చోబెట్టి నీళ్లిచ్చి సపర్యలు చేస్తారు. భారీ ఖర్చు పెట్టి ఎస్‌పీజీ తరహాలో జగన్ ఏర్పాటు చేసుకున్న గార్డులకు ఆ శిక్షణ ఎందుకివ్వలేదనే ప్రశ్న పోలీ సు వర్గాల్లోనే వినిపిస్తోంది.

గులకరాయి స్పిన్!

ఒక బస్సుపై కనీసం పది మంది ఉన్నప్పుడు ఇద్దరు వ్యక్తుల్ని గురి పెట్టి కొట్టడం అసాధ్యం. అలా కొట్టాలంటే ఇటువైపు నుంచి ఇద్దరు వ్యక్తులు గురి పెట్టాలి. ఒకే రాయి ముందుగా జగన్ నుదుటిపై తగిలి చర్మానికి గీత పెట్టి.. తర్వాత స్పిన్ అయ్యి వెలంపల్లి కన్ను మొత్తం కప్పేసేంత కట్టు కట్టేంత గాయం చేసింది. ఇంత టెక్నిక్‌గా రాళ్లు విసిరే వాళ్లు విజయవాడలో ఉన్నారా? అంటూ స్థానికులు నోరెళ్ల బెడుతున్నారు. క్రికెట్ బాల్ స్పిన్ అయినట్లు జగన్ నుదుటిపై రాయి స్పిన్ అయిందంటూ యువత సెటైర్లు వేస్తున్నారు. గులకరాయి దాడిలో జగన్ నుదుటికి చిన్న గాయం కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌లో కుట్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులు, సిబ్బందితో కలసి గ్రూప్ ఫొటో దిగిన తీరుపై సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు.

ఈసీకి డీజీపీ, సీపీ నివేదిక

జగన్‌పై జరిగిన గులకరాయి ఘటనపై ఈసీకి డీజీపీ, విజయవాడ సీపీ నివేదిక పంపారు. 'విజయవాడలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి సీఎం జగన్‌పైకి రాయి విసిరారు. ఆయనకు నుదుటిపై స్వల్ప గాయమైంది. ఆ తర్వాత యథావిధిగా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఆ తర్వాత ఆయన ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా అక్కడి వైద్యులు మూడు కుట్లు వేశారు. ముఖ్యమంత్రికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం. భద్రతా కారణాల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో ఆగంతకులు దాన్ని అదనుగా తీసుకుని రాయి విసిరారు' అని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, సీపీ క్రాంతి రాణా నివేదించారు. ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ విభాగాలన్నీ పటిష్ఠంగా పనిచేశాయని వివరించారు. వెలుతురు తక్కువగా ఉన్న చోట నుంచి ఒక వ్యక్తి రాయి విసరడం వల్లే ఈ గాయం అయిందని, ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు డీసీపీ ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటికే కొందరు అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని నివేదించారు.

చెన్నుపాటికి అలా.. జగన్‌కు ఇలా

ఏడాది క్రితం విజయవాడలో టీడీపీ నాయకుడు చెన్నుపాటి గాంధీపై వైసీపీ రౌడీలు పదునైన ఇనుప చువ్వ(స్క్రూడ్రైవర్ లాంటిది)తో దాడి చేసి కన్ను పొడిచేశారు. చంపాలనే ఉద్దేశంతోనే దాడిచేశారంటూ బాధితులు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఘటన రోడ్డుపై జరిగిన వాగ్వాదం తప్ప వేరే ఉద్దేశం వాళ్లకు లేదంటూ సీపీ క్రాంతి రాణా సర్టిఫికెట్ ఇచ్చారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఐపీసీ 326 సెక్షన్ నమోదు చేసి బెయిల్ వచ్చేందుకు సహకరించారు. ఇప్పుడు అదే విజయవాడలో జగన్‌పై గుర్తు తెలియని వ్యక్తి విసిరినట్లుగా చెబుతున్న రాయి వల్ల నుదుటిపై గీత పడింది. జగన్ రెడ్డిపై హత్యాయత్నం చేశారంటూ వెలంపల్లితో తాడేపల్లి పెద్దలు ఫిర్యాదు చేయించారు. వైసీపీ చట్టాన్ని తు.చ. తప్పకుండా అమలు చేసే పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు సాక్ష్యాధారాల మేరకు కేసు నమోదు చేస్తారు. కానీ 'సాక్షి' ఆధారాల మేరకు 307 సెక్షన్ కింద కేసు పెట్టారు.

ఎన్నికల ముందే జగన్‌పై దాడులు!

వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై సరిగ్గా ఎన్నికలకు ముందే దాడులు జరగడం ఏమిటో అనే సెటైర్లు నెట్టింట్లో దర్శనమిస్తున్నాయి. గత ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో ఉంటూ అక్రమాస్తుల కేసు విచారణ కోసం సీబీఐ కోర్టుకు వెళుతున్న జగన్‌కు విశాఖపట్నం విమానాశ్రయంలో 2018 అక్టోబరు 25న కోడికత్తి భుజానికి గుచ్చుకుంది. ఎన్నికల సానుభూతి కోసం ఆయన అభిమానే చిన్నగా గుచ్చారని పోలీసులు, అర అంగుళం గాయమైందని వైద్యులు తేల్చేశారు. ప్రాథమిక చికిత్స తర్వాత జగన్ నవ్వుతూ విమానం ఎక్కి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. 'జగన్‌కు తొమ్మిది కుట్లు పడ్డాయి. బలమైన గాయమైంది. హత్యాయత్నం జరిగింది. హోటల్లో పనిచేసే చంద్రబాబు కులానికి చెందిన వ్యక్తి దాడి చేశాడు. చంద్రబాబు, లోకేశ్ హత్యకుట్రకు పథక రచన చేశారు' అంటూ వైసీపీ నేతలు, నీలి మీడియా ఊదరగొట్టి జనాన్ని బెంబేలెత్తించారు. ఎన్ఐఏ అసలు విషయం తేల్చడంతో తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు రాకుండా తన అభిమాని శ్రీనివాసరావుకు బెయిల్ రానివ్వకుండా జగన్ తన అసలు స్వరూపం చూపించారు. ఐదేళ్ల క్రితం ఏప్రిల్ 11న రాష్ట్రంలో పోలింగ్ జరిగింది. అంతకు నాలుగు వారాల ముందు జగన్ చిన్నాన్న వివేకా దారుణ హత్యకు గురయ్యారు. మొదట గుండెపోటుతో చనిపోయారని జగన్ మీడియాలో ప్రసారం చేశారు. అసలు విషయం బయటికి రాగానే మాట మార్చి నారాసుర రక్తచరిత్ర అంటూ పెద్ద కథనాన్ని వండి వార్చింది. హత్య ఎలా జరిగిందో ప్రత్యక్షంగా తాను చూసినట్లు.. చిన్నాన్నను ఇలా ఇలా చంపారంటూ జగన్ మీడియా ముందు వివరించారు. ఈ రెండు ఘటనల ద్వారా ఎన్నికల్లో ఆయన లబ్ధిపొందారు. తాజాగా గులకరాయి ఘటన పోలింగ్ (మే 13) కు సరిగ్గా నెల ముందు (ఏప్రిల్ 13) జరగడం ఐప్యాక్ స్క్రిప్ట్‌లో భాగమా.? సానుభూతితో ఓట్లు పొందేందుకు జగన్ ఆడుతున్న డ్రామానా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

మరి ఇప్పుడు జగనేమన్నా పిట్టా..!

ముఖ్యమంత్రి జగన్‌పై గులకరాయి దాడి జరిగిన వెంటనే వైసీపీ నేతలు మీడియా ముందుకు వచ్చి ప్రతిపక్ష నేత చంద్రబాబే కారణమని ఆరోపించారు. ఇదే నేతలు గతంలో చంద్రబాబుపై రాళ్ల దాడి ఘటన జరిగినపుడు వెటకారంగా మాట్లాడారు. గతంలో నందిగామ పర్యటనలో చంద్రబాబుపై రాళ్ల దాడి జరిగింది. చంద్రబాబుకు తగలాల్సిన రాయి సెక్యూరిటీ అధికారికి తగిలి బాగా రక్తం కారింది. నాడు కొడాలి నాని, పేర్ని నాని, జోగి రమేశ్, అంబటి రాంబాబు ఈ ఘటనపై స్పందించిన వీడియోలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

- ఆయనేమన్నా పిట్టా: పోలీసుల పహారాలో అతని యాత్ర నడుస్తోంది. ఈయన్ను చంపేద్దామని ఎవడో చీకట్లో చిన్న గులకరాయి విసిరాడట. ఈయన పావురమా? పిట్టా? గులకరాయి పెట్టి కొడితే పోవడానికి. ఆయనే ఆయన పార్టీ కార్యకర్తలతో గులకరాళ్లు వేయించుకోవడం. - కొడాలి నాని
- మోసం చేస్తే రాళ్లే పడతాయి: కోపంతో ప్రజలు తిరుగుబాటు చేస్తారు. డబ్బులిచ్చి పూలు వేయించుకోగలవు కానీ మోసం చేస్తే ప్రజల నుంచి చెప్పులు, రాళ్లే పడతాయి మరి. - పేర్ని నాని
- విషపు రాజకీయ కుట్ర: నరనరాల్లో జీర్ణించుకున్న విషపు రాజకీయ కుట్రలో ఒక కోణం.. రాయి విసిరించుకోవడం. - జోగి రమేశ్
- అక్రమ కేసులతో వేధించినందుకే: మీరు అన్యాయంగా, అక్రమంగా కేసులు పెట్టి అందరినీ వేధించారు కాబట్టి మీరొస్తున్నపుడు ఎవరో తుంటరివాళ్లు విసరొచ్చు. ఒకటో రెండో తగిలాయి. చెప్పు చూపించి ఇది బాటా కంపెనీ వాళ్లే సమాధానం చెప్పాలి. ఈ రాయి ఫలానా వాడిదని వాళ్లు సమాధానం చెప్పాలి. మీ మీద ఎంత చెడు అభిప్రాయం ఉందో నేను ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. - అంబటి రాంబాబు



విజయవాడలో సీఎం జగన్‌పై రాళ్ల దాడి ఘటనపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు

బాబు వ్యాఖ్యల వల్లే సీఎంపై దాడి!

- రెచ్చగొట్టకుండా టీడీపీ నేతలను నియంత్రించండి
- ఈసీకి వైసీపీ నేతల వినతి

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై రాయి దాడి పక్కా పథకం ప్రకారం జరిగిందని, చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లే ఈ దాడి జరిగినట్లు అర్థమవుతోందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా చంద్రబాబును, టీడీపీ నేతలను నియంత్రించాలని ఎన్నికల సంఘాన్ని కోరామన్నారు. వైసీపీ నేతల బృందం ఆదివారమిక్కడ అమరావతి సచివాలయంలో ఎన్నికల అధికారులను కలిసింది. జగన్‌పై రాయితో దాడికి చంద్రబాబు వ్యాఖ్యలే కారణమని ఫిర్యాదు చేసింది. ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకుండా నియంత్రించాలని.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడారు. 'రాయి బలంగా వచ్చి జగన్ కంటిదగ్గర తగిలింది. పక్కనున్న వెలంపల్లి కంటికీ తగిలింది. ఒక వ్యక్తికి తగిలిన రాయి మరో వ్యక్తికి తగిలేలా వేశారంటే.. పవర్‌ఫుల్ ఆయుధం వాడారని అనుమానంగా ఉంది. రాయి విసిరిన వ్యక్తి షార్ప్ షూటర్ అయి ఉండాలి. ముందే అనుకుని.. టైం ప్రకారం చేశారు. దీనికి రాజకీయ మద్దతు ఉందా అనేది దర్యాప్తులో తేలాలి. డీజీపీని కలిసి, దోషుల్ని త్వరగా పట్టుకోవాలని కోరతాం. దాడిని చంద్రబాబు కూడా ఖండించారు. కానీ టీడీపీ నేతలు ఇదంతా నాటకమంటూ తప్పించుకోవాలని చూస్తున్నట్లు ఉంది' అని వ్యాఖ్యానించారు. 'మేమూ మొదట ఆకతాయిల పని అనుకున్నాం. నాయకులు మాట్లాకుండా ఎందుకుంటారు? దాడి జరిగితే ప్రతిస్పందించకుండా ఎవరుంటారు? ఎవడైనా రాయితో కొట్టించుకుంటాడా? టీడీపీ నేతలవి చిల్లర మాటలు' అని అన్నారు. ప్రతీకార దాడులు ఉంటాయా అని అడుగగా.. 'అలాంటి పని చేయం. మేం ప్రభుత్వంలో ఉన్నా.. వ్యవస్థలన్నీ ఈసీ అధీనంలోనే ఉన్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ప్రజాకోర్టులో తేల్చుకుంటాం' అని చెప్పారు. ఈ బృందంలో వైసీపీ ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, నందిగం సురేశ్, పార్టీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, మల్లాది విష్ణు, చల్లా మధుసూదన్‌రెడ్డి, రావెల కిశోర్ బాబు, మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జగన్ భద్రతకు సీఐఎస్ఎఫ్

సీఎం జగన్‌కు పోలీసులు భద్రత పెంచారు. ప్రస్తుతం ఇస్తున్న భద్రతకు అదనంగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలను(సీఐఎస్ఎఫ్) వినియోగించనున్నారు. శనివారం జరిగిన రాళ్ల దాడిఘటన అనంతరం పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. గన్నవరం మండలం కేసరపల్లి వద్ద సీఎం బస చేస్తున్న ప్రదేశంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదివారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. సీఎం బస చేస్తున్న ప్రాంతంలో ప్రస్తుతం ఆక్టోపస్ సిబ్బందిని భద్రతకు ఉపయోగిస్తున్నారు. అదేవిధంగా స్థానిక పోలీసులతోనూ భద్రత కల్పిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికల విధులకు వచ్చిన సీఐఎస్ఎఫ్ సిబ్బందిని కూడా సీఎం భద్రతకు అదనంగా నియమించారు. కేసరపల్లిలో జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో సీఎంకు బస ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశం చుట్టుపక్కలకు కూడా ఎవరూ వెళ్లకుండా భారీ ఎత్తున రెండు వరుసల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు.

దర్యాప్తునకు ఆరు బృందాలు

- అదుపులో దాడి అనుమానితులు?

విజయవాడ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై అజిత్‌సింగ్‌నగర్‌లో శనివారం రాత్రి జరిగిన రాయి దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వెలంపల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైం నెంబర్ 197తో ఐపీసీ 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మరోవైపు దాడి ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీపీ కాంతిరాణా ఏసీపీ నేతృత్వంలో మొత్తం 20మందితో ఆరు ప్రత్యేక బృందాలను నియమించారు. నార్త్ జోన్ ఏసీపీ దేవరకొండ ప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు సాగుతోంది. దాడికి సంబంధించి అధికారులు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కొందరు.. జగన్ యాత్రను వీడియో తీశారు. వాటిలో రాయివచ్చి సీఎంకు తగలగానే నుదుటిపై చేయి పెట్టిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. వీటిని సేకరించిన అధికారులు సైబర్ క్రైం విభాగంలోని ల్యాబ్‌లో విశ్లేషిస్తున్నారు. ఘటన జరిగిన ప్రదేశంలో ఉన్న సెల్‌టవర్ ఆధారంగా కాల్ డేటా రికార్డ్ జాబితాను వడబోస్తున్నారు. ఘటన సరిగ్గా మాకినేని బసవపున్నయ్య స్టేడియంను ఆనుకుని ఉన్న వివేకానంద స్కూల్ వద్ద జరిగింది. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాల ఫుటేజీ సేకరించాలని భావించారు. అయితే, సీఎం యాత్ర భద్రత రీత్యా విద్యుత్ శాఖ అధికారులు సరఫరాను నిలుపుదల చేశారు. స్కూల్‌కు చుట్టుపక్కల ఉన్న భవనాలకు సీసీ కెమెరాలు ఉన్నా.. విద్యుత్ లేకపోవడంతో ఫుటేజీ సేకరణ ఇబ్బందికరంగా మారింది. దీంతో డ్రోన్ కెమెరాల విజువల్స్‌ను విశ్లేషిస్తున్నారు.

చెట్టు పక్కనుంచి కొట్టారా?

జగన్, వెలంపల్లికి తగిలిన రాయి ఎక్కడి నుంచి వచ్చింది? ఏ కోణంలో వచ్చింది? అన్న ప్రశ్నలకు సంబంధించి దర్యాప్తు బృందాలు ఒక నిర్ధారణకు వచ్చాయి. సీఎం ప్రయాణిస్తున్న బస్సుకు ఎడమ వైపు నుంచి రాయి దూసుకు వచ్చినట్టు తేల్చారు. క్యాట్‌బాల్ ఉపయోగించినట్టు భావిస్తున్నారు. వివేకానంద స్కూల్, బసవపున్నయ్య స్టేడియంలో ఏదోఒక చోట నుంచి రాయి విసిరి ఉంటారని అనుమానిస్తున్నారు. వివేకానంద స్కూల్ ఆవరణలో మరుగుదొడ్లకు పక్కన సగం నరికేసిన అశోక వృక్షం ఉంది. ఈ చెట్టు చాటు నుంచి గానీ, ప్రహరీ పైనుంచి గానీ క్యాట్‌బాల్‌తో రాయి విసిరారని నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. ఈ కేసులో విజయవాడ పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఒక రౌడీషీటర్‌ను అదుపులోకి తీసుకుని, అతను ఇచ్చిన సమాచారంతో మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. వారిని ఒక రహస్య ప్రదేశంలో విచారిస్తున్నారని సమాచారం.

వెలంపల్లి ఫిర్యాదు ఇదీ..

"నేను(వెలంపల్లి శ్రీనివాసరావు) సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ తరపున పోటీ చేస్తున్నా. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ బస్సు యాత్ర సెంట్రల్ నియోజకవర్గంలోకి రాగానే జగన్‌తోపాటు నేను, ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్సీ రుహుల్లా కొంతమంది నాయకులు కలిసి ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్తున్నాం. శనివారం రాత్రి సుమారు 8.30గంటల సమయంలో అజిత్‌సింగ్‌నగర్ వివేకానంద స్కూల్ దగ్గరికి వచ్చేసరికి సీఎం ప్రజలకు అభివాదం చేస్తున్న సమయంలో జగన్ ఆదరణ సహించలేక ఆయనను అంతమొందించాలని దాడి చేశారు. జగన్ తలకు గురిపెట్టి పదునైన రాళ్లు విసరడం గానీ, క్యాట్‌బాల్‌తో కొట్టడం ద్వారా దాడిచేశారు. ఈ దాడిలో సీఎం నుదుటికి ఎడమ భాగాన పదునైన రాయి తగిలి లోతైన గాయమైంది. భద్రతా సిబ్బంది, సీఎం వైద్యబృందం అప్రమత్తమై ఆయనకు, నాకు ప్రథమ చికిత్స చేశారు. ఆ తర్వాత సీఎం బస్సు యాత్రను కొనసాగించారు. సీఎంపై ఒక పథకం ప్రకారం దురుద్దేశపూర్వకంగా దాడి చేశారు" అని వెలంపల్లి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఒక్కటే రాయి.. మూడు గాయాలు

- ఇది ప్రపంచలోనే అరుదైన ఘటన: ఆనం రమణారెడ్డి

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): 'ఒక రాయితో రెండు కళ్లు, ఒక కాలికి గాయం కావడం ప్రపంచంలో ఎక్కడా జరిగి ఉండదు. ముఖ్యమంత్రి జగన్‌పై దాడి సంఘటనలో జరిగింది' అని టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 'ఒక రాయి ముందు జగన్‌రెడ్డి కంటి పైన తగిలి, పక్కనే ఉన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కంటి దగ్గర కూడా తగిలింది. అక్కడ నుంచి కిందకు వెళ్లి జగన్ కాలినీ గాయపర్చింది. సీఎం కార్యాలయం విడుదల చేసిన ఫొటోల్లో ఆయన కంటిపైన, కాలికి కూడా బ్యాండేజీలు కనిపిస్తున్నాయి. రాష్ట్రం మొత్తం ప్రజలు దీని గురించి చర్చిస్తున్నారు. ప్రజల్లో సానుభూతి పుట్టించడం కోసం ఐ ప్యాక్ సహకారంతో తాడేపల్లి ప్యాలెస్ ఈ నాటకాన్ని రచించింది. సీఎం సతీమణి భారతి సాధారణంగా బయట కనిపించరు. కాని ఈ దాడి ఘటనకు కొద్ది గంటల ముందు తాడేపల్లి వద్ద రోడ్డు మీదకు వచ్చి బస్సు యాత్రలో ఉన్న జగన్‌కు చేయి ఊపారు. ఆ వెంటనే ఈ సంఘటన జరగడం... ఇదంతా ముందస్తు ప్రణాళిక అని అనుమానాలు కలగడానికి ఆస్కారం ఇస్తోంది. ఈ డ్రామాలో జగన్ మీడియా తన వంతు పాత్ర పోషించింది. ఒక చిన్న రాయితో జగన్‌పై ఏకంగా హత్యాయత్నం జరిగిందని పెద్ద శీర్షిక, ఫొటోలు పెట్టి వండి వార్చింది. ఈ ఎన్నికల సమయంలో వైఎస్ కుటుంబానికి ఏదో ఒకటి జరుగుతుందని, జాగ్రత్తగా ఉండాలని మేం పోలీసులకు ముందే మొర పెట్టుకొన్నాం. ఇతర దేశాల నిఘా సంస్థలు కూడా జగన్‌కు ప్రమాదం పొంచి ఉందని తమకు సమాచారం ఇచ్చాయని పోలీసులు చెప్పారు. ఇంత సమాచారం ఉంటే డీజీపీ ఏం చేస్తున్నారు? ఆయన ఏం భద్రతా చర్యలు తీసుకొన్నారు? ఆయన కూడా ఈ డ్రామాలో భాగస్వాములు అయ్యారా..!' అని ఆనం ప్రశ్నించారు. ఇది ఇంతటితో ఆగుతుందని తాము అనుకోవడం లేదని, ఇంతకంటే ఘోరాలకు ప్రణాళికలు రచిస్తున్నారన్న అనుమానాలు తమకు ఉన్నాయని అన్నారు. 'వైఎస్ షర్మిల, వైఎస్ సునీత, వైఎస్ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డికి ప్రమాదం పొంచి ఉంది. వారిపై దాడి చేయించి దానిని చంద్రబాబుపై నెట్టే అవకాశం ఉంది. పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలి' అని ఆనం డిమాండ్ చేశారు. జగన్‌పై దాడి జరిగిన ఐదు నిమిషా ల్లో వలంటీర్లు ఇంటింటికి తిరిగి జగన్‌పై హత్యాయత్నం జరిగిందని ప్రచారం చేశారని, వారిని అంత వాయు వేగంతో ఎలా తిప్పగలిగారని ఆనం సందేహం వ్యక్తం చేశారు.

చంద్రబాబుపై రాయి దాడి



గాజువాక సభలో రాయి దాడితో అప్రమత్తమై.. చంద్రబాబు చుట్టూ నిలుచున్న భద్రతా సిబ్బంది.. విజయవాడలో జగన్‌పై దాడి తర్వాత భద్రతా సిబ్బంది ఈ జాగ్రత్తలు తీసుకోలేదు.

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగం ప్రారంభించారు. ఏడెనిమిది నిమిషాలు తరువాత ఆయన మాట్లాడుతున్న వేదికకు తూర్పు వైపు నుంచి ఆగంతకులు రాయి విసిరారు. ఆ రాయి బారికేడ్లకు తగిలి కింద పడి శబ్దం రావడంతో భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమై పోలీసులను అలర్ట్ చేశారు. దీంతో పోలీసులు రాయి వచ్చిన దిశ వైపు పరుగులు పెడుతూ ఆగంతకులను పట్టుకునే ప్రయత్నం చేశారు. కొందరు సిబ్బంది పక్కనే ఉన్న గోడలు ఎక్కి గాలించినా ఎవరూ చిక్కలేదు. పోలీసులు పరుగు పెడుతున్న దిశను చూపిస్తూ గంజాయి బ్యాచ్, బేడ్ బ్యాచ్ ఇక్కడికి వచ్చినట్టుందని చంద్రబాబు అన్నారు. ఈ దశలో సభలో ఒక్కసారిగా కలకం రేగింది. కాగా, శనివారం విజయవాడలో సీఎం జగన్‌పై రాయి దాడి జరిగిన నేపథ్యంలో ఆదివారం గాజువాకలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలో పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. సీపీ స్వయంగా సభ ప్రాంగణం పక్కనున్న ఓ భారీ భవనం పైనుంచి పరిస్థితిని సమీక్షించారు. చుట్టూ పోలీసులు ఉన్నప్పటికీ ఆగంతకులు రాయి విసరడం అందరినీ ఆందోళనకు గురిచేసింది.

ఈ రాళ్లు ఒక లెక్కా...

రాళ్ల దాడి అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ తనపై క్లైమోర్ మైన్స్‌తో దాడి జరిగితేనే భయపడలేదని, రాళ్ల దాడి చేస్తే భయపడతానా?... అంటూ విరుచుకుపడ్డారు. శనివారం రాత్రి సీఎం జగన్‌పై చీకట్లో గులక రాయితో దాడి చేశారని, తనపై వెలుగులోనే రాయి విసిరారని పేర్కొన్నారు. జగన్ డ్రామాలు ఆడుతున్నాడని ఆరోపించారు. గులకరాయి వేస్తే తాను ఖండించానని, పవన్‌పైన, తనపైనా దాడి జరిగితే ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. జగన్‌కు మాత్రమే రక్షణ, గౌరవం కావాలా?, మాకొద్దా? అని నిలదీశారు. సీఎంగా ఉన్న వ్యక్తిపై దాడి జరిగితే తనపై విమర్శలు చేస్తున్నారని, బుద్ధి, జ్ఞానం ఉండాలన్నారు. తానే రాయి వేయించానంటూ, నరకాసురుడు అంటూ పేటీఎం బ్యాచ్ ప్లకార్డులు ప్రదర్శిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సభలకు జనం రావడం లేదని, అందుకే ఈ డ్రామాలు ఆడుతున్నాడని మండిపడ్డారు. జగన్‌పై ఎవరో గులకరాయి వేస్తే... తనపై రాళ్లు వేయిస్తారా..? అని ప్రశ్నించారు. జగన్‌పై రాళ్లు వేసి 24 గంటలు అయినా బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని, దీనిపై సీఎస్, ఇంటెలిజెన్స్, డీజీపీ ఏం చేస్తున్నారని నిలదీశారు. పాలన చేతకాకుంటే తనకు బాధ్యతలు అప్పగించాలని, తన సత్తా ఏమిటో చూపిస్తానని చంద్రబాబు పేర్కొన్నారు. 'బాబాయ్‌ను నువ్వు చంపి... నాపై ఆరోపణలు చేసి ప్రజల సానుభూతి పొందాలనుకున్నావు... చెల్లెళ్లపై కేసులు పెట్టి వేధించిన దుర్మార్గుడివి నువు.' అంటూ చంద్రబాబు ఆరోపించారు. గతంలో కోడికత్తితో డ్రామాలాడారని, ఇప్పుడు ఎవడో గులకరాయి వేస్తే తాను వేయించానని చెబుతున్నారని ధ్వజమెత్తారు. జగన్ బెదిరిస్తే మనం భయపడాలా? అని ప్రశ్నించారు. తిరగబడి, వెంటపడి కొట్టి రాష్ట్రాన్ని కాపాడుకుంటామన్నారు. ప్రశాంతమైన విశాఖలో పులివెందుల గొడ్డలి పంచాయితీలు పెట్టిస్తావా అని చంద్రబాబు నిలదీశారు.

వారాహి ర్యాలీపై రాయి?

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి ర్యాలీలో ఆకతాయి రాయి విసిరాడని చితకబాది పోలీసులకు అప్పగించటం కలకలం రేపింది. ఆదివారం రాత్రి గుంటూరు జిల్లా తెనాలిలో వారాహి విజయభేరి కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. ప్రత్యేక హెలికాప్టర్ దిగి వారాహి వాహనంపై బయలుదేరారు. మార్కెట్ యార్డ్ సమీపంలోకి రాగానే పవన్‌పైకి రాయి విసిరారని, అది ఆయనకు తగలకుండా పక్కకు పోయిందనే వార్త గుప్పుమంది. ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది రక్షణగా ప్లాస్టిక్ పలకలను పట్టుకున్నారు. ఇది తెలిసిన జనసైనికులు ఆగ్రహంతో ఊగిపోయారు. రాయి విసిరాడని ఓ యువకుడ్ని చితకబాది పోలీసులకు అప్పగించారు. పొన్నూరు మండలం నుంచి వచ్చిన ఆ యువకుడు కొందరు యువతులపై పడటం, ఓ యువతి తండ్రి ప్రశ్నించటంతో ఆయన్ను కొట్టేందుకు ఆ యువకుడు చెప్పు తీశాడని, దానిని పవన్‌పైకి విసురుతున్నాడేమోనని అక్కడే ఉన్న అభిమానులు అతడిపై దాడి చేసి, తర్వాత తమకు అప్పగించారని పోలీసులు వివరించారు. ఎవరూ రాయి విసరలేదని తెలిపారు.



పవన్‌కు రక్షణగా ప్లాస్టిక్ పలకలు పెట్టిన భద్రతా సిబ్బంది

కొండలను మింగిన అనకొండ జగన్

(మొదటి పేజీ తరువాయి)

చివరకు రుషికొండను కూడా సీఎం వద లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయేని గెలిపించి, రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్రజాగళంలో భాగంగా ఆదివారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, విశాఖ జిల్లా గాజువాకల్లో నిర్వహించిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. తొలుత పాయకరావుపేటలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో కుంభకోణాలు చేసిన వారిని తాము అధికారంలోకి వచ్చాక ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు. ఎస్సీ నియోజకవర్గాల్లో టీడీపీ కూటమికి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. 27 దళిత సంక్షేమ పథకాలను రద్దు చేసిన దళిత ద్రోహి జగన్ అని ధ్వజమెత్తారు. చెత్తపై పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రి జగనేనన్నారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత తీసుకుంటామని, ఇళ్ల నిర్మాణాలకు 2 సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పేదలకు ఇచ్చిన ఇళ్ల జాగాలను రద్దు చేయబోమన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో 4 కోట్ల ఇళ్లు నిర్మించిందని.. రానున్న ఐదేళ్లలో మరో 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తారని, అందులో భాగంగా మన రాష్ట్రంలో 30-40 లక్షల ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. ఆటో డ్రైవర్లకు ఇబ్బంది లేకుండా వారిని ఆదుకునేందుకు కొత్త పాలసీని అమలు చేస్తానని చెప్పారు. సామాజిక పింఛన్ రూ.4 వేలకు పెంచడమే కాకుండా ఏప్రిల్ నెల నుంచి బకాయిలు కూడా అందజేస్తామన్నారు. వలంటీర్లకు రూ.10 వేలు అందిస్తామని.. వారికి నైపుణ్య శిక్షణ అందించి నెలకు రూ.లక్ష సంపాదించేలా చేస్తానని చెప్పారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామన్నారు. తమ మేనిఫెస్టోలో ఉన్న యువగళం, బీజేపీ మేనిఫెస్టోలో ఉన్న యువశక్తి పథకాల ద్వారా 20 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. 'బానిసలుగా పెట్టి ఊడిగం చేయించుకునే విధానం జగన్‌ది. నేరాలు, ఘోరాలు చేయించి ఎంగిలి మెతుకులతో పడి ఉండాలన్నది ఆయన తత్వం. అందరూ ఆత్మగౌరవంతో బతకాలన్నది నా విధానం. రూ.10 ఇచ్చి రూ.100 దోచుకోవడం జగన్ పాలసీ. వ్యవస్థలను భ్రష్టుపట్టించారు' అని ధ్వజమెత్తారు.

> విశాఖకు మా హయాంలో విదేశాల నుంచి పెట్టుబడులు వస్తే.. వైసీపీ ప్రభుత్వంలో ఇటీవల 25 వేల కిలోల డ్రగ్స్ వచ్చాయి.
>
> ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా గాడి తప్పింది. తిరిగి గాడిలో పెట్టే బాధ్యత తీసుకుంటా. 14 ఏళ్ల సీఎంగా ఎంతగా అభివృద్ధి చేశానో.. రానున్న ఐదేళ్లలో రాష్ట్రాన్ని అంతకంటే ఎక్కువగా అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా.
>
> ప్రశ్నించే వారిపై వేధింపులు, మాట్లాడే వారిపై కేసులతో గొంతు నొక్కే ప్రయత్నం జగన్ సాగించాడు. నాపై ఎన్ని కేసులు ఉన్నాయో ఇప్పటివరకూ తెలియదు. కేసులు చిట్టా ఇవ్వాలంటూ డీజీపీకి లేఖ కూడా రాశానంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.
>
> - చంద్రబాబు


గాజువాక సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, సభకు హాజరైన జనం

కంపెనీలను తరిమేశారు

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కంపెనీలు రావాలి. కానీ ఈ దుర్మార్గుడు జగన్ ఉన్న కంపెనీలను తరిమేశాడు. విశాఖలో మిలీనియం టవర్స్ నుంచి ఐటీ కంపెనీలు, ఇంకా లులూ గ్రూపు, అదానీ డేటా సెంటర్ అన్నీ పోయాయి. మా ప్రభుత్వం వస్తే పరిశ్రమలు వస్తాయి. మళ్లీ జగన్ వస్తే గంజాయి వస్తుంది. విశాఖలో శాంతిభద్రతలు లేవు. ఎంపీ కుటుంబ సభ్యులను నిర్బంధిస్తేనే దిక్కు లేదు. మా ప్రభుత్వం ఏర్పాటయ్యాక సంపద సృష్టించి, తద్వారా అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తాం. బీసీలకు అండగా ఉంటాం. 50 ఏళ్లకే పింఛన్ ఇస్తాం.

ప్రభుత్వ సహకారం లేకుండా సాధ్యమా?

విశాఖ పోర్టు ద్వారా 25 వేల కేజీల డ్రగ్స్ దిగుమతి చేశారు. రాష్ట్రప్రభుత్వ సహకారం లేకుండా ఇది సాధ్యపడుతుందా? ఎంతోమంది చిన్నారులు డ్రగ్స్‌కు, గంజాయికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. దీనిపై గతంలో హెచ్చరించాను. కేంద్రానికి కూడా ఫిర్యాదు చేశాను. డ్రగ్స్, గంజాయిపై పోరాడాలని నేను చెబితే.. మా పార్టీ కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడికి పాల్పడ్డారు. నేను సీఎం గా ఉండి ఉంటే అటువంటి వారికి చివరిరోజు అయి ఉండేది. ఇదో చెత్త, చేతగాని ప్రభుత్వం. గతంలో విశాఖకు పవన్ కల్యాణ్, నేను వస్తే అడ్డుకున్నారు. ఇది మీ తాత జాగీరా..? నేను ఇలానే అడ్డుకుని ఉంటే జగన్ పాదయాత్ర చేసేవాడా..? విభజిత ఏపీలో అటువంటి మరో రాజధాని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతోనే రాజధాని అమరావతిని ప్రారంభించాను. పోలవరం నిర్మాణంతోపాటు నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టాను. కానీ దుర్మార్గుడు అధికారంలోకి వచ్చాడు. ప్రజావేదిక కూల్చివేతతో పాలన ప్రారంభించి ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో భస్మాసుర వధ జరగాలి. కరెంటు చార్జీలను జగన్ గత ఐదేళ్లలో తొమ్మిది సార్లు పెంచాడు. ఏప్రిల్ నెల కరెంట్ బిల్లు చూస్తే ఎవరికైనా గుండె ఆగిపోతుంది. మూడు సార్లు ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచాడు. కాగా, చంద్రబాబు సోమవారం రాజాం, పలాస నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజాగళం సభల్లో పాల్గొంటారు.

విశాఖను ఎంతో అభివృద్ధి చేశా..

నేను సీఎంగా ఉన్నప్పుడు విశాఖపట్నాన్ని అభివృద్ధి చేశా. హుద్‌హుద్‌కు ముందు, తర్వాత అన్న రీతిలో తీర్చిదిద్దాను. పరిశ్రమలు తెచ్చా. ఐటీ కంపెనీలు పెట్టా. టూరిజం, ఐటీ హబ్‌గా తయారుచేశా. 200 ఎకరాల్లో మెడ్‌టెక్ జోన్‌ను ఏర్పాటుచేశా. ఐఐఎంతోపాటు అనేక యూనివర్సిటీలు తెచ్చా. అటువంటి విశాఖను ఐదేళ్లలో ఈ ప్రభుత్వం గంజాయి కేంద్రంగా మార్చేసింది. విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నిలుపుదలకు జగన్ ముందుకొస్తే నేనూ వస్తానని చెప్పాను. కానీ ఆయన పట్టించుకోలేదు. అటువంటి వ్యక్తికి ఓటడిగే హక్కుందా..? స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా బాధ్యత తీసుకుంటా.

'కోడ్'కు జెల్ల కొట్టి..

- రెవెన్యూ శాఖ మరో దుస్సాహసం
- 118 మందికి తహసీల్దార్లుగా పదోన్నతులు
- దీనివెనుక సీసీఎల్ఏ అధికారి, సంఘ నేతలు
- భారీగా ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మొన్న సుమోటో కుల ధ్రువీకరణ.. నిన్న ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్.. ఇప్పుడు అడ్డగోలుగా పదోన్నతులు!.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఎవరో ఒకరికి దొడ్డిదారిలో మేలు చేసేందుకు రెవెన్యూశాఖ వరుసగా దుస్సాహసాలు చేస్తోంది. హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా, కోడ్‌ను ఉల్లంఘించి ఒకేసారి 118 మందికి తహసీల్దార్లుగా పదోన్నతులు కట్టబెట్టేందుకు సిద్ధమైంది. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే సాధారణ పరిపాలన శాఖ నుంచి అనుమతి తీసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని స్ర్కీనింగ్ కమిటీ ముందుకు ఈ ఫైలు తీసుకు రాబోతున్నారు. కమిటీలో ఆమోదించి, పదోన్నతులకు అనుమతి ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌ను కోరబోతున్నారు. పదోన్నతులు వద్దని హైకోర్టు విస్పష్టంగా చెప్పినా, ఎన్నికల కమిషన్ నుంచి సరైన స్పష్టత తీసుకున్నాకే పదోన్నతులపై ఆలోచన చేయాలని హైకోర్టు డివిజన్ బెంచ్ ఇటీవల రెవెన్యూశాఖను ఆదేశించినా పెడచెవిన పెడుతోంది. క్లారిఫికేషన్ కోరుతూ కమిషన్‌ను సంప్రదించాల్సిన రెవెన్యూశాఖ, అందుకు విరుద్ధంగా ఏకంగా 118 మంది డిప్యూటీ తహసీల్దారులకు పదోన్నతులు ఇచ్చి వారిని తహసీల్దారుగా చూడాలనుకుంటోంది. ఈ ప్రయత్నం వెనుక ఇటు సీసీఎల్ఏ కార్యాలయంలోని ఓ అధికారి, అటు రెవెన్యూ సంఘంలోని ముగ్గురు గోదావరి జిల్లాల నేతలు ఉన్న తెలిసింది. కోడ్‌ను ఉల్లంఘించి మరీ పదోన్నతులు ఇవ్వాలనుకోవడం వెనుక భారీ లావాదేవీలే జరిగినట్లు, ఇంతకు ముందు రెవెన్యూ సంఘంలోనే కీలకపాత్ర పోషించిన నేత దీన్ని ముందుకు నడిపించారని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందుకే కోడ్‌ను ధిక్కరించి మరీ పదోన్నతులు ఇచ్చి తీరాలని అధికారులు తహతహలాడుతున్నారని తెలిసింది. నిజానికి పదోన్నతుల అంశం హైకోర్టు పరిధిలో ఉంది. స్టేటస్‌కో అమల్లో ఉండగా గత ఏడాది జూన్‌లో అక్రమంగా, అడ్డదారుల్లో 130 మందికి పదోన్నతులు కట్టబెట్టారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో అత్యవసరం పేరిట మరో 118కి దొడ్డిదారిలో పదోన్నతులు ఇవ్వాలనుకుంటున్నారు. ఎన్నికల సమయంలో పదోన్నతులు ఇవ్వకూడదనే కనీస నియమం. కోడ్‌ను ఉల్లంఘించడమే.


సత్యవేడు బహిరంగసభలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

కుంభకర్ణుడిలా జగన్

- ఎన్నికలకు ఆర్నెల్ల ముందు నిద్రలేచాడు
- ఆరు వేల పోస్టులకే డీఎస్సీ నోటిఫికేషన్
- జగన్ హామీలన్నీ మద్యం షాపుల్లో కనిపిస్తున్నాయి
- అధికారంలోకి వస్తే రాష్ట్రానికి పదేళ్లు హోదా ఇస్తాం
- ఎన్నికల సభల్లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల హామీ

శ్రీకాళహస్తి/ సత్యవేడు/ పుత్తూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): 'కుంభకర్ణుడైనా ఆరు నెలలు నిద్రపోయి, మరో ఆరు నెలలు మేలుకుని ఉంటాడు. కానీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నర ఏళ్లు నిద్రపోయి, ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి కాబట్టి ఆరు నెలల ముందు నిద్రలేచాడు' అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. ఆదివారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు పట్టణాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. మెగా డీఎస్సీ అంటూ హడావుడిగా 6వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ పేరిట దగా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన జగన్ అధికారంలోకి వచ్చాక దానిగురించి పట్టించుకోలేదని ఆరోపించారు. 23 వేల ఉద్యోగాలు ఇప్పుడూ ఖాళీగానే ఉన్నాయని, మెగా డీఎస్సీ పేరిట జగన్ కేవలం 6 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం మోసం, దగా కాదా అని షర్మిల నిలదీశారు. బూమ్ బూమ్ బీర్లు, స్పెషల్ స్టేటస్ విస్కీ, డీఎస్సీ బ్రాందీ... ఇలా జగన్ హామీలన్నీ మద్యం షాపుల్లో కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, ఇంటిపన్ను, ఆర్టీసీ చార్జీలు నాలుగు సార్లు, విద్యుత్ చార్జీలు ఏడుసార్లు పెంచారని ఆరోపించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ పదేళ్ల కింద మాట ఇచ్చిందని షర్మిల గుర్తు చేశారు. మొదటి ఐదేళ్లు సీఎంగా ఉన్న బాబు, తర్వాత ఐదేళ్లు సీఎంగా ఉన్న జగన్‌లో ఏ ఒక్కరైనా ప్రత్యేక హోదా కోసం నిజమైన ఉద్యమం చేశారా అని ప్రశ్నించారు. మోసం చేసే వాళ్లకు, బీజేపీకి అమ్ముడుపోయే పార్టీలకు ఓట్లు వేయద్దని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాలు కల్పించే ఫైలుపైనే తొలి సంతకం అని షర్మిల స్పష్టం చేశారు. వృద్ధులకు, వితంతవులకు నెలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పెన్షన్ నేరుగా వారి ఖాతాల్లోకే వేస్తామని, బటన్ నొక్కేది ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత పదేళ్ల పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువస్తుందని, రాహుల్ ప్రధాని కాగానే రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఫైలుపైనే మొదటి సంతకం చేస్తారని తెలిపారు.

జగన్‌ను సాగనంపాలి

- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



అనంతపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యాన్ని నిషేధిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా నకిలీ మద్యంతో నిరుపేదల రక్తాన్ని తాగుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటుతో ఫ్యాన్ మూడు రెక్కలను ముక్కలు చేయాలని ఆయన కోరారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా రెండోరోజైన ఆదివారం అనంతపురం జిల్లాలోని శింగనమల, అనంతపురం అర్బన్ నియోజకవర్గాల్లో బాలకృష్ణ రోడ్‌షోలు, బహిరంగ సభలు నిర్వహించారు. ఆయనకు అడుగడుగునా జనం నీరాజనం పలికారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... సీఎం జగన్ రాష్ట్ర ప్రజల పాలిట నయవంచకుడిగా మారాడని, ఆయన దినకంత్రీ మాదిరిగా పాలన చేస్తున్నాడని ధ్వజమెత్తారు.

కోస్తాలో వడగాడ్పులు

అమరావతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎండలు, వడగాడ్పులు పెరుగుతున్నాయి. కోస్తా జిల్లాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తుండగా, ఉత్తరాంధ్రలో తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. ఆదివారం 67 మండలాల్లో మోస్తరుగా, 35 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. నంద్యాల జిల్లా గోస్పాడులో 43.4, మన్యం జిల్లా నవగాం, విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 43.3, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో 42.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని 31 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని, శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు 139 మండలాల్లో వడగాడ్పులు ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

దుర్గగుడి టోల్‌గేట్ వద్ద సిబ్బంది దౌర్జన్యం

● ఎమ్మెల్సీ కారును అడ్డుకుని కారును పగులకొట్టిన వైనం

వన్‌టౌన్, ఏప్రిల్ 14: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం టోల్‌గేట్ వద్ద ప్రైవేట్ సిబ్బంది ఓ ఎమ్మెల్సీ కారును అడ్డగించి దౌర్జన్యానికి పాల్పడిన ఘటన రెండు రోజుల క్రితం జరిగింది. కారులో ఉన్న ఎమ్మెల్సీ ఆగ్రహించి కారుకు అయిన డ్యామేజీ చెల్లించాలని వారిని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం ఓ ఎమ్మెల్సీ అమ్మవారి దర్శనం నిమిత్తం కారులో ఘాట్ రోడ్డుపై నుంచి కొండపైకి బయలుదేరారు. టోల్‌గేట్ వద్ద ఉన్న కాంట్రాక్ట్ సిబ్బంది ఎమ్మెల్సీ కారుకు రుసుం టికెట్ తీసుకోవాలని అడిగారు. తాను ఎమ్మెల్సీని అని చెప్పినప్పటికి సిబ్బంది వినలేదు. తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని ఎమ్మెల్సీతో గొడవపడ్డారు. అంతటితో ఆగకుండా వారు మరింత రెచ్చిపోయి కారును పగులకొట్టారు. కారులో ఉన్న ఎమ్మెల్సీ బయటకు వచ్చి నష్టపరిహారం చెల్లించాలని లేకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న టోల్‌గేట్ సిండికేట్‌లోని ఓ కాంట్రాక్టర్ అక్కడకు వచ్చి ఆ ఎమ్మెల్సీతో మాట్లాడి తప్పు జరిగిందని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో ఎమ్మెల్సీ అమ్మవారి గుడికి వచ్చే భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించి అమ్మవారి దర్శనానికి వెళ్లారు. టోల్‌గేట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వాహనదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి వలన దేవస్థానం ప్రతిష్ఠ దెబ్బతింటుందని పలువురు వాహనదారులు చెబుతున్నారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు స్పందించి టోల్‌గేట్ సిబ్బందిపై దృష్టి సారించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ఇగ్నోలో అత్యుత్తమ విద్యాబోధన: డీఆర్ శర్మ

వన్‌టౌన్, ఏప్రిల్ 14: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో) నాణ్యతా ప్రమాణాలతో అత్యుత్తమ విద్యాబోధన చేస్తోందని విజయవాడ ప్రాంతీయ కేంద్ర డైరెక్టర్ డీఆర్ శర్మ అన్నారు. కేబీఎన్ కళాశాలలోని ఇగ్నో స్టడీ సెంటర్‌లో నూతన విద్యార్థుల చేరిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు సంపూర్ణంగా విజ్ఞానం అందించేందుకు వీలుగా కోర్సుల రూపకల్పన ఉందన్నారు, 30 ఏళ్లకు పైగా ఉన్నత విద్యా వ్యాప్తికి ఇగ్నో ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇగ్నోలో బోధనా పద్ధతుల్లో నాణ్యత కారణంగా నాక్ నుంచి ఏ డబుల్ ప్లస్‌గ్రేడ్ వచ్చిందని డిప్యూటీ డైరెక్టర్ బి.ప్రసాద్‌బాబు అన్నారు. స్టడీ సెంటర్‌లో క్రమం తప్పకుండా తరగతులు కొనసాగుతుంటాయని, మంచి సదుపాయాలు ఉన్నాయని స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ ఎన్.సాంబశివరావు తెలిపారు. స్టడీ సెంటర్ సమన్వయకర్తలు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, రీజినల్ సెంటర్ అసిస్టెంట్ కో-ఆరినేటర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ పాల్గొన్నారు.

దుర్గగుడిలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

వన్‌టౌన్, ఏప్రిల్ 14: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో పలువురు ఉద్యోగులకు అంతర్గత బదిలీలు జరిగాయి. ఇటీవల ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, అర్చకుల అంతర్గత బదిలీలు జరిగాయి. పాలన సౌలభ్యం కోసం సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇంకా దిగువస్థాయి సిబ్బందిని అంతర్గత బదిలీలు చేశారు. సీనియర్ అసిస్టెంట్లు జి.సతీష్‌కుమార్‌ను సెక్రటేరియట్ నుంచి దేవస్థానంలోకి తీసుకొచ్చారు. ఈవో పేషీతో పాటు సరుకుల స్టోర్, స్టాక్ రిజిస్టర్ మెయింటెనెన్స్, ఈ-ప్రొకూర్‌మెంట్ టెండర్స్ విభాగానికి మార్చారు. కె.సీతారామయ్యను అన్నవరం నుంచి దేవస్థానానికి తీసుకొచ్చారు. లడ్డూ ప్రసాదాల తయారీ, ఫైల్స్ నిర్వహణ, ప్రసాదం స్టాక్ మెయింటెనెన్స్‌కు వేశారు. బి.నాగరాజు, జయకామేశ్వరి, పి.శిరిష, వీవీ రమణలను ఇప్పుడున్న వారి స్థానంలో మరో విభాగాలకు బదిలీ వేశారు. జూనియర్ అసిస్టెంట్లు ఎన్.వి.దుర్గారావు, ఎ.జ్యోతిశ్రీ, టి.లక్ష్మీకుమార్, ఎ.శుభకర్, ఆర్.శ్రీలత, టీఎస్ రామ్‌జీ, పి.జి.రాజులను వివిధ విభాగాలకు బదిలీ చేశారు. అటెండర్ కె.వీరబాబును ట్రస్ట్‌బోర్డు నుంచి తప్పించి టోల్‌గేట్ వద్ద నియమించారు. ఎన్ఎంఆర్ కర్రి రమేష్‌ను ట్రస్ట్‌బోర్డు నుంచి తప్పించి విజయవాడ రైల్వేస్టేషన్‌లోని ప్రసాదాల కౌంటర్‌కు మార్చారు. ఎన్ఎంఆర్ వీసీ హెచ్ ఎస్ఎస్ అప్పారావును అన్నదానం హాలు నుంచి ఇంజనీరింగ్ విభాగానికి సరెండర్ చేశారు. ఎస్.వెంకటేశ్వరరెడ్డిని రూ.500 టికెట్ స్కానింగ్ పాయింట్‌కు మార్చారు. సీహెచ్ నాగస్వామిని రూ.500 టికెట్ కౌంటర్‌కు మార్చారు. సస్పెన్షన్‌లో ఉన్న వి.నగేష్‌ను కొలనుకొండలోని పట్టాభి రామస్వామి ఆలయానికి బదిలీ చేశారు.

అనధికార దర్శనాలు చేయిస్తున్న కానిస్టేబుల్‌పై విచారణ

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 13వ తేదీన కానిస్టేబులా..మజాకా శీర్షికన వచ్చిన కథనంపై స్పందించిన ఈవో రామారావు విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా ఈఈ కే.వీ.ఎస్ఆర్ కోటేశ్వరరావును నియమించారు. ఓ కానిస్టేబుల్ దేవస్థానంలో పోలీస్ ఉన్నతాధికారుల పేర్లు చెప్పి పదుల సంఖ్యలో భక్తులను అనధికారికంగా తీసుకువెళ్లి దర్శనాలు చేయిస్తున్నాడని అడ్డుకుంటున్న ఉద్యోగులు, అర్చకులపై బెదిరింపులకు దిగుతున్నాడని పలువురు ఉద్యోగులు చేస్తున్న ఆరోపణలపై కథనం వచ్చింది. ఈ కథనంపై స్పందించిన ఈవో విచారణాధికారిని నియమిస్తూ మూడురోజుల్లో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

వన్‌టౌన్, ఏప్రిల్ 14: కృష్ణలంక బాలాజీనగర్ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం రోడ్డు దాటుతున్న ఆటోడ్రైవర్ బత్తుల కృష్ణ(40)ను బెంజిసెంటర్ వైపు నుంచి వస్తున్న భీమవరం డిపో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఎలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. రాణిగారితోట తారకరామనగర్ పుష్కర మెట్ల వద్ద కృష్ణ, భార్య, ఇద్దరు కుమారులతో ఉంటున్నారు. కృష్ణలంక పోలీసులు వివరాలు సేకరించారు.

జనం దృష్టిని మరల్చేందుకే

జగన్‌పై రాళ్ల దాడి: కొలనుకొండ శివాజీ

వన్‌టౌన్, ఏప్రిల్ 14: జనం దృష్టిని మరల్చేందుకే జగన్‌పై రాళ్ల దాడి జరిగిందని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ అన్నారు ఆదివారం గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ నాయకురాలు షర్మిల ప్రచారం చేస్తుంటే అడ్డుకుంటున్నారని తెలిపారు. కోడి కత్తి సంఘటన తరహాలోనే నాటకీయంగా జనం దృష్టిని మరల్చేందుకే జగన్‌పై రాళ్లదాడి జరిగిందన్నారు. సీఎం భద్రతా ఏర్పాట్లలో లోపం కనిపిస్తోందని, ఇందుకు డీజీపీ, విజయవాడ సీపీ బాధ్యత వహించాలని అన్నారు.

బహుజనులు జగన్‌ను నమ్మొద్దు: గురునాథం

విద్యాధరపురం, ఏప్రిల్ 14: రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని బహుజనులు జగన్‌ను నమ్మవద్దని సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం సూచించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిని కక్షపూరితంగా అణచివేసి రాష్ట్రాన్ని మూడుముక్కలు చేయాలని జగన్ అనుకున్నాడన్నారు. ఇందుకోసం బహుజనులను రాజకీయ లబ్ధికోసం వాడుకున్నాడని మరల మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చి మరల అధికారంలోకి రావడం కోసం బహుజనులను ఇబ్బందులకు గురిచేశాడన్నారు. మూడు రాజధానుల పేరుతో సజ్జల రామకృష్ణారెడ్డి వసూలు చేసిన వందకోట్ల రూపాయలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.

190 కేజీల గంజాయి పట్టివేత

గుణదల, ఏప్రిల్ 14: గూడవల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గన్నవరం నుంచి విజయవాడ వస్తున్న ఐచర్ వాహనంలో 190 కేజీల గంజాయి ఆదివారం పట్టుబడిందని పటమట సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఐరన్ లోడుతో వెళుతున్న లారీని ఆపి తనిఖీ చేయగా అందులో గంజాయిని గుర్తించామన్నారు. లారీని పటమట పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రంథాలయ శాస్త్ర శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట, ఏప్రిల్ 14: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర గ్రంథాలయశాఖ ఉత్తర్వుల మేరకు 2024 జూన్ నుంచి గ్రంథాలయ శాస్త్రంలో సర్టిఫికెట్ కోర్సు(సీఎల్ఎస్‌సీ) తరగతులు నిర్వహిస్తున్నట్లు పాతూరి నాగభూషణం గ్రంథాలయం శిక్షణాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. 18ఏళ్లు నిండి ఇంటర్‌లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేయడానికి అర్హులని, శిక్షణ కాలం 5 నెలలు అని, పాఠాలు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలల్లో బోధిస్తారని, ప్రభుత్వ రిజర్వేషన్లు పాటిస్తూ ఇంటర్ మార్కుల ప్రాతిపదికగా ఎంపిక చేస్తారని తెలిపారు. ఇది రెగ్యులర్ కోర్సు అని, రోజూ తరగతులకు హాజరవ్వాలని, శిక్షణానంతరం పరీక్షలు నిర్వహించి ప్రభుత్వం సర్టిఫికెట్లు అందజేస్తుందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఏపీఎల్ఎస్.కామ్.ఇన్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, వివరాలకు 7995313148, 9290670671లలో సంప్రదించాలని ఆమె సూచించారు.





అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాంఘిక సంక్షేమ అధికారులు, కలెక్టర్ ఢిల్లీరావు, విద్యుత్ శాఖ విజయవాడ సర్కిల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, ఎస్‌కేసీవీ చిల్డ్రన్ ట్రస్ట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్టేట్ బ్యాంక్ డీజీఎం మనీష్ కుమార్ సింగ్, ఉద్యోగులు, పాలఫ్యాక్టరీ వద్ద విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

బడుగుల అభ్యున్నతికి పాటుపడిన

మహనీయుడు అంబేడ్కర్

ఘనంగా అంబేడ్కర్ జయంతి ● నివాళులర్పించిన అధికారులు, నాయకులు, న్యాయాధికారులు

కృష్ణలంక, ఏప్రిల్ 14: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన యావత్ ప్రపంచానికే ఆదర్శనీయుడని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో డీఆర్వో శ్రీనివాసరావుతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు.

స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్

గవర్నర్‌పేట: అంబేడ్కర్ భావజాలం, ఆలోచనా విధానం నేటితరం నేతలకు స్ఫూర్తిదాయకమని సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ కె.హర్షవర్థన్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్-బాబూ జగ్జీవన్‌రామ్ ఐక్య భవన్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి, వేదిక వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొని ధైర్యంతో ముందుకు సాగి ఉన్నత శిఖరాలకు చేరుకున్న అంబేడ్కర్ చరిత్ర నేటి తరం పేద వర్గాల విద్యార్థులకు స్ఫూర్తిని అందిస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశాన్ని సరైన దిశగా ముందుకు తీసుకువెళ్లడంలో అంబేడ్కర్ కీలక పాత్ర వహించారని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ బాటలో నడవడం ద్వారా ఆయనకు నిజమైన నివాళిని అర్పించిన వారమౌతామని అన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ కృష్ణమోహన్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి విజయభారతి, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ ఎస్.చినరాములు, లిడ్‌క్యాప్ ఎండీ డోలాశంకర్, వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో..

స్వరాజ్యమైదాన్ సమీపంలోని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ సర్కిల్ ఆఫీస్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి సంస్థ చైర్మన్ అండ్ ఎండీ కె.సంతోషరావు పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్థ టెక్నికల్ డైరెక్టర్ బి.జయభారతరావు, విజయవాడ సర్కిల్ ఎస్ఈ ఎ.మురళీమోహన్, సర్కిల్ పరిధిలోని ఈఈలు, ఏడీఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో...

ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పాలఫ్యాక్టరీ వద్ద..

చిట్టినగర్: కృష్ణా మిల్క్ యూనియన్(విజయా డెయిరీ) ఆధ్వర్యంలో పాలఫ్యాక్టరీ వద్ద అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పాల ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో..

లబ్బీపేట: స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని ఎస్‌కేసీవీ చిల్డ్రన్ ట్రస్ట్‌లో ఆదివారం నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ డీజీఎం మనీష్ కుమార్ సింగ్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ట్రస్ట్, అమ్మప్రేమట్రస్ట్‌లకు నిత్యావసర వస్తువులు అందజేశారు. బ్యాంక్ అధికారులు నాగేశ్వరరావు, ఎస్ఈడబ్ల్యూ ఆఫీసు బేరర్స్, ఎస్‌బీఐవోఏ ఆఫీస్ బేరర్స్, ఎస్‌బీఐఎస్‌యూ ఆఫీస్ బేరర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబేడ్కర్, పూలే నేటి యువతకు ఆదర్శం: పేరం శివనాగేశ్వరరావు

ధర్నాచౌక్: అంబేడ్కర్, పూలేలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, మన పాలకులనే మనమే ఓటు ద్వారా ఎన్నుకునే అవకాశం కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే) విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి పేరం శివనాగేశ్వరరావు అన్నారు. అంబేడ్కర్, జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఓబీసీ చైర్మన్ పరాశ రంగనాథ్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు జువ్వాజి ఫణీంద్ర కుమార్, షేక్ మస్తాన్‌వలీ, కాపా కల్యాణ్‌కుమార్, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ జీవిత చరిత్ర విశేషాల ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న న్యాయాధికారులు

సమసమాజ నిర్మాణమే

అంబేడ్కర్ ఆశయం

● మూడో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయాధికారి బి.సత్యవెంకట హిమబిందు

విజయవాడ లీగల్, ఏప్రిల్ 14: సమసమాజ నిర్మాణమే అంబేడ్కర్ ఆశయమని మూడో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయాధికారి బి.సత్యవెంకట హిమబిందు తెలిపారు. ఆదివారం బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హిమబిందు, ఏడో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.నాగేశ్వరరావు, ఎనిమిదో జిల్లా న్యాయాధికారి డి.లక్ష్మి, 14వ జిల్లా న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని, ఎంపీ, ఎమ్మెల్యేల కోర్టు న్యాయాధికారి గాయత్రి, నాలుగో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోమలవల్లి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాం ప్రసాద్ మాజీ బార్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా పాల్గొన్నారు. బార్ ఆవరణలో ఎగ్జిబిషన్‌ను న్యాయాధికారి హిమబిందు ప్రారంభించి అంబేడ్కర్ జీవితచరిత్ర ఫొటోలు, పుస్తకాలు పరిశీలించారు. బార్ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.



6వ డివిజన్‌లో వైసీపీ, ఇతర పార్టీల నుంచి 100మందిని టీడీపీలో చేర్చుకుంటున్న గద్దె రామ్మోహన్

100 మంది టీడీపీలో చేరిక

గుణదల, ఏప్రిల్ 14: ఐదేళ్లుగా అనేక మంది ఉపాధి కోల్పోయి ఎంతో నష్టపోయారని, 2024లో టీడీపీ అధికారంలోకి రావాలన్న ఆకాంక్షతో ప్రజలు ఉన్నారని తూర్పు నియోజకవర్గం కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని 6వ డివిజన్‌లో పార్టీ డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 40మంది, కళింగ సామాజిక వర్గానికి చెందిన దానబోయిన సదానందం ఆధ్వర్యంలో కమ్యునిస్టు పార్టీ ఇతర పార్టీల నుంచి మరో 70 మొత్తం 100 మంది గద్దె రామ్మోహన్ సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. ఉపాధిలేక మధ్యతరగతి వారు ఆర్థికంగా దెబ్బతిన్నారని, మరోమారు వైసీపీ అధికారంలోకి వస్తే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని భావించిన అనేకమంది నేడు టీడీపీ కూటమికి మద్దతు తెలుపుతున్నారని గద్దె అన్నారు. బొప్పన భవకుమార్, ముమ్మనేని ప్రసాద్, పొనుగుమాటి మోహనరావు, పల్లి దుర్గారావు, పిట్ల గోవింద్, అమిర్నేని కరుణ, గుమ్మడి గురుప్రసాద్, పడ్లేపల్లి కేశవ్, షేక్ షకీలా, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరువును బజారు కీడుస్తున్న వైసీపీ నేతలు: గద్దె రామ్మోహన్

పటమట: కృష్ణాజిల్లా అంటే దేశంలో ఎంతో గౌరవం ఉండేదని, అటువంటి జిల్లా ప్రతిష్ఠను వైసీపీ నాయకుల బజారు కీడుస్తున్నారని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం 12వ డివిజన్ పప్పులమిల్లు సెంటర్‌లోని మెగా ఎస్టేట్‌వాసులతో గద్దె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శివనాథ్‌ను గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్రం విడిపోవడంతో కొత్త రాష్ట్ర రాజధానిగా వచ్చిన అమరావతిని వైసీపీ నాయకులు సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. విజనరీగా ప్రపంచస్థాయి గుర్తింపు ఉన్న చంద్రబాబును కృష్ణాజిల్లా నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడి పరువు తీస్తున్నారని ఆయన అన్నారు. జిల్లా నుంచి పుచ్చలపల్లి సుందరయ్య, కాకాని వెంకటరత్నం, మండలి వెంకటకృష్ణారావు, పిన్నమనేని కోటేశ్వరరావులు సినిమాల్లో ఎన్టీఆర్, నాగేశ్వరావు, శోభన్‌బాబు, సావిత్రి, ఘంటశాల వంటి వారు జిల్లా ప్రతిష్ఠను పెంచారని, వైసీపీ నాయకుల తీరుతో జిల్లావాసులమని చెప్పుకోవడానికి సిగ్గుపడాల్సి వస్తోందన్నారు. బొప్పన భవకుమార్, పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, ముమ్మనేని ప్రసాద్, యలవర్తి శేషగిరి, నరేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే సైకిల్‌కే ఓటు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఏప్రిల్ 14: అమరావతిని అభివృద్ధి చేసుకుని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలంటే వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. 4వ డివిజన్‌లోని ఏపీఐఐసీ కాలనీలో కాలనీ అధ్యక్షుడు పాతూరి సాంబశివరావు అధ్యక్షతన డివిజన్ వాసులతో ఆదివారం గద్దె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనసేన, బీజేపీ నాయకులతో పాటు టీడీపీ నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రజలను కోరారు.

కోడికత్తి డ్రామా ఆడి సానుభూతితో గెలిచారు

2019లో వైఎస్ వివేకానందరెడ్డిని గొడ్డలితో నరికి చంపారని, జగన్ టీవీలో మొదట గుండెపోటుతో చనిపోయారని, తర్వాత రక్తం కక్కుకుని చనిపోయారని ప్రసారం చేశారని గద్దె అన్నారు. వివేకానంద కుమార్తె సునీత సంఘటన ప్రాంతానికి వచ్చి పరిశీలించిన తర్వాత గొడ్డలితో నరికి చంపారని బహిర్గతం చేశారన్నారు. కోడి కత్తితో దాడి చేయించుకుని డ్రామాలు ఆడటం వల్లనే సానుభూతి పొంది 151 అసెంబ్లీ సీట్లు పొందారన్నారు. నిన్న సింగ్‌నగర్‌లో జగన్‌పై గులకరాయితో దాడి చేశారని చెప్పుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి పర్యటన చేస్తున్నప్పుడు విద్యుత్ ఎలా కట్ అవుతుందన్నారు.

గులకరాయితో ప్రమాదమా?

"గతంలో చంద్రబాబు యాత్ర చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై రాళ్లదాడికి పాల్పడిన సమయంలో గులకరాయితో చంద్రబాబే దాడి చేయించుకున్నారని, చంద్రబాబు పావురమా, పిట్టా.. గులకరాయి తగిలి చనిపోవడానికి అని కొడాలి నాని వ్యంగ్యంగా మాట్లాడారు. ఇప్పుడు జగన్ పై ఆకతాయి చిన్నరాయి విసిరితే వైసీపీ నాయకులు ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నారు." అని గద్దె ప్రశ్నించారు.

అవినాశ్‌ను నమ్మొద్దు: బొప్పన భవకుమార్

ఒక సారి ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రెండు వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులను గద్దె రామ్మోహన్ చేశారు. ఏ రోజు ఇదంతా నేనే చేశానని గద్దె రామ్మోహన్ ఎక్కడ చెప్పుకోలేదు. ఇప్పుడు వైసీపీ అధికారంలోకి వచ్చాక 10, 20లక్షల రూపాయలతో చిన్నా చితకా రోడ్డు వేసి తానే ఈ రోడ్డు వేశానని నాకే ఓట్లు వేయాలని అవినాశ్ అడుగుతున్నారు. అలాంటి వారిని నమ్మొద్దు." అని భవకుమార్ అన్నారు. 4వడివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు. బీజేపీ నాయకుడు పి.నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు గొల్లపూడి నాగేశ్వరావు, ముమ్మనేని ప్రసాద్, అడపా నాగేంద్ర, జాస్తి సతీష్, బాస్కర్, పలువురు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

జగన్ డ్రామాలను ప్రజలు నమ్మరు: బొండా ఉమా

పాయకాపురం, ఏప్రిల్ 14: ప్రతి ఎన్నికలకూ ముందు ఓట్ల కోసం ప్రజల్లో సానుభూతి పొందేందుకు జగన్ ఏదో ఒక విషయాన్ని తెరపైకి తెస్తున్నారని, కాలం చెల్లిన డ్రామాలను ప్రజలు నమ్మరని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన చేస్తే దాడి జరగడం విచిత్రంగా ఉందన్నారు. ఇది ముమ్మాటికి పోలీసు, భద్రతా వైఫల్యమే అని విమర్శించారు. ముఖ్యమంత్రి పర్యటిస్తుంటే ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం మరిన్ని అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై రాష్ట్ర డీజీపీ, ఇంటిలిజెన్స్ ముఖ్య అధికారులు బాధ్యత వహించాలన్నారు.

నగరాభివృద్ధే కూటమి లక్ష్యం: సుజనాచౌదరి



పశ్చిమ నియోజకవర్గంలో నివాసముంటున్న నెల్లూరు, ప్రకాశం జిల్లావాసుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సుజనా చౌదరి

భవానీపురం, ఏప్రిల్ 14: పశ్చిమ నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎన్డీయే కూటమి పనిచేస్తుందని పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వై. సుజనా చౌదరి హామీ ఇచ్చారు. పాములపాటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో సితార సెంటర్‌లోని కన్వెన్షన్ హాల్లో నెల్లూరు, ప్రకాశం ప్రాంత వాసులు, శ్రేయాభిలాషుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. సుజనా చౌదరి, కేశినేని చిన్ని హాజరయ్యారు. పశ్చిమలో అత్యధికంగా నెల్లూరు, ప్రకాశం ప్రాంతాల ప్రజలు నివసిస్తున్నారని, వారందరి సంక్షేమం కోసం పనిచేస్తానని, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానని సుజనా హామీ ఇచ్చారు. ఈ రెండు జిల్లాల వాసులతో పాటు పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరూ తమని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేశినేని చిన్ని మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అత్యధిక స్థానాలతో ఏపీలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాజేంద్రకుమార్, అల్లు మధుసూదనరావు, చుంచు సురేష్, నాగుల్ మీరా, అడ్డూరి శ్రీరామ్, పైలా సోమినాయుడు, ఎంఎస్.బేగ్, అమ్మిశెట్టి వాసు, రజనీపాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణలో పీవో, ఏపీవోల పాత్ర కీలకం

● అన్ని అంశాలపై స్పష్టమైన అవగాహన అవసరం

● నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి: కలెక్టర్ ఢిల్లీరావు



పీవో, ఏపీవోలకు బ్యాలెట్ యూనిట్ పనితీరును వివరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 14: అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికలను నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారులు (పీవో), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో)ల పాత్ర కీలకమని, అన్ని అంశాలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకొని నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. ఆదివారం విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమం జరిగింది. లయోలా కళాశాలలో విజయవాడ తూర్పు నియోజకవర్గ పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమం జరిగింది. అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు (ఎఎల్ఎంటి) ద్వారా జరుగుతున్న రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వీడియో ప్రదర్శన ద్వారా వివిధ అంశాలపై ట్రైనర్లు శిక్షణ ఇవ్వగా, ఆయా అంశాలపై పీవోలు, ఏపీవోల అవగాహన స్థాయిని కలెక్టర్ పరీక్షించారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఎదురయ్యేందుకు అవకాశముందని, వాటిని అప్పటికప్పుడు ఎలా అధిగమించాలనే దానిపై మార్గనిర్దేశనం చేశారు. నిర్వర్తించాల్సిన విధులను క్రమశిక్షణతో తెలుసుకొని, ఆత్మవిశ్వాసంతో పోలింగ్ ప్రక్రియకు సిద్ధమవ్వాలన్నారు. పోలింగ్ సెటప్, ఈవీఎం-వీవీప్యాట్, మార్క్‌డ్ కాపీ, టెండర్డ్ ఓట్, ఛాలెంజ్డ్ ఓట్, పీఓ డైరీ, పీఓ రిపోర్ట్ తదితరాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వివిధ ఫారాలు, రిజిస్టర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఎన్నికల విధులను విజయవంతంగా పూర్తిచేసేందుకు అవసరమైన అవగాహన పెంపొందించుకొనేందుకు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్, విజయవాడ ఆర్డీఓ, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఆర్ఓ బీహెచ్.భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజధానిని విస్మరించిన ప్రభుత్వం: సీహెచ్ బాబూరావు



58వ డివిజన్‌లో పర్యటిస్తున్న బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 14: రాజధాని అమరావతి, విజయవాడ నగరాభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. 58వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శనివారం నిర్వహించిన సీఎం జగన్ బస్సు యాత్రలో నగర సమస్యలపై వైసీపీ నేతలు, సీఎం జగన్ నుంచి తగు సమాధానం వస్తుందని ప్రజలు ఆశించారని అన్నారు. "జగనన్న ఇళ్ల నిర్మాణం ఎందుకు జరగలేదు. టిడ్కో ఇళ్లు ఎందుకు ఇవ్వలేదు. నగరపాలక సంస్థకు నిధులు ఎందుకు పెండింగ్ పెట్టారు. రెండో ఫ్లైఓవర్, గుణదల ఫ్లైఓవర్, నీటి మీటర్లు, చెత్త, ఇంటి, డ్రెయినేజీ తదితర పన్నుల భారాలు ప్రభుత్వం పేదలపై మోపడం మాట తప్పడం కాదా?" అని ఆయన ప్రశ్నించారు. డిస్నీ ల్యాండ్‌లో కబేళా ఏర్పాటును నిలిపివేసి ఆ స్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరుతున్నా ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

ప్రారంభం

వన్‌టౌన్, ఏప్రిల్ 14: విజయవాడ ఫైర్‌స్టేషన్‌లో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. విజయవాడలోని ఏపీ ఫైర్‌సర్వీసెస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నతాధికారులు సిబ్బంది గౌరవవందనాన్ని స్వీకరించారు. జిల్లా అగ్నిమాపక అధికారి పీవీ రమణ, బి.మురళీ మోహన్, ఏవీ శంకర్ రావు, అదనపు జిల్లా ఫైర్ ఆఫీసర్లు జి.శ్రీనివాసులు, పి.ఉదయ్‌కుమార్, ఆర్.జ్ఞాన సుందరం పాల్గొన్నారు.

అతి వేగానికి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల బలి

- ఔటర్‌పై డివైడర్‌ను ఢీకొట్టి.. పల్టీ కొట్టిన కారు
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు.. మృతులు కాకినాడకు చెందిన వారు



ఔటర్ రింగ్‌రోడ్డు డివైడర్‌ను ఢీకొని నుజ్జునుజ్జు అయిన కారు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అతివేగానికి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు బలయ్యారు. ఔటర్ రింగురోడ్డుపై కారు డివైడర్‌ను ఢీకొని, పల్టీలు కొట్టడంతో అక్కడికక్కడే మరణించారు. మరో ముగ్గురు తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘోర ప్రమాదం ఆదివారం తెల్లవారుజామున హిమాయత్‌సాగర్ వద్ద ఔటర్ రింగురోడ్డుపై జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన గౌతంసాయి(24), ఆనంద్(31) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. గచ్చిబౌలిలోని ఓ కంపెనీలో పనిచేస్తున్న వీరు.. అదే ప్రాంతంలోని హాస్టల్‌లో ఉంటున్నారు. వారితో పాటు తనూజ, ప్రకాశ్, సూర్యతేజ శనివారం సాయంత్రం పీవై04ఏ8222 నంబరు కారులో గచ్చిబౌలి నుంచి శంషాబాద్‌లోని గేమింగ్ జోన్‌కు వెళ్లారు. తెల్లవారు జామున తిరిగి వస్తుండగా.. ఔటర్‌పై సూర్యతేజ కారు నడుపుతున్నాడు. వేగంగా నడపడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని, పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో గౌతం సాయి, ఆనంద్ అక్కడికక్కడే చనిపోయారు. తనూజ, ప్రకాశ్, సూర్యతేజ తీవ్రంగా గాయపడ్డారు. కారు పుదుచ్చేరి రిజిస్ట్రేషన్‌తో ఉందని, అది ఎవరిదనే వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఔటర్‌పై కారు ప్రమాదం కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. రాజేంద్రనగర్, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాగా, ప్రమాద స్థలంలో బీరు బాటిళ్లు, తినుబండారాలు పడి ఉండడంతో సూర్యతేజ మద్యం సేవించి కారు నడిపాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీ అయినా అధికారిక నివాసాల్లోనే..
పోలీసు అధికారులపై సీఈవోకు ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల విధుల నుంచి బదిలీ చేసిన పలువురు పోలీస్ అధికారులు విధుల నుంచి తప్పుకున్నా, అక్కడే అధికారిక నివాసాల్లో ఉంటూ అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని, వారిని వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. గుంటూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు శనివారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో రాష్ట్ర అదనపు ఎన్నికల ప్రధానాధికారి హరేంధిర ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చిలకలూరిపేటలో జరిగిన ప్రధాని మోదీ సభలో పోలీసుల నిర్లక్ష్య వైఖరి భద్రతా వైఫల్యాలు, శాంతిభద్రతల నియంత్రణలో ఉదాసీనత తదితర కారణాలతో గుంటూరు రేంజ్ ఐజీ పాల్‌రాజు, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, చిత్తూరు ఎస్పీ జాషువా, అనంతపురం ఎస్పీ అన్బురాజన్ తదితరులను కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసిందన్నారు. అయినా వారు క్యాంపు కార్యాలయాలను ఖాళీ చేయకుండా అక్కడే ఉంటూ వారి హయాంలో కింది స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులను అనధికారికంగా ఆదేశాలను జారీ చేస్తున్నారన్నారు. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు సుబ్బారావు తెలిపారు.

దళితులను జగన్ నిండా ముంచేశారు

- 27 పథకాలను రద్దు చేశారు.. టీడీపీ కూటమి నేతలు

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు దళితులకు మేలు చేస్తానని చెప్పిన జగన్ నిండా ముంచేశారని, దళితులతో బంధుత్వముందని నమ్మబలికి దళితుల ఓట్లును కొల్లగొట్టారని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఆరోపించారు. ఆదివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో కూటమి నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ... 'దళితుల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ వారిని అణిచివేతకు గురి చేశారు. చంద్రబాబు పెట్టిన 27 పథకాలనీ జగన్ రద్దు చేశారు. అన్నీ తీసేసిన జగన్ మీ బిడ్డ కాదని, క్యాన్సర్ గడ్డ అని గుర్తించాలి. అవినాశ్‌రెడ్డినే బిడ్డగా భావించి జగన్ కాపాడుకుంటున్నారు' అని ఆరోపించారు. బీజేపీ నేత ఆర్డీ విల్సన్ మాట్లాడుతూ... 'నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అని చెప్పుకునే జగన్ వారి పేరుతో ఓట్లను దండుకుని వారిని నట్టేట ముంచేశారన్నారు. నమ్మిన వారిని ముంచడమే జగన్ నైజం' అని అన్నారు. జనసేన నేత పెదపూడి విజయ్‌కుమార్ మాట్లాడుతూ... 'అంబేడ్కర్‌పై ప్రేమ, గౌరవం ఉన్నట్లు వైసీపీ నాయకులు నటిస్తున్నారని, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు పరిచారు' అని అన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి బీజేపీ భరోసా

- సంకల్ప పత్రపై సాదినేని యామినీ శర్మ

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమాన్ని, దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బీజేపీ సంకల్ప పత్ర (మేనిఫెస్టో) విడుదల చేసిందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామినీ శర్మ అన్నారు. భారత దేశాన్ని విశ్వగురుగా 2047 నాటికి చేయాలన్న సంకల్పంతో 24/7 శ్రమిస్తోన్న నరేంద్ర మోదీ 14 కీలక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం దేశానికి శుభపరిణామం అన్నారు. అన్ని ప్రాంతాల సంతులిత అభివృద్ధి, సాంకేతిక వికాసం, ప్రపంచ స్థాయి మౌలిక వసతుల రూపకల్పన, ఈజ్ ఆఫ్ డూయింగ్, సమృద్ధ భారత్, విశ్వబంధు, క్రీడా వికాసం వంటివి ఈ మేనిఫెస్టోలో కీలకమైనవని ఆమె వివరించారు. దేశంలోని పేదలు, రైతులు, మహిళలు, యువతకు పెద్దపీట వేశారని అన్నారు. 'పట్టణాల్లోని పేదల ఇళ్లకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా.. పేదల ఇంటి పైకప్పులో ఉచిత సోలార్ ఇచ్చి ఉత్పత్తయ్యే విద్యుత్ ద్వారా ఆదాయం కల్పించడం.. మూడు కోట్ల మందిని లక్షాధికారుల్ని చేయడం.. వింటుంటేనే ఎంతో ఆనందంగా ఉంది..' అని యామినీ శర్మ సంతోషం వ్యక్తం చేశారు. మరో ఐదేళ్లు 80 కోట్ల మందికి ఉచిత రేషన్, పదికోట్ల మంది రైతులకు పీఎం కిసాన్ కొనసాగింపు.. మూడు కోట్ల మంది మహిళలకు ఉచితంగా ఇళ్ల నిర్మాణంతో పాటు అన్నింటా దేశాన్ని బలోపేతం చేయడం, ప్రోత్సాహకాలు మరింత పెంచడం, ఉపాధి కల్పించడంపై సమతుల్యత చూపించారని కొనియాడారు.

వారంటీ లేని మోదీ గ్యారంటీ: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మోదీ గ్యారంటీ పేరుతో బీజేపీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోకి వారంటీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ఇచ్చిన అనేక గ్యారంటీలలో ఏవైనా అమలు చేసిందా? అని ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామంటూ బూటకపు మాటలు చెప్పి, వాటిని మూడింతలు పెంచిన ఘనత మోదీకే దక్కుతుందని విమర్శించారు. పేదల బాధలు పట్టించుకోకుండా కేవలం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడమే పనిగా పెట్టుకున్న మోదీ సర్కార్‌ను ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని రామకృష్ణ అన్నారు.

జగన్ మీద జరిగిన దాడిపై సమగ్ర విచారణ జరపాలి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై శనివారం రాత్రి విజయవాడలో జరిగిన రాయి దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. రాజకీయాల్లో విమర్శలు, ఆత్మవిమర్శలు ఉండాలేగాని భౌతికదాడులు తగవని పేర్కొన్నారు. దాడికి కారకులెవరైనా కఠినంగా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.



యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ పరీక్షలు విజయవంతం

అల్వాల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దేశీయ రక్షణ సామర్థ్యాలను పెంపొందించే దిశగా భారత్ గణనీయమైన పురోగతిని సాధించింది. తక్కువ బరువుతో మనిషి మోసుకెళ్లగలిగేలా.. స్వదేశీ పరిజ్ఞానంతో డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన 'మ్యాన్-పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్' (ఎంపీఏటీజీఎం) ఆయుధ వ్యవస్థకు క్షేత్రస్థాయి పరీక్షలను భారత సైన్యం విజయవంతంగా నిర్వహించింది. రాజస్థాన్‌లోని 'పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్' (పీఎఫ్ఎఫ్‌ఆర్) వద్ద నిర్వహించిన ట్రయల్స్ విజయవంతమయ్యాయని డీఆర్‌డీవో అధికారులు ఆదివారం వెల్లడించారు. ట్రయల్స్ సక్సెస్ కావడంతో భారత సైన్యంలో మరో ఆయుధ వ్యవస్థ చేరడానికి మార్గం సుగమమైంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఈ ఆయుధ వ్యవస్థను రూపొందించిందని అధికారులు తెలిపారు. ఎంపీఏటీజీఎం ఆయుధ వ్యవస్థలో లాంచర్లు, టార్గెట్ అక్విజిషన్ డివైజ్, ఫైర్ కంట్రోల్ యూనిట్ ఉన్నాయి. ఈ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో, భారత సైన్యాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. అత్యాధునిక సాంకేతికత ఆధారిత రక్షణ వ్యవస్థ అభివృద్ధిలో స్వావలంబన సాధించే దిశగా కీలక ముందడుగు పడిందని అన్నారు. "పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఈ నెల 13న వార్‌హెడ్ ఫ్లైట్ ట్రయల్స్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సమయంలో క్షపణి, వార్‌హెడ్ పనితీరు అద్భుతంగా ఉంది. ఈ పరీక్షలు భారత సైన్యం నిర్దేశించిన అవసరాలను తీర్చాయి" అని రక్షణశాఖ ఆదివారం వెల్లడించింది.

జగన్ సేవలో విద్యుత్ అధికారులు



- కోడ్‌ను ఉల్లంఘించి సీఎం బస్సుయాత్ర రూట్‌లో కొత్తగా పనులు
- ఈఆర్‌సీ అనుమతుల్లేకుండానే బందరులో వర్క్‌లు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న సీపీడీసీఎల్ సంతోష్‌రావు
- జగన్‌కు ఎన్నికల్లో మైలేజీ అందించడమే లక్ష్యం!

ఎన్నికల వేళ విద్యుత్ శాఖ అధికారులు ముఖ్యమంత్రి జగన్ సేవలో తరించిపోతున్నారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉందన్న విషయమే మరిచి.. రాత్రీ పగలూ తేడాలేకుండా ఏకంగా ఉన్నతాధికారులే తెగ కష్టపడిపోతున్నారు. తమ వద్ద పెండింగ్‌లో ఉన్న విద్యుత్ శాఖ చేపట్టాల్సిన వివిధ రకాల పనులన్నీ చకచకా పూర్తిచేస్తున్నారు. రైతులు, సామాన్యుల నుంచి వచ్చిన విన్నపాలు, డిమాండ్లను సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచి, సీఎం బస్సు యాత్ర రూట్ ఖరారయ్యాకే దాని పరిధిలోని పనులను పూర్తిచేస్తున్నారు. దీంతో జగన్ వస్తున్నారంటే తమ విన్నపాలు పరిష్కారమైపోతున్నాయని రైతులు, సామాన్యులు భావించేలా విద్యుత్ అధికారులు శక్తి వంచన లేకుండా దూసుకుపోతున్నారు. ఇప్పటికి రూ.90కోట్ల పనులు చేపట్టారు. తద్వారా ఎన్నికల్లో వైసీపీకి లబ్ధి చేకూర్చాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నారు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల కోడ్ తమ పనులకు వర్తించదన్న రీతిలో విద్యుత్ నియంత్రణ సంస్థ (ఈఆర్‌సీ) ఆమోదం లేకుండానే విద్యుత్‌శాఖ అధికారులు అత్యవసరం పేరిట కోట్లాది రూపాయల వర్క్‌లు చేపడుతున్నారు. లక్ష రూపాయలతో పూర్తయ్యేపనిని పాతిక లక్షలతో చేపట్టడం, రెండు కోట్లతో కొనే వస్తువును మూడు నాలుగు రెట్ల సొమ్ముతో కొనడం.. ఒకటేమిటి దోచుకునేందుకు అనేక దారులను వెతుక్కుంటున్నారు. ఇక జగన్ కోసమే చేపడుతున్న వర్క్‌లను ఎస్పీడీ సీఎల్ సీఎండీ, సీపీడీ సీఎల్ ఇన్‌చార్జిగా ఉన్న సంతోష్‌రావు స్వయంగా పర్యవేక్షిస్తుండడం విశేషం. వాస్తవానికి వ్యవసాయ అవసరాలు, ఇతర పనులకోసం కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని, ఇంకా సబ్‌స్టేషన్‌లు నెలకొల్పాలని రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖను నిత్యం కోరుతుంటారు. అవన్నీ కోట్లాది రూపాయల ఖర్చుతో కూడుకున్నవి. తమ అనుమతి తీసుకున్నాకే ఆ పనులు చేపట్టాలని ఈఆర్‌సీ విద్యుత్‌శాఖను పలుమార్లు ఆదేశించింది. ఈ పనులను రైతుల అవసరాలకు తగినట్లుగా వెంటనే విద్యుత్‌శాఖ చేపట్టలేదు. సుదీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టింది. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి. ప్రజలు, రైతులు, ఇలా ప్రతి ఒక్కరినీ ప్రసన్నం చేసుకునేందుకు ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ బస్సు యాత్ర రూట్‌లలో విద్యుత్ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న కీలకమైన వర్క్‌లను ముందుగానే పూర్తిచేయాలని ప్రభుత్వ పెద్దలు విద్యుత్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంచితరుణం మించిన దొరకదు అన్నట్లు.. విద్యుత్ శాఖ అధికారులు కూడా ఈ సమయం కోసమే ఎదురుచూస్తున్నట్లు పనులు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి భద్రత పేరిట చేపట్టే పనులకు వెంటనే టెండర్లు పిలవాల్సిన పనిలేదు. ఎంత ఖర్చుపెట్టయినా పనులు చేయవచ్చు. విద్యుత్ స్తంభాలు, లైన్లు, సబ్‌స్టేషన్‌లను ఎంత ఖర్చుతోనైనా పూర్తిచేయవచ్చు. ఈ క్రమంలో కొందరు అధికారులు అందినకాడికి దండుకుంటారు. ప్రశ్నించేవారు ఉండరు. ఇక అడ్డేముంది. అందుకే, జగన్ బస్సు యాత్ర రూట్‌లో అత్యవసర పనులు అనగానే చకచకా అనుమతులు, క్లియరెన్స్‌లు, బిల్లులు ఇలా ప్రతిదీ వేగంగానే జరిగిపోతోంది.



పనులను పరిశీలిస్తున్న సీపీడీసీఎల్ సంతోష్‌రావు

కోడ్ వర్తించదా?

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చాక ఇలాంటి పనులు చేపట్టడానికి వీల్లేదు. ఒక వేళ చేపట్టాలంటే ఈసీ అనుమతి, దాంతోపాటు ఈఆర్‌సీ అనుమతి కూడా తీసుకోవాలి. కానీ అధికారులు ఎన్నికల కోడ్ తమకు పట్టదని శరవేగంగా పనులు చేపడుతున్నారు. జగన్ బస్సుయాత్ర తిరిగిన రూట్‌లో ఇప్పటికే రూ.90 కోట్ల రూపాయల వర్క్‌లు చేశారు. ఇప్పుడు విగతా రూట్‌లలో అదే పనిచేయబోతున్నారు.

మచిలీపట్నం రూట్‌లో...

మచిలీపట్నం రూట్‌లో జగన్ బస్సు యాత్ర ఖరారయింది. ఆ రూట్‌లో పెండింగ్‌లో ఉన్న వర్క్‌లు చేపట్టారు. బందరు డివిజన్‌లో 6 కి.మీ మేర బస్సుయాత్ర సాగేలా రూట్ ఫిక్స్ చేశారు. బస్సు వెళ్లే ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేశారు. 181 ప్రాంతాల్లో 33 కేవీ లైన్లు కొత్తగా ఏర్పాటు చేయడంతో పాటు, మరమ్మతులు కూడా పూర్తిచేశారు. 24 ప్రాంతాల్లో 11కేవీ వర్క్‌లను పూర్తిచేశారు. ఆరుగొలను సబ్‌స్టేషన్ పరిధిలో 33, 11 కేవీ వర్క్‌లు పూర్తిచేయడంతోపాటు, కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ పనుల విలువ రూ.30 కోట్లపైనే ఉంటుందని తెలిసింది. ఎంత అత్యవసర పనులైనా ఈఆర్‌సీ ఆమోదం తీసుకోవాలి. కానీ, జగన్ సేవలో తరించుకుపోతున్న అధికారులు ఆ అనుమతులు తీసుకోకుండానే అధిక వ్యయంతో పనులు కానిచ్చేస్తున్నారని తెలిసింది. ఈ వర్క్‌లను సీపీడీసీఎల్ ఇన్‌చార్జి సీఎండీగా ఉన్న సంతోష్‌రావు అనే అధికారి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రాత్రీపగలూ తేడాలేకుండా పనులు జరిగే ప్రాంతాలను సందర్శిస్తూ సూచనలు చేస్తున్నారు.

కొవ్వూరు వైసీపీలో వర్గ విభేదాలు

- రెండు సామాజికవర్గాల మధ్య ఘర్షణ
- కాపులకు ప్రాధాన్యం ఇవ్వలేదన్నందుకు దాడి
- రోడ్డెక్కి కొట్టుకున్న నాయకులు



కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో ఘర్షణ పడుతున్న నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 14: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వైసీపీలో మరోసారి వర్గ విభేదాలు బయటపడ్డాయి. కొంత కాలంగా నియోజకవర్గంలో చాపకింద నీరులా ఉన్న రెండు సామాజికవర్గాల మధ్య పోరు ఒక్కసారిగా బహిర్గతమయ్యింది. ముఖ్యమంత్రి పర్యటన, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు నామినేషన్‌కు సంబంధించి కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో వేదికపై ఒక సామాజికవర్గానికే పెద్దపీట వేస్తున్నారని, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావును ఆహ్వానించరా అని పెద్దేవం ఉప సర్పంచ్ తోట రామకృష్ణ వేదికపై నాయకులను ఆహ్వానిస్తున్న వైసీపీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణను నిలదీశారు. పరిశీలకులు రాజీవ్‌కృష్ణ స్పందిస్తూ.. కంగారు పడకండి అందరినీ పిలుస్తామని అనడంతో రామకృష్ణ వాగ్వాదానికి దిగారు. దీంతో రామకృష్ణ పై గతంలో హోంమంత్రి తానేటి వనితను వ్యతిరేకించిన వర్గం నాయకులు మూకుమ్మడిగా దాడిచేశారు. నియోజకవర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ, ఎమ్మెల్యే తలారి వెంకట్రావుల ఎదుటే నాయకులు బాహాబాహీకి దిగారు. దీంతో కల్యాణ మండపం నుంచి బయటకు వచ్చేసిన తోట రామకృష్ణపై మరోసారి దాడి జరిగింది. రోడ్డెక్కి మరీ కొట్టుకున్నారు. ఈ సంఘటనతో వేదికపై ఉన్న నాయకులంతా ఒక్కసారిగా విస్తుపోయారు. ఈ ఘర్షణపై తోట రామకృష్ణ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు కలిగిన కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని నియోజకవర్గ పరిశీలకులుగా నియమించాలని ఇటీవల కాపు సామాజికవర్గ నేతలంతా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌లను కోరామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తనపై దాడి చేసి షర్ట్ చింపేశారన్నారు. హోంమంత్రి తానేటి వనితను వ్యతిరేకించిన వారే దాడికి పాల్పడ్డారన్నారు. తమ సామాజికవర్గానికి జరిగిన అన్యాయంపై భవిష్యత్ కార్యాచరణ తెలియజేస్తామన్నారు. బండి పట్టాభి రామారావు మాట్లాడుతూ కొవ్వూరు వైసీపీలో కాపు సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు.

యూనివర్సల్ హెల్త్‌కేర్ విధానాన్ని తెస్తాం

- కేరళ తరహా నర్సింగ్ విద్యను ప్రోత్సహిస్తాం
- ఏపీని ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- వైద్యులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో నారా లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దశల వారీగా యూనివర్సల్ హెల్త్‌కేర్ విధానాన్ని అమలులోకి తెస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రకటించారు. రాష్ట్రంలో ఓ ఒక్క పౌరుడికీ ఆర్థిక భారం పడకుండా, మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలన్నదే టీడీపీ విధానమని స్పష్టం చేశారు. ఇందుకోసం ఇతర దేశాలు, పొరుగు రాష్ట్రాల్లో హెల్త్‌కేర్ విధానాలను అధ్యయనం చేసి, ఏపీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై, ఆదివారం వారితో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా లోకేశ్ భేటీ అయ్యారు. 'డాక్టర్లు అహర్నిశలు ప్రజలకు సేవలందిస్తున్నారు. కరోనా సమయంలో వారు ప్రాణాలకు తెగించి, ప్రజలకు అద్భుతమైన సేవలందించారు. ఏపీకి కరోనాతో పాటు జగనోరా వైరస్ వచ్చింది. జగన్ విధ్వంసకర విధానాలు కళ్లారా చూశాం. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలు తీవ్రంగా నష్టపోయాయి. ఎన్టీఆర్ అంటే రాజశేఖర్‌రెడ్డికి కూడా గౌరవం. జగన్ మాత్రం కక్షపూరితంగా వ్యవహరించి, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పేరును హఠాత్తుగా మార్చారు. వర్సిటీ నిధులను పక్కదారి పట్టించారు. జగన్ సర్కార్ ఆరోగ్యశ్రీ కింద రూ.1,400కోట్లు బకాయి పెట్టి, ఆసుపత్రుల యాజమాన్యాలను ఇబ్బంది పెట్టడం దారుణం. కొవిడ్ సమయంలో మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వేధించి చంపారు. ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం తెస్తాం. కేరళ తరహాలో నర్సింగ్ విద్యను ప్రోత్సహిస్తాం. మహిళల ఉన్నత విద్యాభ్యాసం, నైపుణ్యం పెంపునకు 'కలలకు రెక్కలు' పేరుతో వడ్డీ లేని రుణాలివ్వాలని నిర్ణయించాం. మా ప్రథమ ప్రాధాన్యత ఉద్యోగ కల్పన. 20లక్షల ఉద్యోగాల లక్ష్యానికి చేరుకుంటే.. ఏపీ ఎకానమీ రెండున్నర రెట్లు పెరుగుతుంది. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. లక్ష్యానికి చేరుకుంటే కోటి ఉద్యోగాలు లభిస్తాయి. తద్వారా ప్రజలకు మెరుగైన విద్య, వైద్య సౌకర్యాలు కల్పించడానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరందిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతాం. వచ్చే ఐదేళ్లు కరెంటు చార్జీలు పెంచం. మొదటి వంద రోజుల్లో గంజాయిని అరికడతాం. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే. ప్రజలను చైతన్యవంతం చేయడంలో డాక్టర్లు కీలకపాత్ర పోషించాలి' అని లోకేశ్ కోరారు. రాష్ట్రంలో వైద్య రంగానికి నిధుల కేటాయింపును పెంచాలని ఐఎంఏ ఎలెక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ నందకిశోర్ కోరారు. యువ వైద్యులకు భరోసా కల్పించాలని ఐడీఏ ఏపీ కార్యదర్శి అజయ్ బెనర్జీ కోరారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్లు ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని టీడీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో రాష్ట్రం ఏవిధంగా నష్టపోయిందో ప్రజలు తెలుసుకోవాలని డాక్టర్ శ్రీదేవి సూచించారు. వైద్యులు రాకేష్, సురేష్, రవిరామ్, శ్రీధర్ తదితరులు మాట్లాడారు.

టీడీపీ నేతలకు ఎన్నికల ప్రత్యేక బాధ్యతలు

ప్రస్తుత ఎన్నికలకు సంబంధించి కొందరు టీడీపీ నేతలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. వీరి నియామకాలపై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని రాయలసీమ జిల్లాల ఎన్నికల సమన్వయకర్తగా నియమించారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డిని నంద్యాల పార్లమెంటు ఎన్నికల సమన్వయకర్తగా, నిమ్మల కిష్టప్పను అనంతపురం పార్లమెంటు ఎన్నికల సమన్వయకర్తగా, కర్నూలు సిటింగ్ ఎంపీ సంజీవ్ కుమార్‌ను కోడుమూరు, ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకునిగా, మాజీ ఎమ్మెల్యే దివి శివరాంను దెందులూరు పరిశీలకునిగా, మరో మాజీ ఎమ్మెల్యే ఎన్‌సీవీ నాయుడును ఆత్మకూరు పరిశీలకునిగా, ఎమ్మెల్సీ బీటీ నాయుడును కర్నూలు పార్లమెంటు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజులను హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్తలుగా నియమించారు. సీనియర్ నేత సోమిసెట్టి వెంకటేశ్వర్లును ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలకు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శీతంరాజు సుధాకర్‌ను విశాఖ ఉత్తరానికి, కేవీ సుబ్బారెడ్డిని ఆళ్లగడ్డ నియోజకవర్గానికి, వేనాటి సతీశ్ రెడ్డిని ఉదయగిరికి, మల్లెల రాజేశ్ నాయుడును గుంటూరు పశ్చిమ, దాసరి నరసింహమూర్తిని పుట్టపర్తికి, ముప్పవరపు వీరయ్య చౌదరిని చీరాల నియోజకవర్గానికి పరిశీలకులుగా నియమించారు.

49 మందికి పార్టీ పదవులు

అనంతపురం అర్బన్‌కు చెందిన వైకుంఠం ప్రభాకర్‌చౌదరిని జాతీయ ప్రధాన కార్యదర్శిగా, అనకాపల్లికి చెందిన దాడి వీరభద్రరావును ఎన్నికల సంఘం, పత్రికా సమావేశాల సమన్వయకర్త(కేంద్ర కార్యాలయం), పెదకూరపాడుకు చెందిన కొమ్మాలపాటి శ్రీధర్‌ను నరసరావుపేట పార్లమెంట్ పార్టీ అధ్యక్షునిగా, కావలికి చెందిన మాలేపాటి సుబ్బానాయుడిని రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షునిగా నియమించారు.

గులకరాయి పడితే హత్యాయత్నం కేసా..!

ఆ వంకతో టీడీపీ కార్యకర్తలను ఇబ్బందిపెడితే ఊరుకోం: వర్ల

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): 'జగన్‌పై చిన్న గులక రాయి పడితే హత్యాయత్నం కేసు రిజస్టర్ చేశారు. ఈ వంకతో టీడీపీ కార్యకర్తల్ని ఇబ్బంది పెట్టాలనే ప్రయత్నం చేస్తున్నారు' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. హత్యాయత్నం మిషతో ఎవరినైనా ఇబ్బంది పెడితే టీడీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. 'అధికారం కోల్పోవడం ఖాయమని జగన్‌కు అర్థమైంది. అందుకే తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రజల్ని మాయ చేసి, మభ్య పెట్టి, భ్రమలో పెట్టాలని ప్రయత్నిస్తున్నాడు. అందుకే తనపై ఎవరో రాయి వేసి చంపాలని చూశారని స్టేజ్ డ్రామా సృష్టించారు' అని వర్ల పేర్కొన్నారు. కాగా, 'సీఎం జగన్‌పై రాయి దాడిపై ఎన్నికల కమిషన్ తక్షణం స్పందించాలి. దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలి' అని అచ్చెన్నాయుడు పలాసలో డిమాండ్ చేశారు.

సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద బిష్ణోయ్ గ్యాంగ్ కాల్పులు

ముంబై, ఏప్రిల్ 14: బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద కాల్పుల కలకలం రేగింది. ముంబైలోని బాంద్రాలో ఆయన నివాసం ఉంటున్న గెలాక్సీ అపార్ట్‌మెంట్ బయట ఇద్దరు ఆగంతుకులు కాల్పులు జరిపారు. ఆదివారం తెల్లవారుజామున 4.50 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహనంపై వచ్చి సల్మాన్ నివాసం వద్ద గాల్లోకి నాలుగైదు రౌండ్లు కాల్పులు జరిపి పారిపోయారని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఓ బుల్లెట్ సల్మాన్ ఇంటి బాల్కనీలో పడిందని వారు చెప్పారు. కాల్పులు జరిగిన సమయంలో సల్మాన్ ఇంట్లోనే ఉన్నారని, ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదని తెలిపారు. దుండగులు వాడిన బైక్‌ను పట్టుకున్నామన్నారు.

ఇది ట్రైలర్ మాత్రమే: బిష్ణోయ్ సోదరుడు

ఈ కాల్పులు తామే జరిపామని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఇది ట్రైలర్ మాత్రమేనని చెప్పారు. ఇదే చివరి హెచ్చరిక అని, ఈసారి కాల్పులు ఇంటి బయట మాత్రమే జరగబోవని హెచ్చరించారు. సల్మాన్‌ఖాన్‌కు ఇప్పటికే పలుమార్లు చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. గతేడాది మార్చిలోనూ ఆయనకు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపు వచ్చింది.

సరబ్జిత్ సింగ్ హంతకుడు అమీర్ సర్ఫరాజ్ కాల్చివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: భారత్‌కు చెందిన సరబ్జిత్ సింగ్‌పై పాక్ జైల్లో దాడి చేసిన అమీర్ సర్ఫరాజ్‌ను పాకిస్తాన్‌లోని లాహోర్‌లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం కాల్చి చంపారు. పాకిస్తాన్‌లో ఇతడొక అండర్ వరల్డ్ డాన్. భారత్‌లోని పంజాబ్‌కు చెందిన సరబ్జిత్‌ను గూఢచర్యం ఆరోపణలపై 1990లో పాక్ అధికారులు అరెస్టు చేశారు. అతడు పాక్‌జైల్లోనే 23ఏళ్లు ఉండాల్సి వచ్చింది. భారత్‌లో అఫ్జల్ గురుని ఉరితీసిన కొద్దిరోజుల కు లాహోర్‌లోని కోట్ లక్పత్ జైల్లోఉన్న సరబ్జిత్(49)పై అదే జైల్లోని సర్ఫరాజ్, మరికొందరు ఖైదీలు 2013మేలో దాడి చేశారు. తలకు తీవ్రగాయాలైన అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ గుండెపోటుతో మరణించాడు.

కెనడాలో భారతీయ విద్యార్థి హత్య

వాంకోవర్, ఏప్రిల్14: కెనడాలోని వాంకోవర్ నగరంలో భారతీయ విద్యార్థి చిరాగ్ అంటిల్ (24) శుక్రవారం రాత్రి హత్యకు గురయ్యాడు. ఆయన వాహనంలో ఉండగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. హరియాణాకు చెందిన చిరాగ్ 2022లో కెనడాకు వచ్చి ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయంలో ఎంబీఏ పూర్తి చేశాడు. వర్క్ పర్మిట్ పొంది ఈ నగరంలో ఉంటున్నాడు.

చెన్నై సమీపంలో వెయ్యి కిలోల బంగారం స్వాధీనం

చెన్నై, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): చెన్నై సమీప కుండ్రత్తూర్ వద్ద మినీ లారీలో తరలించిన 1,000 కిలోల బంగారు కడ్డీలను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 425 కిలోల బంగారు కడ్డీలకు సంబంధించి రసీదులు, ఆధారపత్రాలు ఉండడంతో తిరిగి ఇచ్చేశారు. శ్రీ పెరుంబుదూర్ లోక్‌సభ నియోకవర్గ పరిధిలో కుండ్రత్తూర్ జంక్షన్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కుండ్రత్తూర్ నుంచి శ్రీ పెరుంబుదూర్‌కు వెళ్తున్న మినీ లారీని ఆపి తనిఖీ చేసి బంగారు కడ్డీలు గుర్తించారు. లారీలో ప్రయాణిస్తున్న వారిని విచారించగా, చెన్నై విమానాశ్రయం నుంచి శ్రీ పెరుంబుదూర్ సమీపం మాండూరు పంచాయతీలో ఉన్న ఓ గోడౌన్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న జనసేనాని పవన్ కల్యాణ్

అంబేడ్కర్ ఆశయాలు ఆచరణలోకి రావాలి

- రాజ్యాంగ నిర్మాతకు చంద్రబాబు, పవన్ నివాళి

అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వంతో పాటు సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమ న్యాయం చేకూర్చేందుకు కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కొనియాడారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆదర్శాలు, ఆశయాలను ఆచరణలోకి తీసుకురావడమే ఆ మహనీయునికి మనం అందించే అసలైన నివాళి అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అలాగే టీడీపీ జాతీయ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పార్టీ నేతలు యనమల రామకృష్ణుడు, వర్ల రామయ్య, దేవినేని ఉమా, అశోక్‌బాబు, శ్రావణ్‌కుమార్, మాణిక్యాలరావు తదితరులు నివాళులర్పించారు. సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం ద్వారా ప్రజలందరికీ హక్కులు, బాధ్యతలు కల్పించిన దూరదృష్టి కలిగిన విజ్ఞాని, అసమానతలు, దురహంకారంపై అలుపెరుగని పోరాటం చేయడమే కాకుండా సమసమాజ స్థాపన కోసం ఎలా జీవించాలో తన రచనల ద్వారా చైతన్యపరిచిన సంఘసంస్కర్త అంబేడ్కర్ అని చెప్పారు. ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లడమే నిజమైన నివాళని చెప్పారు.



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న షర్మిల